అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 28-11-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 282 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

కాల్పుల విరమణ

ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందం

14 నెలల పోరుకు స్వస్తి 11లో..



NDTV నేరపూరిత కుట్ర లేదు

అధికార దుర్వినియోగమూ జరగలేదు

అవన్నీ సాధారణ వ్యాపార లావాదేవీలే


బ్యాంకింగ్ చట్టం ఉల్లంఘన కాలేదు :

ప్రణయ్‌రాయ్, రాధికారాయ్‌ల మీద ఆరోపణలపై సీబీఐ నివేదిక 10లో.

నిగ్గు తేల్చాల్సిందే..

అదానీ ముడుపులపై దద్దరిల్లిన పార్లమెంట్.. పట్టుబట్టిన ప్రతిపక్షాలు

వాయిదాల పర్వంలో ఉభయ సభలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సిందేనంటూ ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో ఒక్కసారిగా పార్లమెంట్ దద్దరిల్లింది. ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభ వాయిదాల పర్వం కొనసాగింది. చివరికి ఈ రెండు సభలూ గురువారానికి వాయిదా పడ్డాయి. అదానీ లంచావతారం, సంభాల్ హింసపై చర్చించాలని, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షాలు కోరాయి. అందుకు ప్రభుత్వం సమ్మతించకపోవడంతో పార్లమెంట్ అట్టుడికింది. ఈ అంశాలపై చర్చించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీలు వాయిదా తీర్మానం ఇచ్చాయి. లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో చైర్మెన్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. ముందుగా బుధవారం ప్రారంభమైన లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. నిమిషాల వ్యవధిలోనే గురువారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారంపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుపట్టాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలో ప్రతిపక్ష పార్టీల నేతలు నినాదాలు చేశారు. దీంతో సభను **11.30** గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను చైర్మెన్ ధన్కర్ గురువారానికి వాయిదా వేశారు.

సంభాల్ హింసపై విచారణ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరపాలి : ఎస్పీ ఎంపీలు



ఉత్తరప్రదేశ్ సంభాల్ పట్టణంలో హింసకు దారితీసిన సంఘటనలపై ఏదైనా విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిర్వహించాలి. "సంభాల్‌లో జరిగిన సంఘటనపై చర్చ జరగాలని మేము కోరుకుంటున్నాం. దీనికి సంబంధించి మన ఎంపీలు స్పీకర్‌కి నోటీసులు ఇచ్చారు. పోలీసుల అమానవీయ ప్రవర్తన, ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చర్యల గురించి మేం సభా వేదికపై మాట్లాడాలనుకుంటున్నాం".

ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్

అదానీ జైల్లో ఉండాలి

కేంద్రమే రక్షిస్తున్నది : రాహుల్ గాంధీ



వేల కోట్ల రూపాయల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ జైల్లో ఉండాలి.చిన్న చిన్న ఆరోపణలపై వందలాది మందిని అరెస్టు చేశారు. అలాంటప్పుడు వేల కోట్ల రూపాయల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీనీ ఎందుకు అరెస్టు చేయటం లేదు."అదానీ ఆరోపణలను అంగీకరిస్తారని మీరు అనుకుంటున్నారా? ఆయన ఆరోపణలను తిరస్కరించబోతున్నాడని మీరు అనుకుంటున్నారు. అసలు విషయం ఏమిటంటే, ఆయనను ఇప్పటికే అరెస్టు చేయవలసి ఉంది. ఆ పెద్దమనిషి (గౌతమ్ అదానీ)పై అమెరికాలో వేల కోట్ల అభియోగాలు మోపారు. ఆయన జైలులో ఉండాలి. ఆయనని కేంద్రం రక్షించడం దారుణం".





ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

అధికారులు నిద్రపోతున్నారా? :

మధ్యాహ్న భోజనం వికటించడంపై హైకోర్టు ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందించే మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకే పాఠశాలలో వారం రోజుల్లో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించడంపై విస్మయాన్ని వ్యక్తం ...10లో

రూపాయి డీలా

డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై రూ.84.44కి



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోయింది. బుధవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై 84.44 స్థాయికి దిగజారింది. అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు ...11లో



వామ్మో..దొంగ నోట్లు

రూ. 500 ఫేక్ కరెన్సీ మూడు రెట్లు : కేంద్రం

నల్లధనాన్ని వెలికితీస్తామన్న మోడీ మాటలు ఉత్తవే

న్యూఢిల్లీ : భారత్‌లో పెద్ద నోట్లను రద్దు చేయడం ద్వారా దొంగ నోట్లను కట్టడి చేయడంతో పాటుగా దేశ, విదేశాల్లోని నల్లధనాన్ని వెలికితీస్తామని బీరాలు పలికిన ప్రధానీ నరేంద్ర మోడీ ఆచరణలో విఫలం అయ్యారు. నల్లధనం బయటికి ...11లో

గ్రూపులొద్దు..కలిసి పనిచేయండి

రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని స్ట్రాంగ్ వార్నింగ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీకి చెందిన రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పార్టీలో గ్రూప్ రాజకీయాలు, ఒకరిపై ఒకరు తెరవెనక కుట్రలకు స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. గ్రూపులుగా వీడి... రాష్ట్ర, జిల్లా, మండల కార్యకర్తలను ఆగం చేయొద్దని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అందరూ వ్యక్తిగత ఎజెండాలు విడిచి... పార్టీ స్టాండ్ లో ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. హైకమాండ్ ఇచ్చే సూచనలు సంయుక్తంగా అమలు చేసి వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు పార్లమెంట్‌లోని ...11లో

బీజేపీకి డౌన్ ట్రెండ్

కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోంది

రైతు భరోసా విధి, విధానాలపై కసరత్తు

ప్రభుత్వంపై కేటీఆర్ ఇష్టానుసారం విమర్శలు

తమ లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి, ప్రగతిశీల భావాలు

మంత్రులు పనిమంతులే..

బాగా కష్టపడుతున్నారు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

11లో..



బీఆర్ఎస్ గురుకుల బాట

30 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ

గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులపై అధ్యయనం : కేటీఆర్

10లో.


(ఫైల్)

మధ్యతరగతికి ఆర్థిక సవాళ్లు

పడిపోతున్న ఆదాయాలు



పట్టణ వినిమయంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : భారత్‌లోని మధ్యతరగతికి ఆర్థిక సవాళ్లు పెరిగాయి. ఆదాయాలు తగ్గడంతో వారి వినిమయంపైనా ప్రభావం పడుతోంది. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ నివేదిక ప్రకారం.. మధ్యతరగతిని ముఖ్యంగా మూడు సవాళ్లు వెంటాడుతున్నాయి. ఆర్థిక మందగమనానికి తోడు టెక్నాలజీ సమస్యలు, కుటుంబాల ఆదాయాలు క్షీణించడం. ఒకప్పుడు ఉపాధి పొందడంలో అత్యంత కీలకంగా ఉన్న మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు ఆటోమేషన్, ఇతర సాంకేతికతతో ఆ వర్గం వారికి ఉద్యోగాలను లేకుండా చేస్తోంది. అదే విధంగా కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లోనూ క్లరికల్, సూపర్‌వైజరీ పోస్టులు తగ్గాయి. "అవుట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వాటితో ఖర్చు తగ్గించే చర్యల కారణంగా అనేక మేనేజర్ స్థాయి పోస్టులు అదృశ్యమవుతున్నాయి. ఎఐతో కొన్ని ఉద్యోగాలు పోతున్నాయని ఇటీవల విప్రో చైర్మెన్ ప్రేమ్‌జీ వ్యాఖ్యలే నిదర్శనం. వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఇబ్బందులు పెరుగుతున్నాయి." అని నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ మాజీ చైర్మెన్ పిసి మోహనన్ పేర్కొన్నారు. కరోనా తర్వాత భారత వృద్ధి మందగించింది. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలోకి నెట్టబడింది. 2008 ఆర్థిక పతనం వంటి సంక్షోభం కాకపోయినప్పటికీ 2024-25 సెప్టెంబర్ త్రైమాసికంలో కార్పొరేట్ ఆదాయాలు భారీగా తగ్గాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో ఇదే ...11లో

నేటి నుంచి రైతుల పండుగ

మూడు రోజులు విజయోత్సవాలు

మహబూబ్‌నగర్‌లో నిర్వహణ

ఏడాదిలో రైతుల సంక్షేమానికి

సర్కారు చేసిన ఖర్చు రూ.55 వేల కోట్లు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా ప్రజాప్రభుత్వం గురువారం నుంచి మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తున్నది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు వ్యవసాయ, దాని అనుబంధశాఖలతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలో రైతు సంక్షేమం కోసం రూ.55,336 కోట్లను ఖర్చు చేసినట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేశారు. 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ కోసం ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించినట్టు ప్రభుత్వం పేర్కొంది. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.5 వేల చొప్పున మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. నష్ట పరిహారం అందేలా పంటల బీమా ప్రీమియం రూ. 1,300 కోట్లు చెల్లించారు. ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.5 లక్షలు బీమా పరిహారం చెల్లించేలా రైతు బీమా పథకం ప్రీమియం రూ. 1,455 కోట్లు చెల్లించారు. ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించామని ప్రభుత్వం తెలిపింది. దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించారు. రైతు నేస్తం పథకం ద్వారా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, సలహాలు సూచనలు అందచేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో క్షేత్రస్థాయి పోస్టుల్ని భర్తీ చేశారు. ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2 వేలు అదనపు ఆదాయం లభించేలా అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రైతు రుణమాఫీకి రూ.17,869 కోట్లు, రైతు భరోసాకు ...11లో

ఇథనాల్ పరిశ్రమకు బ్రేక్

పనుల నిలిపివేతకు కలెక్టర్ ఆదేశం



దిలావర్‌పూర్ నుంచి ఫ్యాక్టరీని తరలించాలని ప్రభుత్వానికి నివేదిక

రిలే దీక్షలు విరమించిన రైతులు

గ్రామాల్లో సంబురాలు

పొలాల కోసం ఏడాది పాటు పోరు సల్పిన రైతాంగం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతుల పోరాటం ఫలించింది. పచ్చని పంట పొలాల్లో నుంచి విషాన్ని వెదజల్లే ఇథనాల్ పరిశ్రమను తరిమేసే వరకు విశ్రమించలేదు. పచ్చని పంట పొలాలను కాపాడుకునేందుకు గ్రామాలన్నీ ఐక్యంగా పోరాడాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. పెద్దఎత్తున రణం సాగించారు. మంగళవారం ఉదయం నుంచి రోడ్డుపై బైటాయించి ఆందోళన కొనసాగించారు. చివరకు ప్రభుత్వం దిగొచ్చింది. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడ్నుంచి తరలించేలా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపివేయించిన జిల్లా కలెక్టర్.. పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇందుకు సానుకూలంగా స్పందించినట్టు ...10లో

3లో.. **శిండే సరెండర్**

'మహా' సీఎంను తేల్చేది ప్రధానే

నా నిర్ణయాన్ని ఆయనకే వదిలేశా

ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు

అజిత్ పవార్ స్టాండ్‌పైనే ఉత్కంఠ

3లో.. **చిన్నారులకు నో సోషల్ మీడియా**

ఆస్ట్రేలియా దిగువ సభలో బిల్లు ఆమోదం

మాదాపూర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

- రెండోసారి ఈదులకుంట పరిశీలన
- రెండు మండలాల రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని అధికారులకు సూచన



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పర్యటించారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల సరిహద్దుల్లోని ఖానామెట్ విలేజ్ రెవెన్యూ సర్వే నంబర్ 7లోని ఈదులకుంటను రెండోసారి ఆయన పరిశీలించారు. ఆరెకరాల విస్తీర్ణంలో ఈదులకుంట చెరువు ఉండేదని, కాలక్రమేణా చెరువులోకి నీళ్లను వెళ్లకుండా నాలా మార్గం మార్చి ఒక బడా రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాకు ప్రయత్నం చేస్తోందని సీపీఐ(ఎం) నాయకులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చెరువును కాపాడాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ గతంలో ఒకసారి పరిశీలించగా మళ్లీ బుధవారం పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు మండలాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

పలుమార్లు వినతులతోనే మరోసారి పర్యటన : సీపీఐ(ఎం) నాయకులు శోభన్

గతంలో హైడ్రా కమిషనర్ పర్యటించిన అనంతరం నిర్మాణ పనులు ఆపేసిన ఆ రియల్ ఎస్టేట్ సంస్థ.. మళ్లీ నిర్మాణ పనులను వేగవంతం చేసిందని సీపీఐ(ఎం) నాయకులు శోభన్ అన్నారు. ఇదే విషయాన్ని తాము కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రెండోసారి పర్యటించారని తెలిపారు. ఆయన పర్యటన తమ పోరాటానికి బలాన్ని ఇచ్చిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ సంస్థ చెరువుకు పక్కన ఉన్న ఒక ప్రయివేట్ సర్వే నెంబర్ ప్రకారం పర్మిషన్ తీసుకుని చెరువులో నిర్మాణం చేపడుతోందని చెప్పారు. గతంలోనే ఈ విషయంపై రెవెన్యూ, ఇరిగేషన్, వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. ఈ పర్మిషన్‌పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మాగనూర్ పాఠశాలను సందర్శించిన స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

విద్యార్థులు, ఉపాధ్యాయులతో విచారణ
వంట గది, సరుకులు, తాగునీరు పరిశీలన



నవతెలంగాణ-మాగనూర్

నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ జరగడం, మంగళవారం కూడా విద్యార్థులను ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ చేసేందుకు వచ్చిన విద్యాశాఖ డైరెక్టర్ కలెక్టర్‌తో కలిసి పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యం, వంట గది, పరిసరాలను, వంటకు ఉపయోగించే సరుకులను పరిశీలించారు. తాగు నీటి నమూనాలను మిషన్ భగీరథ అధికారులు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని పెడుతున్నారా లేదా అని వంట ఏజెన్సీ నిర్వాహకులను డైరెక్టర్ ప్రశ్నించారు. వంటకు ఉపయోగించే బియ్యాన్ని, పప్పు, ఉప్పు, కారం, పసుపు నూనెను చూశారు. మధ్యాహ్నం భోజనానికి సిద్ధం చేసిన అన్నం, పాలకూరను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరానికి వెళ్లిన ఆయన విద్యార్థులకు ఏ ఏ పరీక్షలు చేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని, డాక్టర్ సౌభాగ్య లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి సాధారణ పరీక్షలు చేస్తున్నారని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైతే రక్త పరీక్షలు చేస్తారని ఆమె వివరించారు. పాఠశాలకు ఏఏ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారని? వసతి గృహాల నుంచి కూడా వస్తారా అని ఆరా తీశారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రం, స్థానికంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు కూడా వస్తారని ఉపాధ్యాయులు తెలిపారు.

అనంతరం ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలంతో కలిసి హెచ్ఎం గదిలో ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, గ్రామ మహిళా సమైక్య సభ్యులు, పదో తరగతి విద్యార్థులతో వేర్వేరుగా మంగళవారం జరిగిన ఘటన తాలూకు విచారణ నిర్వహించారు. వరుసగా పాఠశాలలో ఎందుకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రశ్నించారు. మంగళవారం మధ్యాహ్నం భోజనాన్ని ఎవరు పరిశీలించారని ఉపాధ్యాయులను అడిగారు. వంటకు ఉపయోగించే సరుకులు పాత స్టాక్ ఏమైనా ఉన్నాయా? అని డైరెక్టర్ ప్రశ్నించారు. అన్నీ పరిశీలించిన తర్వాతే మధ్యాహ్న భోజనం వండించామని, తాము తిన్న తర్వాత విద్యార్థులకు వడ్డించామని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో 400 మంది విద్యార్థులు భోజనం చేయగా, కొంతమందే ఎందుకు అస్వస్థతకు గురయ్యారని అడిగారు. ఇకపై పాఠశాలలో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు రొటేషన్ పద్ధతిన రోజూ నాణ్యత ప్రమాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులతోపాటు పదో తరగతి విద్యార్థులతో కమిటీ వేయాలని సూచించారు. రోజూ వారీగా ఆ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్నం వంటకు ముందు, వంట చేసిన తర్వాత భోజనాన్ని పరిశీలించి తిన్న తర్వాత విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. మంగళవారం కొందరు విద్యార్థులు స్వల్ప జ్వరంతో ఉన్నట్టు తెలిసిందని, ఒకరిద్దరు విద్యార్థులు పచ్చి కందికాయలు తిన్నట్టు విద్యార్థులతో మాట్లాడే సమయంతో తెలిసిందని ఆయన అన్నారు.

అనంతరం విద్యార్థులతో కలిసి రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ.వెంకట నరసింహారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ భోజనం చేశారు. పాఠశాలలో అన్నింటినీ పరిశీలించామని, నీటి నమూనాలు సేకరించి పరీక్షించామని మీడియాకు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇకపై పాఠశాలలో రోజువారీ పరిశీలన ఉంటుందన్నారు. ప్రతి రోజూ తాజా కూరగాయలు, నాణ్యతతో కూడిన వంట సామగ్రిని ఉపయోగిస్తారని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్‌లు క్షేత్రస్థాయిలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తారన్నారు. వారి వెంట స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ కూడా ఉన్నారు. అన్నీ బాగున్నా ఎందుకీ ఘటనలు జరుగుతున్నాయన్న దానిపై అధికారులకు అంతు చిక్కడం లేదు. మొదటి రోజు ముర్రిగిన కోడి గుడ్లు అస్వస్థతకు కారణమని తెలుస్తోంది. మిగతా రెండ్రోజులు వంట విషయంలో ఎటువంటి లోపాలు లేవని అధికారులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

మిల్లర్లు, అక్రమాలు అరికట్టాలి

రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ-ఐనవోలు

ధాన్యం కొనుగోళ్లలో గత ప్రభుత్వంలో జరిగిన లోపాలు తిరిగి జరగకుండా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సివిల్ సప్లయ్ మిల్లర్లు ఏకమై గతంలో జరిగిన మోసాలని మళ్ళీ కొనసాగిస్తున్నారని, ఈ విధానాన్ని అరికట్టాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి హెచ్చరించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అనేక విషయాలు ప్రతినిధి బృందానికి వివరించారు. ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తెచ్చి 15 రోజులు అవుతున్నా కొనుగోలు చేయడం లేదని, తేమశాతం ప్రభుత్వం నిర్ణయించిన దానికి లోపు ఉన్నా కాంటాలు పెడతలేరని తెలిపారు. క్వింటాకు 5కిలోలు కోత పెడుతున్నారని, సరైన టైమ్‌లో గన్నీ బ్యాగులు, టార్పలిన్లు ఇవ్వడం లేదని అన్నారు. కాంటాలు అయిన తర్వాత బిల్లులు ఇవ్వడం లేదని, ఐకేపీ కాంటాలకు వేసినా మళ్లీ మిల్లర్లు కోతలు పెడుతూ డబ్బులు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ సిమెంటు గద్దెలు గానీ, టార్పాలిన్లు గానీ లేకుండా ధాన్యాన్ని నేలపై పోయడంతో మట్టి కలుస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో షెడ్లు లేకపోవడంతో అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిసి పనికిరాకుండా పోతుందని, దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు రావడానికి టోకెన్ ఇచ్చినప్పటికీ అందుకు కావాల్సిన గన్నీ బ్యాగులు సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఐకేపీ సెంటర్లు కాంటాలు పెట్టిన తర్వాత కూడా మిల్లర్లు తూకంలో కోత పెడుతూ డబ్బులు తగ్గిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రైతులతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు గుండెకారి మహేందర్, మండల అధ్యక్షులు మడిగే నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కుంకాల నారాయణరెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

30న రైతు పండుగను విజయవంతం చేయాలి

- విశ్వాసం కోల్పోయిన ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి అన్నారు. రైతులు, ప్రజలు ఆ పార్టీల మాటలు నమ్మొద్దని కోరారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే జిల్లా రైతు పండుగ సదస్సును విజయవంతం చేయాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం మీడియా సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపడమే ధ్యేయంగా ప్రతిపక్ష పార్టీల నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా సంకుచిత మనస్తత్వంతో ఇష్టారీతిన వ్యవహరిన్నాయని అన్నారు. ప్రజలు తిరస్కరించడం వల్ల అధికారం కోల్పోయిన అసహనంతో ఒక పార్టీ, మతతత్వ వాదంతో అడ్డదారిన అందలం ఎక్కేందుకు మరికొన్ని పార్టీలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా రూ.రెండు లక్షల వరకు రుణమాఫీని చేశారని వివరించారు. కొన్ని అంశాల్లో సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ డబ్బులు రైతులకు జమ కాలేదనీ, త్వరలోనే వారికి కూడా రుణ మాఫీ జరిగి తీరుతుందని అన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని భూత్పూర్, అమిస్తాపూర్ ప్రాంతంలో ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రజలు, రైతులను ఉద్దేశించి మాట్లాడతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఈనెల 30 వరకు భూత్పూర్, అమిస్తాపూర్ ప్రాంతంలో మూడు రోజులపాటు రైతు పండుగ సదస్సు జరగనుందని వివరించారు. ఈ సదస్సు ఎగ్జిబిషన్‌లో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారనీ, వ్యవసాయం దాని అనుబంధ సంస్థలకు సంబంధించిన అంశాలను ప్రదర్శిస్తారని వివరించారు. గురువారం ఈ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బందూలాల్, విశ్రాంత వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ల కార్మికుల ధర్నా



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సెప్టిక్ ట్యాంకర్ల కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. వరదల కారణంగా గత మూడు నెలలుగా దానవాయిగూడెం వద్ద ఉన్న మలమూత్ర విసర్జనను శుద్ధి చేసే యంత్రం రిపేర్‌లో ఉంది. ఎన్నిసార్లు రిపేర్ చేయించాలని అడిగినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో సెప్టిక్ ట్యాంకర్లతో కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ప్రజల ఇండ్లలో సెప్టిక్ ట్యాంక్‌లు నిండిన మలమూత్ర వ్యర్థాలను ఎక్కడ డంపు చేయాలో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే శుద్ధి యంత్రాన్ని రిపేర్ చేయించి పునరుద్ధరించాలని ట్యాంకర్ల డ్రైవర్లు డిమాండ్ చేశారు.

టీటీడీ బోర్డు చైర్మెన్‌ను కలిసిన భూపాలపల్లి ఎమ్మెల్యే

నవతెలంగాణ-భూపాలపల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు చైర్మెన్ బీఆర్ నాయుడుని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు, తన (ఎమ్మెల్యే) సిఫారసు లేఖల ద్వారా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను అనుమతించాలని కోరారు. ఈ సమయంలో అక్కడ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ నంసింహాచార్యులు ఉన్నారు.

విద్వేషం... విభజన రాజకీయం

మైనారిటీలపై విషం చిమ్ముతున్న బీజేపీ నేతలు

ఎన్నికల ప్రసంగాల్లో అసత్యాలు, ఆరోపణలు

సమాజంలో దెబ్బతింటున్న సోదరభావం

దేశమంతా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని రాష్ట్రపతి, ప్రధాని మొదలు భారతావని యావత్తూ గుర్తు చేసుకొని గర్వంతో పులకించిపోయింది. రాజ్యాంగం దృష్టిలో ప్రజలంతా సమానులే. కానీ నేడు దేశంలో జరుగుతున్నదేమిటి? మతోన్మాదం జడలు విప్పి మైనారిటీలను అభద్రతాభావంలోకి నెట్టేస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రే ఎన్నికల ప్రచారాలలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ విభజన రాజకీయాలకు తెర తీస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని మత ప్రాతిపదికన విభజించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మానవ హక్కుల కార్యకర్త రామ్ పునియని 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌కు అందించిన విశ్లేషణాత్మక కథనం...

న్యూఢిల్లీ : మైనారిటీలను కించపరచడానికి, వారిని ద్రోహులుగా చిత్రీకరించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నాయి. ఈ సంస్థల నేతలు తమ ప్రసంగాలలో మైనారిటీలపై విషం చిమ్ముతుంటారు. విద్వేష ప్రసంగాలు చేసే వారిని చట్ట ప్రకారం శిక్షించవచ్చు. అయితే వారిలో చాలా మంది ఆ శిక్షల నుండి తప్పించుకుంటూనే ఉన్నారు. గత దశాబ్ద కాలంగా దేశంలో మతతత్వ పార్టీ అధికారంలో ఉండడంతో మైనారిటీలను ద్వేషించే సంస్కృతి ప్రబలిపోయింది. ముఖ్యంగా వాట్సప్ గ్రూపులలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. వీటి కారణంగా సమాజంలో సోదరభావం దెబ్బతింటోంది. చివరికి శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న ముస్లింలను కించపరుస్తూ 'అవి పిల్లలను కనే ఫ్యాక్టరీలు' అని తూలనాడే వరకూ వెళ్లారు.

'ధరించే దుస్తులను బట్టి వారిని గుర్తించవచ్చు. వాళ్లు మన పవిత్ర గోమాతను వధించే హంతకులు. మన బాలికలు, మహిళలను లవ్ జిహాద్ పేరుతో ఆకర్షిస్తున్నారు'....ఇవన్నీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న వ్యాఖ్యలే. ఈ జిహాద్ సిరీస్‌లో తాజాగా ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ అనే పదాలు కూడా కలిశాయి.



ఆ మాటే ఎత్తరట

బీజేపీ, మోడీ మాత్రం తాము ముస్లింలకు వ్యతిరేకం కాదని నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎన్నికల్లో మీరు ముస్లిం వ్యతిరేక ప్రచారం చేశారు కదా అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మోడీ బదులిస్తూ 'రాజకీయాల్లో హిందూ-ముస్లిం గురించి మాట్లాడే మొదటి రోజు నుండే నేను ప్రజా జీవితానికి అనర్హుడిని అవుతాను. హిందూ-ముస్లిం అనే మాటే ఎత్తను. అది నా సంకల్పం' అని చెప్పారు. మాటలకు, చేతలకు మధ్య ఎంత వ్యత్యాసం ఉంటుందో ఇక్కడ కన్పిస్తోంది. ఏదేమైనా విద్వేషం ఒకవైపు వెలివేతకు దారితీస్తుంటే మరోవైపు ముస్లిం సమాజాన్ని రెండో తరగతి పౌరసత్వం వైపు నెడుతోంది.

ఎన్నికల ప్రచారంలో...

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ డజన్ల కొద్దీ విద్వేష ప్రసంగాలు చేశారు. ఆ ఎన్నికల్లో మోడీ 110 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని హ్యూమన్ రైట్స్ వాచ్ అనే సంస్థ తెలిపింది. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి మోడీ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా మెజారిటీ హిందూ సమాజంలో భయాందోళనలు రేకెత్తించారని ఆ సంస్థ తన నివేదికలో చెప్పింది. ఇక్కడ మరో ఉదాహరణను చూద్దాం. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మోడీ ప్రస్తావిస్తూ అవి కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు హామీలు అని ఎద్దేవా చేశారు. 'భారత్‌ను ఇస్లామీకరణ చేసేందుకు, దేశాన్ని విభజన దిశగా నడిపేందుకు జరుగుతున్న నీచ ప్రయత్నాలలో ఇది ఓ భాగం. యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆ సమయంలో కూడా కొన్ని ప్రయత్నాలు చేసింది. దీనిపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించింది. అది జస్టిస్ వర్మ కమిటీ నివేదిక కానీండి...లేదా సచార్ కమిటీ నివేదిక కానీండి. అవన్నీ ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల రిజర్వేషన్లను లూటీ చేసేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే' అని మోడీ చెప్పుకొచ్చారు.

విడిపోతే వధిస్తారు

ఈసారి బీజేపీకి చెందిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుండి ఓ నినాదం వెలువడింది. అదేమిటంటే 'మనం విడిపోతే మనల్ని వధిస్తారు'. హిందువుల ఐక్యతను దృష్టిలో పెట్టుకొని ఆయన ఈ వ్యాఖ్య చేశారు. యోగి వ్యాఖ్యను బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ సమర్థించింది. ఆ సంస్థకు చెందిన దత్తాత్రేయ హొసాబలే మాట్లాడుతూ 'ముఖ్యమైన విషయమేమిటంటే హిందువులు సంఘటితంగా ఉంటే అది అందరికీ ప్రయోజనకరం. హిందువుల ఐక్యత అనేది సంఘ్ జీవితకాల ప్రతిజ్ఞ' అని స్పష్టం చేశారు. ఆదిత్యనాథ్ ప్రకటనను ప్రధాని మోడీ కొంచెం సవరిస్తూ 'హిందువులు ఐక్యంగా ఉంటే సురక్షితంగా ఉంటారు' అని అన్నారు. మైనారిటీల కారణంగా హిందువులు ప్రమాదంలో ఉన్నందున వారిని సురక్షితంగా ఉంచాలంటే హిందూ ఐక్యతే పునాది అని చాటిచెప్పడమే బీజేపీ నేతల ఉద్దేశమని అర్థమవుతోంది.

జార్ఖండ్‌లోనూ...

ఇటీవల జరిగిన జార్ఖండ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ మతోన్మాద ధోరణి మరోసారి బయటపడింది. జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బీజేపీ నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రాష్ట్రంలోని ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించారు. ఎన్నికల సమయంలో ముస్లింలను కించపరిచేలా బీజేపీ ఓ అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చింది.

ఓ పెద్ద ముస్లిం కుటుంబం హిందువుల ఇంటిపై దాడి చేసి, దానిని ఆక్రమించినట్లు అందులో చూపారు. వాస్తవానికి జార్ఖండ్‌కు అంతర్జాతీయ సరిహద్దు ఏదీ లేదు. అలాంటప్పుడు హిందువుల ఇంటిని ఆక్రమించుకున్న ఆ ముస్లింలు ఎవరు? ఈ ఎన్నికల ప్రకటనపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఎలక్షన్ కమిషన్ దానిపై ఆంక్షలు విధించింది. కానీ దాని లక్ష్యం అప్పటికే నెరవేరింది. ఆ ప్రకటనకు సంబంధించిన వీడియో అనేక ప్రాంతాలలో అందుబాటులోకి వచ్చింది.

జార్ఖండ్‌లో మరో విద్వేష ప్రచారానికి కూడా తెర లేపారు. ముస్లింలు ఆదివాసీలను వివాహం చేసుకుంటారని, వారి భూములు స్వాధీనం చేసుకుంటారని తప్పుడు ప్రచారం చేశారు. అయితే ఈ వాదనకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు, గణాంకాలు చూపలేకపోయారు. అది కేవలం విభజన రాజకీయాలకు మాత్రమే ఉద్దేశించిన ప్రచారం. 'మీ రోటీని, బేటీని, మట్టిని ముస్లిం చొరబాటుదారులు లాగేసుకుంటారు' అనే నినాదాన్ని ప్రచారంలో పెట్టారు. ఈ ప్రకటన వచ్చింది వేరెవరి నుండో కాదు. సాక్షాత్తూ ఈ దేశ ప్రధాని మోడీ నుండే.

ముస్లింలపై వ్యతిరేకత నూరిపోస్తూ...

బీజేపీకే చెందిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ పైన దృష్టి సారించడంతో సరిపెట్టుకోకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అర్బన్ నక్సల్స్, ఆల్ట్రా లెఫ్ట్ భాగస్వాములయ్యాయని నిందించారు. ఈ దుష్ప్రచార ప్రభావం హిందూ సమీకరణ విషయంలో కాకుండా దాని ద్వారా ఓటింగ్ సరళిలో కూడా కన్పిస్తోంది. ఇప్పుడు హిందూ కుటుంబాలలో వేలాది వాట్సప్ గ్రూపులు విషాన్ని తలకెక్కిస్తున్నాయి. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) అనే సంస్థ ఈ ఏడాది మార్చి 28 నుండి ఏప్రిల్ వరకూ ఓ అధ్యయనాన్ని నిర్వహించింది. హిందువులు ముస్లింలను ఎలా చూస్తున్నారో తెలుసుకునేందుకు అందులో ప్రయత్నించింది. ముస్లింల విష యంలో హిందువుల్లో నెలకొన్న దురభిప్రాయం ఆ అధ్య యనంలో తేట తెల్లమైంది. మన సమాజంలో కూడా ఇదే అభిప్రాయం నెలకొన్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

అదానీ ప్రాజెక్టుకు రుణ సాయంపై పునఃపరిశీలన : అమెరికా సంస్థ

వాషింగ్టన్ : అదానీ గ్రూప్ సహకారంతో చేపట్టిన శ్రీలంక ఓడరేవు ప్రాజెక్టుకు 553 మిలియన్ డాలర్ల రుణాన్ని అందించే విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఓ అమెరికా సంస్థ పునఃసమీక్షిస్తోంది. అవినీతి, మోసం ఆరోపణలపై అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, మరో ఏడుగురిపై అమెరికా న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలైన నేపథ్యంలో అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనే సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో పోర్ట్



టెర్మినల్ ప్రాజెక్టుకు 553 మిలియన్ డాలర్ల రుణాన్ని అందజేసేందుకు గత నవంబరులో ఈ సంస్థ అంగీకరించింది. ఈ ప్రాజెక్టులో అదానీ గ్రూప్ సహ భాగస్వామిగా ఉంటోంది. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని ఆ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. తమ ప్రాజెక్టులు, భాగస్వాములు ఉన్నత ప్రమాణాలు పాటించేలా చూస్తామని ఆయన చెప్పారు. కాగా రుణ ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టుకు అమెరికా సంస్థ ఇప్పటి వరకూ ఒక్క డాలరు కూడా అందజేయలేదు.

ప్రతీకార చర్యలు తప్పవు

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో మెక్సికో అధ్యక్షురాలి లేఖ

మెక్సికో సిటీ : మాదకద్రవ్యాల రవాణాను, శరణార్థులను కట్టడి చేయకపోతే అమెరికా నుండి వచ్చే ఉత్పత్తులపై 25శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో తాము కూడా ప్రతీకార చర్యలు తీసుకుంటామని మెక్సికో ప్రకటించింది. ఈ మేరకు మెక్సికో అధ్యక్షుడు క్లాడియా షబ్నమ్ ఒక ప్రకటన జారీ చేశారు. ఇలాంటి పెనాల్టీలు విధించడం వల్ల అమెరికాకు వెళ్ళే శరణార్థులు లేదా మాదకద్రవ్యాల రవాణా ఆగదని అన్నారు. పైగా ఇరు దేశాల్లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి కారణమవుతాయని తెలిపారు. దానికి బదులుగా ఈ సవాళ్ళను ఎదుర్కొనడంలో పరస్పరం సహకరించుకోవాలని ఆమె పిలుపిచ్చారు. విధించిన ప్రతి పన్నుకు ప్రతిగా తాము కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు స్తంభించేవరకు ఇది కొనసాగుతుందన్నారు. ఈ మేరకు ఆమె ట్రంప్‌నకు మంగళవారం ఒక లేఖ రాశారు. చట్టవిరుద్ధమైన ఇమ్మిగ్రేషన్, ఫెంటానిల్ మాదకద్రవ్యాల సంక్షోభం నేపథ్యంలో ట్రంప్ సోమవారం మాట్లాడుతూ కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అమెరికా నుండి భారీగా ఆయుధాలు అక్రమ రవాణా అవుతున్నాయని వాటివల్ల మెక్సికో తీవ్రంగా ఇబ్బందులు పడుతోందని షబ్నమ్ చెప్పారు. అయినా ఇలా టారిఫ్‌లు విధించడం వల్ల కలిగే ప్రయోజనాలేంటని ఆమె ప్రశ్నించారు.

శిండే సరెండర్

'మహా' సీఎంను తేల్చేది ప్రధానే
నా నిర్ణయాన్ని ఆయనకే వదిలేశా

- ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- అజిత్ పవార్ స్టాండ్‌పైనే ఉత్కంఠ



ముంబయి : మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనేదానికి ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం బీజేపీ, శివసేన, ఎన్సీపీల మధ్య ముక్కోణపు పోటీ నెలకొన్నది. ఈ నేపథ్యంలో సీఎం ఎంపిక విషయంలో శివసేన(చీలికవర్గం) అధినేత, ఆ రాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే బీజేపీ హైకమాండ్‌కు సరెండర్ అయ్యారు. "మహారాష్ట్ర తదుపరి సీఎంను తేల్చే విషయంలో నా నిర్ణయాన్ని ప్రధాని మోడీ, బీజేపీ అధినాయకత్వానికి వదిలేశాను. నేను అడ్డంకి కాబోనని ప్రధానికి చెప్పాను. ఆయనేది నిర్ణయిస్తే దాని ప్రకారమే వెళ్తాం" అని థానేలో నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శిండే ఈ వ్యాఖ్యలు చేశారు. "నేను ప్రధానితో మాట్లాడాను. మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు విషయంలో పూర్తి మద్దతిస్తానని ఆయనకు నేను హామీనిచ్చాను. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో బీజేపీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా.. శివసేన మద్దతిస్తుంది. మీరు (ప్రధాని) మా కుటుంబ పెద్ద. బీజేపీ వారు మీ నిర్ణయాన్ని ఆమోదించినట్టే మేము కూడా కట్టుబడి ఉంటాం. నా వల్ల ప్రభుత్వ ఏర్పాటులో ఎలాంటి సమస్యా ఉండదని నిన్న(మంగళవారం) మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి చెప్పాను" అని ఏక్‌నాథ్ శిండే తెలిపారు. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వ విషయంలో బీజేపీ హైకమాండ్ నిర్ణయాన్ని ఒప్పుకుంటానంటూ శిండే సంకేతాలివ్వటాన్ని బట్టి చూస్తే తదుపరి సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్‌కు మార్గం దాదాపు సుగమమైనట్టేనని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి.

మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనేదానిపై ప్రతిష్టంభనను తొలగించటానికి బీజేపీ అధినాయకత్వం సిద్ధమైంది. మహాయుతి నాయకులు ఢిల్లీకి రావాలని పిలుపు వచ్చింది. వారితో అధినాయకత్వం సమావేశమై ప్రస్తుత అనిశ్చితిపై చర్చించనున్నది. దీంతో ఏక్‌నాథ్ శిండే, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌లు ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం. అమిత్ షాతో సమావేశం అనంతరం సీఎం పదవి, ప్రభుత్వ ఏర్పాటుపై ఒక స్పష్టత వచ్చే అవకాశమున్నదని తెలుస్తున్నది. కాగా, బీజేపీ హైకమాండ్‌ను కలవటానికి దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే ఢిల్లీ వెళ్లారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీలో 230 సీట్లతో భారీ విజయాన్ని నమోదు చేసిన మహాయుతి కూటమి.. కొత్త సీఎం ఎంపిక విషయంలో తర్జనభర్జనలు పడుతుండటం గమనార్హం. కొత్త సీఎంను నిర్ణయించే విషయంలో కూటమిలోని మూడు పార్టీలు కూర్చోని, నిర్ణయం తీసుకుంటాయనీ, కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే చెప్పారు. ఇక శివసేనలోని సంజయ్ షిర్సాత్ వంటి నాయకులు మాత్రం ముఖ్యమంత్రి పదవి శిండేకే ఇవ్వాలని తెలపటం గమనార్హం. "ఏక్‌నాథ్ షిండే ఉప ముఖ్యమంత్రి పదవిని ఎప్పటికీ ఒప్పుకోరు. ఏక్‌నాథ్ శిండే పేరు మీదే ఎన్నికల్లో పోటీ చేశాం. సీఎం పదవిని మళ్లీ చేపట్టటానికి ఆయన అర్హుడు" అని సంజయ్ షిర్సాత్ ఇప్పటికే వ్యాఖ్యానించారు. తదుపరి సీఎంగా ఫడ్నవీస్‌కు ఇటు ఆరెస్సెస్, అటు కూటమిలో భాగస్వామి అయిన ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ల మద్దతు ఉన్నదని ప్రచారం జరుగుతోంది. అయితే అజిత్ పవార్ బాబాయ్ శరద్‌పవార్‌పైనే తిరుగుబావుటా ఎగురవేశారు. మరీ సీఎం ఛైర్ గేమ్‌లో ఆయన ఏవిధంగా రెస్పాండ్ అవుతారో వెయిట్ అండ్ సీ..



గుండెపోటుతో సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి మృతి

పొంగులేటి, తమ్మినేని, కూనంనేనితోపాటు పలువురు నివాళి
డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి, తుమ్మల సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్(64) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఖమ్మంలో బుధవారం ఉదయం వాకింగ్ చేస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. స్థానికంగా ఉన్న అతని స్నేహితులు ప్రాథమిక చికిత్స అందిద్దామనుకునే లోపే ఆయన మరణించారు. ప్రసాద్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మరణవార్తతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు సీపీఐ కార్యాలయానికి చేరుకున్నారు. కాగా, ప్రజల సందర్శనార్థం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు.

ప్రసాద్ మృతదేహంపై సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పార్టీ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం ప్రసాద్ మరణంతో నిజమైన కమ్యూనిస్టును కోల్పోయిందన్నారు. పోటు ప్రసాద్ మృతిపట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అమెరికాలో ఉన్న నారాయణ పోటు ప్రసాద్ కుమారుడు స్వాతిక్‌తో మాట్లాడి మనోధైర్యం కల్పించారు.

పలువురు నివాళి

రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పి. సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఆవులారి మధు, గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్, రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, టీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మాజీ ఎంఎస్‌సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలాన, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.కె. సాబీర్ పాషా, గన్నా చంద్రశేఖర్, దండి సురేష్, విద్యాసంస్థల యాజమాన్యాలు, గ్రానైట్ అసోసియేషన్స్ ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.గోర్కీ, డాక్టర్ వై.ప్రసాద్, డాక్టర్ భారవి, డాక్టర్ యలమంచలి రవీంద్రనాథ్, న్యాయవాదులు, ప్రజా సంఘాల బాధ్యులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పలువురి సంతాపం

పోట ప్రసాద్ మృతిపట్ల ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ సంతాపాన్ని ప్రకటించారు. ఎంపీలు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, రామసహాయం రఘురామరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నవతెలంగాణ రీజియల్ మేనేజర్ ఎస్కే జావిద్, సిబ్బంది సిహెచ్. నారాయణ, ఇ.వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు, వీ6 బ్యూరో ఇన్‌చార్జి సయ్యద్ ఖదీర్ తదితరులు సంతాపం తెలిపారు.

చిన్నారులకు నో సోషల్ మీడియా

ఆస్ట్రేలియా దిగువ సభలో బిల్లు ఆమోదం

సిడ్నీ : 16 ఏండ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించిన విషయంలో ఆస్ట్రేలియా ఒక అడుగు ముందుకేసింది. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లు ఆలస్యం విషయంలో గూగుల్, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలు ప్రయత్నాలు చేసినా.. దిగువ సభ మాత్రం ఆమోదించటం గమనార్హం. ఈ బిల్లుకు ఆస్ట్రేలియా పార్లమెంటులోని ప్రతినిధుల సభలో 102 మంది సభ్యులు మద్దతివ్వగా, 13 మంది వ్యతిరేకించారు. ఈ బిల్లుకు మేజర్ పార్టీలు మద్దతు పలికాయి. ఈ బిల్లు ప్రకారం.. 16 ఏండ్ల లోపు వయసున్న చిన్నారులు సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉండటాన్ని నిరోధించే విషయంలో విఫలమైతే.. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలు 50 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్ల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు అమలు



తర్వాత పెనాల్టీలను ఎదుర్కొనే ముందు.. వయో పరిమితులను అమలు చేయటానికి సోషల్ మీడియా కంపెనీలకు ఒక సంవత్సరం సమయం ఉంటుంది. పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై ఆస్ట్రేలియాలో మిశ్రమ స్పందన లభిస్తున్నది. బ్యాన్ మంచిదేననీ కొందరు అంటుండగా.. నిషేధం చిన్నారులను ఒంటరి చేస్తుందనీ, డార్క్ వెబ్‌కు వారు ఆకర్షితులవుతారని కొందరు విమర్శకులు అంటున్నారు.

రోహింగ్యాలపై నేరాలకు పాల్పడిన

మయన్మార్ సైనిక నేతపై చర్యలు ?

అరెస్టు వారంట్ల జారీ యోచనలో ఐసీసీ

నెపిడా : ముస్లిం మైనారిటీలైన రోహింగ్యాలను హింస, వేధింపులకు గురి చేయడం ద్వారా మయన్మార్ మిలటరీ నేత మిన్ ఆంగ్ హ్లాయింగ్ మానవాళికి వ్యతిరేకంగా పాల్పడిన నేరాలకు అరెస్టు వారంట్లు జారీ చేయాలని భావిస్తున్నట్లు అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసీసీ) ప్రాసిక్యూటర్ బుధవారం తెలిపారు. మయన్మార్, బంగ్లాదేశ్‌ల్లో రోహింగ్యాలను వేధిస్తూ, వారిని దేశం నుంచి తరిమివేసినందుకు నేరపూరితమైన బాధ్యత వహించడానికి తగిన కారణాలు వున్నాయా లేదా అన్న అంశంపై ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన కమిటీ నిర్ణయించనుంది. అయితే వారు నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి అంటూ లేదు. కానీ అరెస్టు వారంటు జారీ చేయాలంటే కనీసం మూడు నెలలు పడుతుందని అంచనా. కాగా దీనిపై మయన్మార్ పాలక జుంటా ప్రతినిధి వ్యాఖ్యానించడానికి తిరస్కరించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, మాజీ రక్షణ చీఫ్ యోవ్ గాలంట్‌లకు అరెస్టు వారంట్లు జారీ అయిన నేపథ్యంలో మయన్మార్ నేతపై కూడా ఈ తరహా చర్యలు చేపట్టాలని అమెరికా సహా పలు దేశాలు ఐసీసీపై ఒత్తిడి తెస్తున్నాయి. దాంతో ఈ విషయంపై ఆలోచన చేస్తున్నట్లు ఐసీసీ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. 7,30,000వేల మందికి పైగా రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. కాగా ఊచకోత ఆరోపణలను మయన్మార్ తిరస్కరిస్తోంది. పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని, తీవ్రవాదులపైనే తమ చర్యలని చెబుతోంది.

వాట్సాప్, జీమెయిల్ వద్దు

- అధికారిక డాక్యుమెంట్లను వాటి ద్వారా పంపొద్దు
- థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌లకు జమ్మూకాశ్మీర్ నో
- సమగ్రత, భద్రత కారణాలుగా చూపుతూ నిషేధం
- ప్రభుత్వాధికారులకు ఆదేశాలు

మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం



జమ్మూకాశ్మీర్ : అధికారిక డాక్యుమెంట్లను పంపించే విషయంలో థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌లైన వాట్సాప్, జీమెయిల్‌లను ఉపయోగించటాన్ని జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం నిషేధం విధించింది. సమగ్రత, భద్రతను కారణాలుగా పేర్కొన్నది. థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌ల ఉపయోగం ద్వారా ఉండే ముప్పును ఎత్తి చూపింది. ఈ మేరకు సున్నితమైన, అధికారిక సమాచార మార్పిడి విషయంలో ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం.. గోప్యత, పరిమిత సమాచార మార్పిడి, ప్రసారం కోసం ప్రభుత్వాది.కారులు ఇక ప్రభుత్వ ఈమెయిల్ సర్వీసులను, దాని తక్షణ సురక్షిత సందేశ ప్లాట్‌ఫామ్‌లను కచ్చితంగా ఉపయోగించాలే ఆదేశాలు జారీ అయ్యాయి. సున్నిత, రహస్య, గోప్యమైన సమాచార ప్రసార విషయంలో థర్డ్-పార్టీ టూల్స్ అయిన వాట్సాప్, జీమెయిల్, ఇలాంటి ఇతర ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తున్న ట్రెండ్ అధికారుల్లో పెరిగిపోతున్నదన్న విషయం యంత్రాంగం దృష్టికి వచ్చిందని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ సెక్రెటరీ సంజీవ్ వర్మ అన్నారు. థర్డ్-పార్టీ టూల్స్‌ను ఉపయోగించటం ద్వారా అది అనధికారిక యాక్సెస్, సమాచార ఉల్లంఘన, రహస్యమైన సమాచార లీక్‌కు దారి తీయగలదని తెలిపారు. వాట్సప్, జీమెయిల్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లు లేవని ఆయన నొక్కి చెప్పారు. అలాంటి టూల్స్‌ను ఉపయోగించటం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల సమగ్రత దెబ్బతింటుందనీ, తీవ్రమైన భద్రతా ఉల్లంఘనలకు దారి తీస్తుందని తెలిపారు. వీటికి బదులుగా ప్రభుత్వ మెసెజింగ్ ప్లాట్‌ఫామ్‌లైన ఎన్‌ఐసీ ఈమెయిల్, సంవాద్, సందేశ్‌లను ఉపయోగించాలని ప్రభుత్వాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

నవతెలంగాణ

సంపాదకీయం

మూలాల్లోకి వెళ్లాలి...

పుండెక్కడుందో.. మందక్కడే వేయాలంటారు పెద్దలు. అప్పుడే అది తగ్గుతుంది. ఈపని చేయకపోవటం వల్లే రాష్ట్రంలో ఇప్పుడు ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతమవుతున్నాయి. ఫలి తంగా విద్యార్థులు బలైపోతున్నారు. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించింది. మొత్తం ఎనభై మంది పిల్లలు ఆస్పత్రి పాలయ్యారు. ఇలాంటి ఘటనలే రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల చోటు చేసుకోవటం ఆందోళనాకరం.

మాగనూరు పాఠశాలకు సంబంధించి మొదటి ఘటన అశ్రద్ధ, నిర్లక్ష్యం వల్లే సంభవించిందని చెప్పక తప్పదు. పౌర సరఫరాలశాఖ సరఫరా చేసిన బియ్యాన్ని బాగు చేయకుండా (గ్రేడింగ్) నేరుగా వండితే పురుగులు రాకుండా ఇంకేం వస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు ఆహార నిపుణులు. అందువల్ల ఆ ఒక్క పాఠశాలే కాదు...తెలంగాణలోని మిగతా బడుల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది సైతం పిల్లలకు పెట్టే భోజనం విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఇదే సమయంలో అదే పాఠశాలలో సోమవారం నాటి ఘటనపై విచారణకు వెళ్లిన స్థానిక తహశీల్దార్, అక్కడి ఉపాధ్యాయులు కూడా వాస్తవాలను తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులకు వడ్డించిన భోజనాన్నే తినటాన్ని మనం అభినందించాల్సిందే. ఇదే శ్రద్ధ, చొరవతో అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు ఉపాధ్యాయులది కూడా.

ఇక గురుకులాల విషయానికొస్తే... గత ప్రభుత్వ విధానపరమైన లోపాలు, నిర్ణయాలు... నేటి రేవంత్ సర్కారుకు శాపాలుగా మారాయి. బీఆర్ఎస్ సర్కారు హడావుడిగా, అనాలోచితంగా ప్రారం భించిన గురుకులాల్లో అత్యధికం అద్దెభవనాల్లో కొనసాగుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,022 గురుకులాలు ఉంటే... వాటిలో సగానికి పైగా అంటే 660 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వీటిలో వంటశాలలు, బియ్యం, కూర గాయలు, ఇతర సామగ్రి భద్రపరుచుకు నేందుకు ప్రత్యేకంగా స్టోర్ రూమ్‌లంటూ ఏమీ లేవు. దీంతో అవన్నీ పాడైపోతున్నాయం టున్నారు అక్కడి సిబ్బంది. దీనికితోడు వంటల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కేర్ టేకర్లుగానీ, వార్డెన్లు గానీ లేకపోవటం విద్యార్థులకు శాపంగా మారింది. ఫలితంగా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇటు వంటలను, అటు బోధనను చూసు కోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో రెండింటిలో ఏఒక్క దానిమీద కూడా పూర్తి శ్రద్ధను పెట్టలేకపోతున్నా మని వాపోతున్నారు టీచర్లు. అంతిమంగా ఇది విద్యా ప్రమాణాల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని తేలింది.




ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా... సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే.

నేటి బాలలే రేపటి పౌరులు... వారు చదువులు, ఆటపాటల్లో రాణించాలంటే పౌష్టికాహారం అవసరం. అది లేకే వందలాది మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సర్కారు గుర్తెరగాలి. ప్రభుత్వ బడులపై పకడ్బందీ పర్యవేక్షణ ఉండేలా చేయటం ద్వారా ఈ సమస్యల నుంచి విద్యార్థులను బయటపడేయొచ్చు. అందుకోసం విద్యా రంగానికి చాలినన్ని నిధులు కేటాయించాలి. సొంత భవనాలు నిర్మించాలి, సరిపడా సిబ్బందిని నియమించాలి. ఆ దిశగా సర్కారు ప్రయత్నాలు ప్రారంభించాలి. లేదంటే మాగనూరు లాంటి ఘటనలు మరిన్ని పునరావృతమయ్యే అవకాశం లేకపోలేదు.

> రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా... సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే.

ఆకలి కేకల ప్రపంచం

దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని చెప్పే పాలకులకు పేదల ఆకలికేకలు కనిపించవు. ఆర్తనాదాలు వినిపించవు. ఎవరికి వారు తమది పేద దేశం కాదని, ప్రపంచంలోనే ధనిక దేశాలతో పోటీపడుతున్నామని చెబుతున్నవారి డొల్లతనాన్ని తాజాగా ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక బయటపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 731 నుంచి 757 మిలియన్ల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రతి 11 మందిలో ఒక్కరు ఆకలి వలయంలో చిక్కి ఇక్కట్లపడుతున్నారని పేర్కొంది. ఐరాస ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన "స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ 2024 (ఎస్ఓఎఫ్ఐ-2024)" నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం చూస్తే ఆహార అభద్రత, పోషకాహార లోపాలు ప్రపంచ మానవాళిని వెంటాడుతున్నాయి. ఆసియా



ఖండంలోనే అత్యధిక పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రజలున్నారు. 2023లో దాదాపు 2.33 బిలియన్ల ప్రపంచ ప్రజలు సాధారణ లేదా తీవ్రమైన ఆహార అభద్రతలో బతుకులు ఈడుస్తున్నారు. తీవ్రమైన ఆహార అభద్రతలో 864 మిలియన్ల ప్రపంచ ప్రజలున్నారు. ప్రతి ఒక్కరికి రోజుకు సగటున దాదాపు 3.96 డాలర్లు ఆరోగ్యకర భోజన ఖర్చులవుతున్నాయి. దీంతో 55.6 శాతం భారతీయులు ఆరోగ్యకర భోజనాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఐదేండ్లలోపు పిల్లల్లో స్టంటింగ్, వేస్టింగ్ సమస్యలు తగ్గినా, ప్రపంచవ్యాప్తం స్థూలకాయ సమస్యలు పెరుగుతున్నాయి. 15నుంచి 40 ఏండ్ల లోపు మహిళల్లో రక్తహీనత పెరుగుతూ ప్రజారోగ్యం పెద్దసమస్యగా ముందుకొస్తున్నది.

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 194.6 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపాలతో జీవిస్తున్నారు. దీర్ఘ కాలం పాటు ఆహార అభద్రత సమస్యలతో సతమతమవుతూ 13 శాతం ప్రజలు తీవ్రమైన పోషకాహార లోప సమస్యలతో బాధపడుతున్నారు. "2023 ప్రపంచ ఆకలి సూచీ" జాబితాలో భారత్ 111వ స్థానానికి దిగజారడం మన దుస్థితులను వివరిస్తున్నది. దక్షిణాసియా దేశాల్లో ఇండియాలోనే అత్యధికంగా 18.7 శాతం వేస్టింగ్, అధికంగా 31.7 శాతం స్టంటింగ్ సమస్యలు పిల్లలకు ఎదురవుతున్నట్టు నివేదిక ద్వారా తెలిసింది. పోషకాహారలోపం కలిగిన తల్లుల వల్ల 27.4 శాతం శిశువులు తక్కువ బరువుతో పుడుతున్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని వెల్లడైంది. భారతీయ మహిళల్లో 53 శాతం రక్తహీనత, 2.8 శాతం పిల్లల్లో/7.3 శాతం పెద్దల్లో స్థూలకాయం నమోదుకావడం ఆందోళనకరమైన అంశం. కోవిడ్-19 సమయంలో ఆదాయం పడిపోవడం, జీవనోపాధులు తగ్గడం, ఆహార సరఫరా శృంఖలం గాడి తప్పడంతో ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరిగిన మాట వాస్తవం. ఎస్ఓఎఫ్ఐ-2024 థీమ్‌గా "ఆకలి, ఆహార అభద్రత, పోషకాహారలోపాలను అంతం చేయడానికి ఆర్థిక పెట్టుబడులు కావాలి" అనబడే అంశాన్ని తీసుకుంది. ఈ లక్ష్యంతో వ్యవసాయ ఆధార పరిశ్రమల ఏర్పాటు లేదా బలోపేతం చేయడం, అసమానతల తొలగింపు, ఆహార భద్రతను గాడిలో పెట్టడం, పోషకాహార లభ్యతకు వనరుల కల్పన లాంటివి ఫలిస్తాయనే ఆశిస్తున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి చేరడానికి కావలసిన ఆర్థిక వనరులను ఆయా ప్రభుత్వాలు ప్రాధాన్యతాక్రమంలో కేటాయించాలని, 2030 నాటికి ఆకలి కేకలు వినిపించరాదని ఐరాస కోరుకుంటున్నది.

- బీఎంఆర్, 9949700037

రైతు కోసం గళమెత్తిన సంస్కర్త పూలే




ఎస్. వినయ కుమార్
9989718311

పందొమ్మిదో శతాబ్దపు సంఘ సంస్కర్తల్లో రైతుల గురించి పోరాడిన ఏకైక సంస్కర్త జ్యోతిరావు పూలే. జ్యోతిరావు తండ్రి గోవింద్‌రావు పూల వ్యాపారి. ఆయనకు కొంత భూమి ఉండేది. ఆ భూమిలో పూలు పండించి పూణేలోని తన అంగట్లో అమ్మేవాడు. చిన్నతనంలో జ్యోతిరావు కూడా పొలంలో, అంగడిలో పనిచేశాడు. అలా రైతు నేపథ్యం నుంచి వచ్చిన పూలే ఆనాటి శూద్రులు, అతి శూద్రులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై కూడా పోరాడారు. ఖండే అనే నాయకుడితో కలిసి బొంబాయిలో కార్మిక సంఘం నెలకొల్పారు. సామాజిక ఆర్థిక పోరాటాలు రెండింటినీ ఆయన నిర్వహించారు. చాలావరకు సామాజిక దోపిడీ, ఆర్థిక దోపిడీ కలిసే ఉంటాయి. మనదేశంలో మరీనూ. ప్రతిఘటన లేని ఆర్థిక దోపిడీకి సామాజిక పెత్తనం ఒక అదనపు సాధనం. గనుక పూలే రెండు రంగాల్లోనూ పోరాడారు. పూణే ప్రజలచేత 'మహాత్మా'అన్న బిరుదు పొందిన పూలే 11 ఏప్రిల్ 1827 పూణేలో పుట్టారు. 28 నవంబర్ 1890న మరణించారు.

ఆనాటి రైతు సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారు. దాదాపు 150 ఏండ్ల క్రితం 1883లో సేత్కార్యాచ అసూడ్ (సేద్యగాని చర్నాకోల) పేరుతో మరాఠీలో రైతు సమస్యలపై ఒక పుస్తకం రాశారు. అందులో రైతు శ్రమ ఫలితాన్ని మతాచారాల పేర పురోహితులు, భూవివాదాల్లో రైతులను మోసగించి కులకర్ణీలు, బ్రాహ్మణ ఉద్యోగులు అలాగే ప్రభుత్వం వారిని ఎలా దోచుకొంటుందో వివరంగా చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సూచనలు నేటికీ ప్రాసంగికమైనవే.

సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఎవరు ఎంత భుజం చరిచినా అది శూద్రులను, అతిశూద్రులను ఎలాంటి హక్కుల్లేని దాసులుగా మార్చింది. దాచి పెట్టలేని నిజం వర్ణాశ్రమ ధర్మాన్ని, పురాణాలను, వేదాలను సవాలు చేసిన పూలే రైతుల కోసం కూడా గళం విప్పారు. పూలేకు ముందు ఆ తర్వాత వచ్చిన అనేక మంది సంస్కర్తలు ఆంగ్లేయ విద్యతో, యూరప్ ఉద్యమాలతో స్ఫూర్తి పొంది హిందూమతంలో సంస్కరణల కోసం కృషి చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినట్టు ఆ సంస్కరణ సమాజంలోని అట్టడుగు తరగతులకు చేరలేదు. పూలే దానికి ఒక మినహాయింపు.

హిందూ మతంలో సముద్రయానంపై విధించిన నిషేధం కూడా దోపిడీలో భాగమేనని పూలే చెప్పారు. పశ్చిమ దేశాల విజ్ఞానాన్ని, అక్కడి మానవ హక్కులను మన దేశవాసులు గమనిస్తే తమ ఆధిపత్యానికి దోపిడీకి శిక్షఉషకు ప్రమాదం ఏర్పడుతుందని భావించిన ఆధిపత్య వర్గాలు భయపడ్డాయన్నారు. శూద్ర రైతుల దయనీయ స్థితికి మతపరమైన, సమాజపరమైన కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటినైనా చర్చకు పెట్టాలన్న ముఖ్య ఉద్దేశంతో తాను ఆ గ్రంథం రాశానని చెప్పారు. మతం మానవ కల్పితమే కాదు, అది క్రూరమైందని కూడా ఆయన అన్నారు.



బ్రాహ్మణోమమ దైవతం (బ్రాహ్మణుడే నా దైవం) అన్న భావన శూద్రరైతుల్లో ఉన్నంత కాలం వారు పీడన నుండి బయటపడరని చెప్పారు.

రైతును పురోహితులు దోచుకోవడం అతను పుట్టకముందు నుండే మొదలు పెడతారు. అతను చనిపోయాక ఉత్తర క్రియలు, శ్రాద్ధకర్మల పేర కూడా ఎలా దోచుకుంటారో పూలే తన పుస్తకంలో వివరంగా చెప్పారు. రైతు తల్లి గర్భం ధరించగానే బ్రాహ్మణులు ఏవేవో తంతులు జరిపించి కాసులు రాల్చుకొంటారు. ప్రతియేటా తద్దినాల పేర విందు భోజనాలు ఆరగించి సంభావనలు లాగుతారు. హిందువుల పండుగలన్నీ బ్రాహ్మణుల దోపిడీకి అక్కరకొచ్చేవే అంటూ పండుగల వారిగా రైతులను ఎలాదోచుకొంటారో విశదీకరించారు. క్రీ.పూ. చార్వాకులు కూడా ఇదే ప్రశ్నించారు. అతిథికి మిద్దె మీద పీట వేసి కింది అంతస్తులో విస్తరి వేసి వడ్డిస్తే మిద్దెమీదికి వాడికి చేరవు కదా? అని వారు ప్రశ్నించారు.

బ్రిటిష్ పాలనలో రైతులపై విధిస్తున్న భూమిశిస్తును కట్టలేని స్థితిని వివరిస్తూ పూలే ఒక విషయం చెప్పారు. గతంలో రాజుల దగ్గర సైనికులుగా, గుర్రాలు, పశువులు, ఒంటెలు, ఏనుగులకు సంరక్షకులుగా శూద్ర,అతిశూద్రుల కుటుంబాల నుండి ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారు. దానివల్ల ఆ కుటుంబాలకు భూమిశిస్తు చెల్లించడం ఒక సమస్యగా ఉండేది కాదు. ఇప్పుడు ఆ ఉద్యోగాలు లేవు, రైతులు భూమి శిస్తు చెల్లించలేక పోతున్నారని చెప్పారు. కేవలం కొద్దిపాటి భూమిపై ఆధారపడి జీవించే వారి స్థితి నేటికీ అలాగే ఉంది. భూమి శిస్తు లేకపోయినా రైతులు రకరకాల దోపిడీకి గురవుతున్నారు.

తక్కువ భూమి గల రైతులు గొర్రెలు, మేకలు, పశువులు పెంచుకొని కొంత ఆదాయం పొందేవారు. ఇప్పుడు బ్రిటిష్ పాలకులు పచ్చిక బయళ్లను కూడా అడవులుగా గుర్తించడం వల్ల జీవాలకు మేత లేదు. కనుక అడవుల్లో కొంత భాగాన్ని పశ్చికబయళ్ల కోసం గ్రామాలకు అప్పగించాలని కోరారు. బ్రిటిష్ వారి పారిశ్రామిక ఉత్పత్తులతో పోటీ పడలేక దేశంలోని వృత్తిదార్లు బతుకుదెరువు కోల్పోయారు. తిండి దొరకని స్థితికి చేరారు. అర్ధాకలితో చస్తున్నారని పూలే చెప్పారు. రైతులు ఆత్మహత్యల గురించి ఆయన ప్రస్తావించలేదు. కాని ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన మాత్రం వారికి కలుగుతోందని చెప్పారు.

బ్రిటిష్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఆయన వదల్లేదు. చదువు పేర స్థానిక పన్నుల రూపంలో లక్షల రూపాయలను వసూళ్లు చేస్తున్నారు. అందులో మూడోవంతు మాత్రమే అక్కడో ఇక్కడో స్థాపించిన బడులపై ఖర్చు చేస్తున్నారు. పిల్లలను బడికి పంపిస్తున్న రైతుల సంఖ్య చాలా తక్కువ. రైతులందరూ తమ పిల్లలను తప్పక బడికి పంపాలన్న ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేయాలని పూలే కోరారు. అలా నిర్బంధోచిత విద్య ఆవశ్యతను ఆయన నూట యాభై ఏండ్ల క్రితమే చెప్పారు. పాఠాలు చెప్పాల్సిన పంతుళ్ల పవిత్రం, అపవిత్రం అంటూ విద్యార్థులపై ఆంక్షలు పెడతారు. పైగా క్రతువుల నిర్వహణల్లో మునిగి చదువు చెప్పరు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదు. కనుక రైతుల పిల్లలు ఎంతమంది చదువుకున్నారు. వారిలో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగంలో చేరగల విద్యను పొందారు అన్న విషయాలను ప్రభుత్వం రాజ పత్రం (గెజిట్)లో ప్రచురించాలని పూలే డిమాండ్ చేశారు.

అన్ని ఉద్యోగాలను బ్రాహ్మణులే కాజేయకుండా వారి జనాభా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయించి మిగిలిన ఉద్యోగాలను శూద్ర, అతిశూద్రులకు ఇవ్వాలన్నారు. రైతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే రైతు కుటుంబాల నుండే టీచర్లు ఉండాలి. విద్యార్థులకు ఒక నిర్ణీత కాలం సాధారణ విద్యనందించి ఆ తర్వాత వ్యవసాయ సంబంధ శిక్షణనివ్వాలి. వారిలో సత్ప్రవర్తన గల విద్యార్థులను ఆరో తరగతి పాసయ్యాక గ్రామ పాటీళ్లుగా నియమించాలి. అలాచేస్తే బ్రాహ్మణ కులకర్ణీ (కరణాల)లు పెట్టే బాధల నుండి రైతులను తప్పించవచ్చు. కొంతకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం ఆపేసి ఆ ఉద్యోగాల్లోకి రైతు కుటుంబాల యువకులను తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. బ్రిటిష్ పాలకులు ఆ పని చేయకపోయినా పూలే అభిమాని సాహు మహరాజు తన రాజ్యంలో బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లను అమలు చేశారు.

ముప్పయేళ్లకు ఒకసారి ప్రభుత్వం భూమి శిస్తును సవరించేది. ఆ సమయంలో ఎంతోకొంత శిస్తును పెంచకుండా బ్రిటిష్ అధికార్లు ఒప్పుకోరు. పైగా భూమిని సర్వే చేస్తున్నప్పుడు అక్కడ ఉండాల్సిన బ్రిటిష్ అధికార్లు ఆ పనిని బ్రాహ్మణ ఉద్యోగులకు వదిలి వేటకు వెళ్తారు. ఒక క్రమపద్ధతి లేకుండా బ్రాహ్మణ ఉద్యోగులు శిస్తును పెంచుతారు. భూ వివాదాల కేసుల్లో బ్రాహ్మణ గుమస్తాలు రైతుల స్టేట్‌మెంట్లను మార్చి రాస్తారు.వాటి ఆధారంగా మెజిస్ట్రేట్లు తప్పుడు తీర్పులిచ్చి రైతులకు అన్యాయం చేశారు. ఎక్కువ భూమిగల రైతులు తమ భూమిని సాగు చేయక పడావు పెట్టారు. ఫలితంగా తిండి గింజల ఉత్పత్తి తగ్గుతుంది. పెరుగుతున్న జనాభాకు తగినట్లు పంటల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టదు. తమ గోడును కలెక్టర్‌కు చెప్పుకోవడానికి వచ్చిన రైతును బ్రాహ్మణ ఉద్యోగులు గోస పెడతారు. తప్పుడు సాకులతో రైతులను అరెస్టు చేయిస్తారు. కేసులు ఎత్తేయడానికి గుమాస్తాలు, పోలీసులు లంచాలు గుంజుతారు. వారు వడ్డీ వ్యాపారుల నుండి కూడా లంచాలు తీసుకొని రైతులను కష్టాల పాల్జేస్తారు. మద్యం, వేట ఈ రెండింటి మైకంలో పడిన ఆంగ్లేయ అధికారులు రైతుల గోస పట్టించుకోరని పూలే విమర్శించారు.

వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి కూడా పూలే పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో యూరప్ దేశాల తరహాలో ఆధునిక పనిముట్లను ప్రవేశపెట్టాలని, వాటి ఉపయోగంపై శిక్షణివ్వాలన్నారు. గోమాంస భక్షణను ఆయన వ్యతిరేకించలేదు. అయితే వ్యవసాయానికి అవసరమైన పశువుల సంఖ్య తగ్గకుండా ముస్లింలు, ఆంగ్లేయులు విదేశాల నుండి దిగుమతి చేసుకొని వాటి మాంసం తినాలన్నారు. వాగులపై ప్రభుత్వం చిన్న చిన్న ఆనకట్టలు కట్టి వర్షపునీటితో పాటు నదుల్లోకి పశువులను వెళ్లే భూసారాన్నీ కాపాడాలని కోరారు. కొండలు, గుట్టల్లో వీలైనన్ని చెరువులు కట్టించాలి. వాటి వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. పంటల దిగు బడులూ పెరుగుతాయి. సేద్యపు బావులు తవ్వుకొనే రైతులకు ప్రోత్సాహాలు అందించాలి. విదేశాలనుండి మేలు జాతి గొర్రెలను ప్రభుత్వమే దిగుమతి చేసుకొని ఆ జాతిని అభివృద్ధి చేయాలి. అడవి జంతువుల నుండి పంటలు కాపాడుకోవడానికి రైతులకు తుపాకీ ఉంచుకోవడానికి అనుమతినివ్వాలి. లేదంటే పంట నష్టాన్ని ఉన్నతాధికారుల జీతాల్లో కోసి రైతులకివ్వాలి.

కమ్మరి, వడ్రంగి పని నేర్చుకున్న రైతు కుటుంబాల పిల్లల్ని విదేశాలకు తీసుకెళ్లి అక్కడి వ్యవసాయ పాఠశాలలను, పంటపొలాలలను చూపెట్టాలి. దాని వల్ల వారు మెరుగైన వ్యవసాయ పరికరాలను తయారు చేయగలరు. లక్షలాది రైతులు సరైన తిండికీ, బట్టకు నోచుకోలేని దశలో పోలీసు, న్యాయశాఖ, మిలటరీ, రెవెన్యూ తదితర ఉద్యోగులకు ప్రభుత్వం భారీగా వేతనాలు, పింఛన్లు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు? అలా అని తక్కువ జీతం పొందే సైనికులు, కమ్మర్లు, వడ్రంగుల వంటి వారి జీతాలు తగ్గించరాదు. ఉన్నతాధికారుల జీతాలు తగ్గించాలని కోరారు. చిన్ననాటి ముస్లిం స్నేహితుల వల్ల తనకు హిందూ మతంలోని స్వార్థం ఏమిటో అర్థమయిందన్నారు. తనకు జ్ఞానభిక్ష పెట్టిన స్కాటిష్ మిషన్‌కు, ప్రభుత్వ పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు. తన అభిప్రాయాలను పుస్తక రూపంలో తెలియచేయడానికి స్వేచ్ఛనిచ్చిన బ్రిటిష్ ప్రభుత్వ రాజకీయ వ్యవస్థకు, పుస్తకం ప్రచురణకు ఆర్థిక సహాయం చేసిన బరోడా మహారాజుకు కూడా పూలే కృతజ్ఞతలు చెప్పారు.

(నేడు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి)

> అన్ని ఉద్యోగాలను బ్రాహ్మణులే కాజేయకుండా వారి జనాభా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయించి మిగిలిన ఉద్యోగాలను శూద్ర, అతిశూద్రులకు ఇవ్వాలన్నారు. రైతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే రైతు కుటుంబాల నుండే టీచర్లు ఉండాలి. విద్యార్థులకు ఒక నిర్ణీత కాలం సాధారణ విద్యనందించి ఆ తర్వాత వ్యవసాయ సంబంధ శిక్షణనివ్వాలి. వారిలో సత్ప్రవర్తన గల విద్యార్థులను ఆరో తరగతి పాసయ్యాక గ్రామ పాటీళ్లుగా నియమించాలి. అలాచేస్తే బ్రాహ్మణ కులకర్ణీ (కరణాల)లు పెట్టే బాధల నుండి రైతులను తప్పించవచ్చు. కొంతకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం ఆపేసి ఆ ఉద్యోగాల్లోకి రైతు కుటుంబాల యువకులను తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. బ్రిటిష్ పాలకులు ఆ పని చేయకపోయినా పూలే అభిమాని సాహు మహరాజు తన రాజ్యంలో

> భూ వివాదాల కేసుల్లో బ్రాహ్మణ గుమస్తాలు రైతుల స్టేట్‌మెంట్లను మార్చి రాస్తారు.వాటి ఆధారంగా మెజిస్ట్రేట్లు తప్పుడు తీర్పులిచ్చి రైతులకు అన్యాయం చేశారు. ఎక్కువ భూమిగల రైతులు తమ భూమిని సాగు చేయక పడావు పెట్టారు. ఫలితంగా తిండి గింజల ఉత్పత్తి తగ్గుతుంది. పెరుగుతున్న జనాభాకు తగినట్లు పంటల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టదు. తమ గోడును కలెక్టర్‌కు చెప్పుకోవడానికి వచ్చిన రైతును బ్రాహ్మణ ఉద్యోగులు గోస పెడతారు. తప్పుడు సాకులతో రైతులను అరెస్టు చేయిస్తారు. కేసులు ఎత్తేయడానికి గుమాస్తాలు, పోలీసులు లంచాలు గుంజుతారు. వారు వడ్డీ వ్యాపారుల నుండి కూడా లంచాలు తీసుకొని రైతులను కష్టాల పాల్జేస్తారు. మద్యం, వేట ఈ రెండింటి మైకంలో పడిన ఆంగ్లేయ అధికారులు రైతుల గోస పట్టించుకోరని పూలే విమర్శించారు.

సమస్యల మణిపురం - సంభావ్య పరిష్కారం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

మణిపూర్ మరలా మండుతోంది. మోడీ మణిపూర్ పోలేదని విపక్షాల విమర్శ. మణిపూర్ సమస్యను తీర్చమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్రపతికి లేఖ రాశారు. రాజ్యాంగాధికరణలు 370, 35ఎ కశ్మీరీలకు భూమి హక్కునిచ్చాయి. వీటి రద్దుతో కశ్మీర్ భూములను కార్పొరేట్లకిచ్చారు. లక్షద్వీప్ కేంద్ర పాలనాధికారి రాజ్యాంగ పరిమితి దాటి చట్టాలు చేశారు. ప్రకృతి సంపద, సముద్ర తీరాలు, నిర్జన ద్వీపాలను కార్పొరేట్లకు పంచారు. నేటి పాలకవర్గాల ఇలాంటి చర్యలే మణిపూర్ అల్లర్లకు కారణం.

2017లో 60 సీట్ల (40 మైతీలకు, 20 కుకీ, నాగా, జోమి గిరిజనులకు) మణిపూర్‌లో 21 సీట్ల బీజేపీ పభుత్వాన్ని ఏర్పర్చింది.వైదికవాద మెజార్టీ మైతీలను, సనమహిలను రెచ్చగొట్టి సంఘ్ సంస్థలు క్రైస్తవ కుకీలపై దాడిచేశాయి. వారితో ఆస్తులు, ఇండ్లు, పొరుగు పంచుకోవద్దని 2022 ఎన్నికల్లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మైతీలకు చెప్పారు. వారు ఈ గుజరాత్ నమూనాను పాటించారు. కుకీలు, నాగాలు మణిపూర్ లోయలో పిల్లలను చదివిస్తారు. చిన్న పనులతో అద్దె ఇండ్లలో బతుకుతారు. సంఘ్ దాడులతో పిల్లల చదువు, పెద్దల జీవనం ఆగాయి. డబులింజిన్ ప్రభుత్వంతో శాంతిభద్రతలు, జీవన ప్రమాణాలు పెంచుతా మని, మైతీలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా ఇస్తామని మోడీ ప్రచారం చేశారు.(సామాజిక, ఆర్థిక వెనుక బాటుతో రాజకీయ ప్రాతినిధ్యం పొందలేని మూలప్రాంతాల గిరిజనులకు రాజ్యాంగం ఎస్టీ హోదానిచ్చింది. మైతీలు దీనికి అనర్హులు) రాజ్యాంగ విరుద్ధ వాగ్దానాలతో దోచుకున్న 32 సీట్లతో 2022లో ప్రభుత్వాన్ని ఏర్పర్చారు.అభివృద్ధి నిధుల్లో 80శాతం మైతీలకు, 20శాతం గిరిజనులకిచ్చారు. పాలకవర్గ మైతీలకు 36 వేర్పాటువాద తీవ్రవాద సంస్థలపై ఆంక్షలను ఎత్తేశారు. అవి విజృంభించాయి. ఎస్టీ హోదా కోసం మైతీలు ఉద్యమించారు. వారి తీవ్రవాద సంస్థలు, సంఘ్ వత్తాసు పలికాయి. దీనికి గిరిజనులు నిరసన తెలిపారు. వీరిని అడ్డుకునేందుకు మైతీలు హింసకు పాల్పడ్డారు.

మణిపూర్‌లో మయన్మార్లు చొరబడ్డారని సంఘ్ ప్రచారం. నియంత్రిత ప్రాంత అనుమతితో విదేశీయులకు పదిరోజుల మణిపూర్ ప్రవేశం ఇస్తారు. అధికార అశ్రద్ధతో బర్మా చిన్ తెగవారు మణిపూర్‌లో చొరబడ్డారు. రోహింగ్య ముస్లింలను అడ్డుకున్న కేంద్రం వీరిని ఆపలేదు. బీజేపీ పాలిత గుజరాత్, రాజస్థాన్, హరియాణాలకు వైదిక విదేశీయులను రానిచ్చారు. వారికి పౌరసత్వం, ఓటు హక్కు ఇచ్చి 2014లో వారితో 19 ఎంపీ సీట్లు పొందారు. ఇదే ప్రయోజనాన్ని ఆశించి కేంద్ర రాష్ట్ర పాలకులే మణిపూర్‌లోకి బర్మీయులను రానిచ్చారు. కుకీల పర్వత ప్రాంతాల్లో బొగ్గు నిలువలున్నాయి. ఇటీవల చమురు,వజ్రాల నిక్షేపాలు కనిపెట్టారు. వాటిని కార్పొరేట్లకు ఇవ్వాలని బీజేపీ పాలకుల పన్నాగం. రక్షిత, వన్యప్రాణ అభయారణ్య అడవుల సాకుతో కుకీల భూములను ఆక్రమించారు. వారిని తరిమేశారు. కుకీలు నల్లమందు పండిస్తున్నారని వారి తోటలను ధ్వంసం చేశారు. పాలక మైతీల వాణిజ్యవేత్తలే నల్లమందు వ్యాపారం చేస్తారు. వారి డ్రగ్ సిండికేట్లు కుకీల నుండి నల్లమందును తక్కువ ధరకు కొంటారు. నల్లమందు పంటను, వ్యాపారాన్ని సొంతం చేసుకోవాలని వీరి పథకం. పోలీసులు అరెస్టుచేసిన నల్లమందు ముఠాలలో ముఖ్యమంత్రి బంధువులున్నారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, జాతి ద్వేషాలు కుకీలను నల్లమందు వైపునకు నెట్టాయి. పాలకులు సమస్యలను పరిష్కరిస్తే కుకీలు నల్లమందు జోలికిపోరు.



మణిపూర్ క్రైస్తవ జనాభా పెరిగిందని, వారు మైతీలను మించుతారని సంఘ్ ప్రచారం. 1961-2011 మధ్య యాభైఏండ్లలో క్రైస్తవులు ఐదు లక్షలు పెరిగారు. వైదికులూ పెరిగారు. క్రమేపి పెరిగిన జనాభా, ఓట్ల కోసం పాలక ఆమోదిత వలసలు, వైదిక వివక్షను భరించలేక క్రైస్తవానికి మార్పిళ్లు పెరుగుదలకు కారణం. క్రైస్తవ పెరుగుదలను ఆపడానికి జాతీయ పౌరసత్వ, జనాభా జాబితాలను తయారుచేయమని, 1951 జనాభా ప్రకారం పౌరసత్వాన్ని సవరించమని సంఘ్ గొడవచేసింది. దీనితో 95శాతం కుకీలు, నాగాలు పౌరసత్వం కోల్పోయి రాష్ట్రాన్ని వదలాలి. అల్లర్లలో ఆరు వేల ఆయుధాలు చోరీఅయ్యాయి. పోయింది వెయ్యేనని, 200 రికవరీ చేశామని ముఖ్యమంత్రి అన్నారు. అల్లర్లు జరిగిన చురాచందపూర్‌లోనే కాక రాష్ట్రమంతా (కేంద్ర, సైనిక, ప్రత్యేక దళాల భాండాగారాలను వదిలి) రాష్ట్ర రక్షణదళాల భాండాగారాల నుంచే చోరీలు జరిగాయి. ఒక్కటీ పట్టుబడలేదు. అన్ని స్టేషన్లలో పోలీసు నిర్లిప్తత అనూహ్యం. పాలకుల, అధికారుల మద్దతుతో ఈ ఆయుధాలు సంఘ్, మైతీ సంస్థలకు చేరాయి. చనిపోయిన 250 మందిలో 98శాతం, పారిపోయిన 6,500 మందిలో 70శాతం, గాయపడ్డ 500 మంది కుకీలు. కుకీల 20వేల ఇండ్లు, 200 చర్చిలు, 17 గుళ్లు, 124 గ్రామాలు, వారి ఆస్తులు, వాహనాలే బూడిదయ్యాయి. కుకీలను తీవ్రవాదులుగా చిత్రించి పాలకులే చంపారు. 3 జూన్ 2023న కేంద్రం నియమించిన దర్యాప్తు సంస్థ గడువుతీరినా నివేదిక నివ్వలేదు. గిరిజనులు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారు. ఈ సందులో మయన్మార్ సైనిక ఝుంతా మణిపూర్‌లో చొరబడగలదు.

స్త్రీలు, క్రీడాకళాకారులు, మేధావులు దేశవ్యాపితంగా నిరసనలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐరాస మానవహక్కుల సంస్థ, 550 మంది పౌరసమాజ ప్రతినిధులు, కేంద్ర పాలకులు జోక్యం చేసుకోవాలని, హత్యలు, హింసను, దమనకాండను ఆపాలని ఉత్తరాలు రాశారు. ప్రధాని, రాష్ట్రపతి పట్టించుకోలేదు. మోడీ మణిపూర్‌కు పోతే 'నీవిస్తానన్న ఎస్టీ హోదా ఎక్కడా?' అని నిలదీస్తారు. డబులింజిన్ డొల్లని విమర్శిస్తారు. మోడీ అక్కడికెళ్లినా నష్టమే. మణిపూర్ సమస్యకు విపక్షాలే కారణమంటారు. తాను సమస్యను పరిష్కరిస్తుంటే క్రైస్తవులు, కమ్యూనిస్టులు అడ్డుకున్నారంటారు. తన "ఘనత"ను ఘోషిస్తారు. నాలుగు వందల ఏండ్ల నాటి ముస్లిం పాలన, హిందు ఇస్లామీకరణ, క్రైస్తవీకరణలు మణిపూర్ మంటలకు మూలాలంటారు. ధృతరాష్ట్ర (వాట్సాప్) విశ్వవిద్యాలయ వత్తాసుదారులతో నమ్మిస్తారు.ప్రజాసేవకు, శ్రేయస్సుకు అంకితమవుతానని రాజ్యాంగాధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి ప్రమాణం చేశారు.

గిరిజన ముర్ముకు మణిపూర్ సొంత సమస్య. వందల స్త్రీల మానప్రాణాలు పోయాయి. గిరిజనులు హత్యలు, దోపిడీలకు గురయ్యారు. మణిపూర్ గిరిజన సంక్షేమానికి కొండ ప్రాంతాలను కాపాడే రాజ్యాంగాధికరణ 371సి ఇచ్చిన ప్రత్యేక హోదాను మోడీయం దుర్లక్ష్యం చేసింది.స్త్రీలు, తన జాతి ప్రజలకు ఇన్ని అన్యాయాలు జరిగినా, మణిపూర్ ప్రజాహింసకు సైనిక ప్రత్యేకాధికారాల చట్టం తిరిగి అమలయినా సర్వసైన్యాధిపతి ముర్ము మౌనంగా ఉన్నారు.దేశ ప్రతిష్ఠ, లౌకికత్వం, మానవత్వాల రక్షణకు ప్రభుత్వాధిపతికి సూచనలివ్వడం దేశాధిపతి బాధ్యత.

మోడీ కార్పొరేట్ ఫాసిజానికి, ఆశ్రిత కార్పొరేట్ల దోపిడీ, మోసాలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యపర్చాలి.లౌకిక సమాజ అవసరాన్ని వివరించాలి.మనముందే రాజ్యవ్యవస్థ కూలింది. మన క్షేమాన్ని మనమే పట్టించుకోవాలి. సామాన్యుల సమస్యల పరిష్కారానికి పోరాడిన చారిత్రక విప్లవవీరులెందరో మనకు ఆదర్శం. వారి పోరాటాలు సమస్యల నిరోధకాలు, పరిష్కారాలు. స్వేచ్ఛాసాధికార న్యాయబద్ధ జీవితాల సాధనాలు. ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారి పద్ధతి సామాన్యుల సమస్యలు పరిష్కరించదు. మనం ఒంటరులం కాదు. సామూహికంగా సమస్యలను పరిష్కరించుకోగల ఆలోచనాపరుల సంఘ సభ్యులం. శాంతిసౌఖ్యాల ప్రపంచ నిర్మాణానికి విప్లవమార్గం పడదాం.

> ప్రజాసేవకు, శ్రేయస్సుకు అంకితమవుతానని రాజ్యాంగాధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి ప్రమాణం చేశారు. గిరిజన ముర్ముకు మణిపూర్ సొంత సమస్య. వందల స్త్రీల మానప్రాణాలు పోయాయి. గిరిజనులు హత్యలు, దోపిడీలకు గురయ్యారు. మణిపూర్ గిరిజన సంక్షేమానికి కొండప్రాంతాలను కాపాడే రాజ్యాంగాధికరణ 371సి ఇచ్చిన ప్రత్యేక హోదాను మోడీయం దుర్లక్ష్యం చేసింది.స్త్రీలు, తన జాతి ప్రజలకు ఇన్ని అన్యాయాలు జరిగినా, మణిపూర్ ప్రజాహింసకు సైనిక ప్రత్యేకాధికారాల చట్టం తిరిగి అమలయినా సర్వసైన్యాధిపతి ముర్ము మౌనంగా ఉన్నారు.దేశ ప్రతిష్ఠ, లౌకికత్వం, మానవత్వాల రక్షణకు ప్రభుత్వాధిపతికి సూచనలివ్వడం దేశాధిపతి బాధ్యత.

ఎంఈవోలు రోజుకో పాఠశాల సందర్శించాలి : కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్ : తమ మండలంలో రోజుకో పాఠశాలను సందర్శిస్తూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఎంఈఓలకు సూచించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేటప్పుడు కార్మికులు అన్ని జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. సరుకుల నిల్వ గది, రికార్డులు పరిశీలించి నాణ్యత పాటిస్తున్నారో లేదో తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులతో మధ్యాహ్నం భోజనం చేసి ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. వీలైతే విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పాఠశాలకు రప్పించి వారి సమక్షంలో భోజనం చేయాలన్నారు. పౌష్టికాహారం విషయంలో రాజీ పడొద్దని, మెనూ పాటించేలా చూడాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులకు సెల్ ఫోన్ అనుమతించొద్దని చెప్పారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఆర్ఎంపీల వద్దకు వెళ్లకుండా పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధించేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓలకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

'చీమలకుంటపల్లి దళితులకు దారి చూపాలి'



నవతెలంగాణ - గన్నేరువరం
మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలోని 60 దళిత కుటుంబాలు నడిచే దారిని బంద్ చేసి ఇబ్బంది పెడుతున్నారని బుధవారం నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు గాజె అజయ్, గాజె రాములు కలిసి గ్రామ శివారులోని మాదిగోనికుంటకు నీళ్ల పోయే వరద కాలువను పూడ్చి, రోడ్డుకు అడ్డంగా ఎండిపోయిన చెట్లు వేసి నడవద్దని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు పరిశీలించి వరద కాలువను పునరుద్ధరించి 60 దళిత కుటుంబాలు నడవడానికి దారి చూపించాలని కోరారు. కార్యక్రమంలో బామండ్ల నరసయ్య, దుర్గయ్య, బాలయ్య, రాజయ్య, మొండయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను పట్టేస్తారు..

- అత్యాధునిక సీఈఐఆర్ విధానంతో సత్ఫలితాలు సాధిస్తున్న పోలీసులు
- గతేడాది ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఈ విధానం
- ఇప్పటివరకు కమిషనరేట్ వ్యాప్తంగా 1206ఫోన్లు ఆచూకీ గుర్తింపు
- బుధవారం ఒక్కరోజే 160ఫోన్లు బాధితులకు అప్పగింత
- ఫోన్‌పోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలి: సీసీఎస్ ఏసీపీ కాశయ్య

నిత్యజీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగంగా మారింది. పట్టుమని పది నిమిషాలు కూడా మొబైల్ లేకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఇందులో మనకు సంబంధించిన ఎన్నో విషయాలను, సమాచారాన్ని భద్రపరుచుకుంటాం. డబ్బు చెల్లింపుల నుంచి కాంటాక్టులు, మెసేజ్‌లు, ఫొటోలు, విజ్ఞానం, వినోదం.. ఇలా అన్నింటికీ సెల్ ఫోన్ పైనే ఆధారపడుతుంటాం. ఒకవేళ మన మొబైల్‌ను ఎవరైనా దొంగిలించినా, లేదా మనమే పొరపాటున పోగొట్టుకున్నా కంగారు పడిపోతాం. వెంటనే సెల్‌ఫోన్ వెతికేందుకు ప్రయత్నిస్తాం. ఇక దొరకకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. అలాంటి వారికి పోలీసులు అండగా నిలుస్తున్నారు. పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన సీఈఐఆర్ విధానంతో కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 1206 మంది బాధితులకు వారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన కారణంగా.. పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి పట్టుకోవడం సాధ్యమవుతోంది. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ పని చేయకుండా బ్లాక్ చేయడం.. అది దొరికాక తిరిగి అన్‌బ్లాక్ చేసుకునే సదుపాయం ఉంది. ఎవరైనా ఫోన్ పోయిన తర్వాత తొలుత మీసేవ కేంద్రంలో ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదు ప్రతిని భద్రపరచుకోవాలి. అనంతరం సెల్‌ఫోన్ స్టోర్‌కు వెళ్లి అదే నంబర్‌పై కొత్త సిమ్ తీసుకోవాలి. అప్పుడు ఆటోమేటిగ్గానే పాత సిమ్ బ్లాక్ అయిపోతుంది. అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ఓపెన్ చేస్తే కనిపించే అందులో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లో అప్పటివరకు వినియోగించిన ఫోన్ నంబర్లు, ఐఎంఈఐ నంబర్లతోపాటు అక్కడ అడిగిన ఇతర వివరాలను నమోదు చేయాలి. ఫిర్యాదు ప్రతి, వ్యక్తిగత గుర్తింపుకార్డు, ఫోన్ కొనుగోలు రశీదు (అందుబాటులో ఉంటే) అప్‌లోడ్ చేయాలి. అనంతరం.. 'మీ కొత్త సిమ్‌కు రిక్వెస్ట్ ఐడీ వస్తుంది. ఆ ఐడీ ఆధారంగా కేసు స్టేటస్‌ను తెలుసుకునే వీలుంటుంది.' ఇలా ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది ఆ ఫోన్‌ను బ్లాక్ చేసి పనిచేయకుండా చేస్తారు.



బాధితులకు తిరిగి సెల్‌ఫోన్లు అందిస్తున్న పోలీసులు

సిమ్ మార్చినా కనిపెట్టొచ్చు...

సాధారణంగా ఫోన్ దొంగిలించినా/దొరికినా.. వాళ్లు దానిలో కొత్త సిమ్ వేసుకొని వినియోగించుకోవాలని చూస్తారు. ఇలా బ్లాక్ చేసిన మొబైల్లో ఇతరులు ఎవరైనా సిమ్ కార్డ్ వేస్తే, వెంటనే సీఈఐఆర్‌కు అలర్ట్ మెసేజ్ వస్తుంది. పోలీసులతో పాటు దొంగిలించిన ఫోన్‌లో వేసిన కొత్త సిమ్‌కు మెసేజ్ వస్తుంది. అలా మెసేజ్ రాగానే పోలీసులకు ఫోన్ ఏ ప్రాంతంలో ఉందనే విషయం సులువుగా తెలిసిపోతుంది. వెంటనే పోలీసులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి విషయం వివరిస్తారు. ఇక దొంగిలించినా లేదా పొరపాటున దొరికినా ఆ ఫోన్‌ను తిరిగి ఇవ్వకుంటే చిక్కుల్లో పడే ప్రమాదం ఉందని గ్రహించి వెంటే మొబైల్‌ను తిరిగి ఇవ్వాల్సిందే.

మీ ఐఎమ్ఈఐ నంబర్ బ్లాక్‌లో ఉందా?

ఇక సాధారణంగా చోరీ చేసిన ఫోన్లను ఇతరులకు తక్కువ ధరకు విక్రయిస్తుంటారు. అలా కొనుగోలు చేసినప్పుడు చిక్కుల్లో పడకుండా ముందు జాగ్రత్తగా.. తాము ఎంచుకున్న ఫోన్ ఐఎమ్ఈఐ నంబర్ బ్లాక్ లిస్ట్‌లో ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం ముఖ్యం.

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

- కరీంనగర్ పోలీసు కమిషనరేట్ సీసీఎస్ ఏసీపీ కాశయ్య

సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనే ముందు సీఈఐఆర్ అప్లికేషన్‌లో ఆ ఫోన్ ఐఎమ్ఈఐ నెంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలి. దొంగిలించబడినా పోయిన మొబైల్‌ని తిరిగి పొందడానికి సీఈఐఆర్ అప్లికేషన్ ఎంతో దోహదపడుతుంది. 2023 ఏప్రిల్ నెలలో సీఈఐఆర్ విధానాన్ని వాడుకలో తీసుకొచ్చినప్పటి నుంచి కరీంనగర్ కమిషరేట్ వ్యాప్తంగా పోగొట్టుకున్న 1206 మంది మొబైల్ ఫోన్లను గుర్తించి బాధ్యులకు అప్పగించాం.

ఇంటింటా సౌర కాంతులు



సోలార్‌ప్యానల్స్‌తో ఉన్న ఇంటి పైకప్పు నమూనా

- పీఎం సూర్య ఘర్‌తో నిరంతర వెలుగులు
- పవర్ కట్.. లో ఓల్టేజీలకు చెక్
- సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1042 దరఖాస్తులు

నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సూర్యుడు ఉదయించకముందే ఇంటింటా సౌరకాంతులు వదజల్లే సమయం వచ్చింది. పవర్‌కట్, లో ఓల్టేజీకి కాలం చెల్లే రోజు రానే వచ్చింది. అవును.. ఇంటింటా నిరంతర విద్యుత్ కాంతులతోపాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్ ప్రాధాన్యత పెరుగుతోంది. ఇందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ అందిస్తుండటంతో ఈ పథకానికి స్పందన లభిస్తోంది. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1042 దరఖాస్తులు వచ్చాయి. అందులో జిల్లాల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ జిల్లాలో 529, జగిత్యాల జిల్లాలో 205, పెద్దపల్లి జిల్లాలో 308 ఉన్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వేస్టేషన్, రైల్వేగేట్లు, డివైడర్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. 'సూర్య ఘర్' పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహిస్తోంది. కేవలం గృహ లబ్ధిదారులకు మాత్రమే రాయితీలు వర్తిస్తాయి.

ప్యానల్స్... నెట్‌మీటర్ ఏర్పాటు ఇలా...

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్‌మీటర్ స్థానంలో నెట్‌మీటర్ ఏర్పాటు చేసి, దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి వినియోగం లెక్కిస్తారు. అలాగే ఇంటికి సరిపడిన దానికంటే ఎక్కువ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

సులభంగా పెట్టుబడి వెనక్కి...

ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి సబ్సిడీ, బ్యాంకు రుణంతోపాటు పెట్టుబడి అంతా ఆరు లేదా ఏడేండ్లలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. సూర్య ఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 100 చదవరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు మూడు లేదా నాలుగు ప్యానల్స్ వినియోగిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1042 దరఖాస్తులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సూర్య ఘర్ పథకం కోసం 2650 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 100 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఆయా దరఖాస్తుదారుల కిలోవాట్స్ వినియోగం ఉంటుంది. ఇప్పటి వరకూ పథకంలో భాగంగా 28 సోలార్ రూఫ్ టాప్‌లను ఆయా గృహాలు, అపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేశారు. మరో 31 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోగా, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

పథకాన్ని పొందండిలా...

- పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలి.
- ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్య ఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదు చేయాలి
- ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు ఎన్ని కిలోవాట్స్ తీసుకుంటున్నామనే దాన్ని బట్టి ఉంటుంది.
- 5కిలోవాట్స్‌కు రూ.1900, 5కిలో వాట్స్ పైబడితే రూ.5900, 10 కిలోవాట్స్ పైబడిన హెచ్‌టీ సర్వీసుదారులు రూ.11800 చెల్లించాలి.
- 3కిలోవాట్స్‌లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తరువాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి.
- కిలోవాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు.

సోలార్‌టాప్ సామర్థ్యం	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (నెలకు)
1కిలోవాట్	120
2కిలోవాట్	240
3కిలోవాట్	360

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి

- సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్
సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు కప్పుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. చలికాలం ప్రారంభమై చలి తీవ్రత రోజురోజుకీ పెరిగిపోతున్నా విద్యార్థులకు కనీసం దుప్పట్లు పంపిణీ చేయాలన్న శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని అన్నారు. సంక్షేమ హాస్టళ్లకు కనీసం దోమతెరలు లేక విద్యార్థులకు విష జ్వరాలు వస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు. సంక్షేమ హాస్టల్స్ అద్దె భవనాలలో అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమని విమర్శించారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రెండు సంవత్సరాలకు ఒకసారి బ్లాంకెట్ పంపిణీ చేస్తారు, చలికాలం ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు కూడా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదని తెలిపారు. అలాగే బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసే పద్ధతి లేదు, గతంలో ఎస్ఎఫ్ఐగా పోరాటం చేస్తే కలెక్టర్ ఫండ్ కింద ఒక సంవత్సరం మాత్రమే దుప్పట్లు పంపిణీ చేశారు, ఆ తర్వాత ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు దుప్పట్లు పంపిణీ చేయలేదన్నారు. వెంటనే బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రతి వారం హెల్త్ క్యాంప్ హాస్టళ్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సాగర్, ఇషాక్, సహాయ కార్యదర్శులు భోగేశ్వర్, నాగుల శ్రీజ, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్, సందేశ్, రాకేష్, గట్టు ఆకాష్, నాయకులు సన్నీ, వంశి, అక్షయ్, పవన్, తరుణ్, రఘు, రాకేష్, రిజ్వన, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు వీణాధరి విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని, ఎంఆర్ సి భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో వీణాధరి పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలకు ఎంపికైనట్లుగా పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ తెలిపారు. పదోతరగతి విద్యార్థిని జి.సాహితి, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.మణితేజ మండలస్థాయిలో మొదటిస్థానం సంపాదించి జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు. వ్యాసరచన పోటీలో 9వతరగతి విద్యార్థి కూన సాత్విక్ మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, సాధన కోసం ప్రణాళిక బద్ధంగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29, 30న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు

జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్



నవతెలంగాణ - తిమ్మాపూర్
ఈ నెల 29, 30తేదీలలో జరిగే సీపీఐ(ఎం) పదవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ అన్నారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలో మాతంగి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సంఘాల విస్తృత సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నిత్యం కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సీపీఐ(ఎం) మహాసభలలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. 29వ తేదీన కరీంనగర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా నుండి ముకుందలాల్ మిశ్రా భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, అనంతరం రెండు రోజులపాటు పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజా సంఘాల మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా మాతంగి శంకర్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాతంగి శంకర్ మాట్లాడుతూ మండలంలో వివిధ రంగాలలో తరగతులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు అడిచర్ల వెంకటేష్, ఇజ్జగిరి తిరుపతి, పైడిపల్లి సంపత్, పైడిపల్లి నరసయ్య, దుండి హనుమంతు, మీస సంపత్, వేనంకకుమార్, పైడిపల్లి రాజు, అంజయ్య, కోతి నాగరాజు, తోడి స్వామి, కీసర సంపత్, చిలుకూరు స్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు హుజురాబాద్ గ్రౌండ్ ముస్తాబు



నవతెలంగాణ - హుజురాబాద్
ఈ నెల 29 నుండి డిసెంబర్ ఒకటి వరకు జరిగే రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీల కోసం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం సిద్ధమవుతుంది. అండర్ 14 బాల బాలికలకు రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు హాకీ మైదానాలను ఎస్జీఎఫ్ కార్యదర్శులు, అధికారులు మూడు రోజులుగా చదును చేసి ప్రతిరోజు ట్రాక్టర్ తో నీటిని చల్లిస్తున్నారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల కోసం సుమారు 40 టీములు వచ్చే అవకాశం ఉండడంతో దానికి తగ్గ ఏర్పాట్లను వారు చేస్తున్నారు. బుధవారం హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, జిల్లా హాకీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాస్, హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కబడ్డీ క్లబ్ బాధ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ హాకీ క్రీడాకారుడు చింత శ్రీనివాస్, హుజురాబాద్ ఎస్జీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య, పీఈటీలు వేముల రవికుమార్, కొన్ని రాజిరెడ్డి, మధు సీనియర్ హాకీ క్రీడాకారుడు రమేష్, తునికి నరేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ కిషన్‌రావు తదితరులు పరిశీలించారు. మూడు రోజులపాటు క్రీడాకారులకు వసతి తో పాటు భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి సారయ్య తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా చర్యలపై సీపీ సమీక్ష





నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్
కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం పలు శాఖల అధికారులతో పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఇందులో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా, స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు వాటి పనితీరు, కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ శాఖతో పాటు, ఆర్అండ్‌బీ, హెచ్ఆర్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, ఆర్టీసి, స్మార్ట్ సిటీకి చెందిన ఎంఎస్ఐ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. అదే విధంగా రోడ్డు భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు శాఖల వారీగా అధికారులతో చర్చించారు. శాఖల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్ సమస్యలను నియంత్రించుటకు సహకరించాలని కోరారు. కరీంనగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థను మరింత మెరుగుపరచాలన్నారు. సీసీ కెమెరాలను సంఖ్యను పెంచి వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. యూటర్న్‌ల వద్ద బ్లింకింగ్ సోలార్ లైట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు మొత్తం లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగింపు, పార్కింగ్ స్థలాల గుర్తించి కేటాయించడం, కూరగాయల, పండ్ల మార్కెట్‌ను వేరే చోటుకు మార్చడం, యూటర్న్‌ల ఏర్పాటు, అవసరమైన చోట్ల జీబ్రా లైన్స్, స్టాప్ మార్కింగ్స్ ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

రోడ్డు మరమ్మతులు, అవసరమైన చోట యూటర్న్‌ల ఏర్పాటు, అవసరమైన చోట్ల రోడ్డు మధ్యలో డివైడర్‌ని తొలగించడం వంటి సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. స్థానిక బస్ స్టేషన్ ఇన్‌గేట్ వద్ద కార్గో ఆఫీస్ వలన వాహనాలు అధిక సంఖ్యలో ఆగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నందున ఆఫీసును బస్ స్టాండ్ ఆవరణలో రోడ్డుకి కొంత లోపల వైపు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, బస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను సంఖ్యను పెంచి వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏసీపీలు స్వామి, మాధవి, డిఈఈ మున్సిపల్ లచ్చిరెడ్డి, ఏఈఈ (ఆర్అండ్‌బీ) బి.మధు, ఆర్టిసి ఏటిఎం సురేష్, స్మార్ట్ సిటీ అభివృద్ధి సంస్థ ప్రతినిధి సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాభూమి పాదయాత్రను విజయవంతం చేయాలి

స్థానిక సంస్థల్లో పోటీ చేస్తాం

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్




నవతెలంగాణ - కరీంనగర్
ప్రజా సమస్యల పరిష్కరించడానికి 2025 జనవరి 5న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమయ్యే మాభూమి పాదయాత్రను విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విషార్థన్ మహారాజ్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజల సమస్యల పరిష్కారానికి పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. స్పందన రాకపోతే రిలే, ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. జనవరిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిలువేలు శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు తాళ్ళ నరేష్, బాబు, శివ, గణేష్, ఉపాధ్యక్షుడు రవీందర్, బాబు, రాజేంద్రప్రసాద్, రాకేష్, పరమేశ్వరి పాల్గొన్నారు.

మానస్ యూనిదాస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - గంగాధర
మానస్ యూనిదాస్ స్వచ్ఛంద సంస్థ సేవలను గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాజా మాజీ సర్పంచ్ జోగు లక్ష్మీరాజం కోరారు. ఫాతిమనగర్ అడోరేషన్ సంస్థ పక్షాన కాచిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చేతిపంపు, మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం స్పెయిన్ దేశస్తులు, మానస్ యునిదాస్ ప్రతినిధులు రోషియో.ఆల్బర్ట్ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం, బతుకమ్మ ఆటలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మానస్ యునిదాస్ ప్రతినిధులు రోషియో, ఆల్బర్ట్ మాట్లాడుతూ ఎవరికి సహాయం అవసరం పడుతుందో వారికి మానస్ యునీదాస్ సంస్థ సహాయం అందిస్తుందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు మహిళలకు పిల్లలకు సహాయం అందించి అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. మహిళలకు కష్టపడి ఎదగడానికి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తుందని అన్నారు. మా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాతిమానగర్ అడోరేషన్ సంస్థ డైరెక్టర్ అనీష్ ప్రీత, కోఆర్డినేటర్ దీప్తి, సంస్థ ప్రతినిధులు వెలంకిని, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, స్రవంతి, రమేష్, మౌనిక, జమున, తదితరులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకురాలుపై విచారణ



నవతెలంగాణ - జమ్మికుంట
మండలంలోని కొరపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలుపై వచ్చిన ఫిర్యాదుపై బుధవారం ఎంపీడీవో భీమేష్, ఏపిఎం సెర్ప్‌తో కలిసి విచారణ చేశారు. విచారణలో వచ్చిన అంశాలపై నిర్వాహకురాలు మంగళవారం ఆరోగ్యం సరిగా లేనందున, వాళ్ల కుటుంబ సభ్యులతో వంట చేయించినట్టు చెప్పారు. ఇటువంటి తప్పిదం జరగకుండా చూస్తామని అధికారులకు చెప్పినట్టు తెలిపారు. వారం రోజులు గ్రామ సంఘంతో ప్రతిరోజు పిల్లలకు వండే ఆహారాన్ని చెక్ చేయాలని చెప్పినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మయ్య, పంచాయితీ ప్రత్యేక అధికారి, పంచాయితీ సెక్రటరీ కె.రామారావు, గ్రామ సంఘం అధ్యక్షురాలు, వీఏఓ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై కార్మికులపై వేధింపులు మానుకోవాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు మానుకోవాలని ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆర్జీ-1 డివిజన్ సీఎస్పీ రైల్వే మెయింటెనెన్స్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని, పెనాల్టీ విధానాన్ని రద్దు చేయాలని, యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశల వారి ఆందోళన పిలుపులో భాగంగా రామగుండంలోని వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల అడ్డాల వద్ద కరపత్రాల ఆవిష్కరణ చేసి ప్రచారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, శనిగరపు కృష్ణ, వి.కనకయ్య, గంగుల వెంకటేష్, గాజుల రమేష్, గడ్డిరాజు, చిన్నయ్య నేరెళ్ల రాజేందర్ తదితరులున్నారు.

యాసంగికి సమాయత్తం

- చివరిదశలో వానాకాలం వరి కోతలు
- యాసంగిలోనూ సన్నాల సాగుకు రైతుల ఆసక్తి
- ఇప్పటికే నారుమళ్లు సిద్ధం
- జిల్లాలో సుమారు లక్షల ఎకరాల్లో పంటల సాగు



నవతెలంగాణ-మల్యాల

వానాకాలం పంటల సీజన్ ముగిసి యాసంగి వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. వానాకాలంలో సాగు చేసిన వరి కోతలు చివరి దశకు చేరాయి. కొన్ని చోట్ల ఆలస్యంగా నాట్లు పడగా, అక్కడ మాత్రమే ప్రస్తుతం కోతలు కొన సాగుతున్నాయి. జిల్లాలో ఎస్సారెస్పీ కాలువ కిందతో పాటు వరద కాలువలతో పాటు చెరువులు, కుంటల కింద అత్యధికంగా సన్న రకాల వరినే సాగు చేశారు. ఈ సీజన్‌లో సన్నాలను సాగుచేసిన రైతులు అధిక దిగుబడులు సాధించారు.

జగిత్యాల జిల్లాలోని పలు మండలాల్లో మాత్రం సన్నరకంతో పాటు దొడ్డురకం వరిని రైతులు సాగు చేశారు. వానాకాలంలో సన్నాలను సాగు చేసిన రైతులు ధాన్యాన్ని ఇప్పటికే మిల్లర్లకు విక్రయిం చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం దొడ్డు రకం ధాన్యాన్ని రైతులు విక్రయించారు. ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించినా రైతులు మిల్లుల్లో విక్రయించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపారు. యాసంగిలో కూడా రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్‌లో సైతం సన్నరకాల వరి సాగుచేసేందుకే రైతులు అధికంగా మొగ్గు చూపుతున్నారు.

మిల్లులకే విక్రయం..

సన్నరకం ధాన్యాన్ని రైతులు మిల్లులకే విక్రయిం చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు మాత్రం మిల్లుల్లోనే విక్రయించారు. మిల్లుల్లో తేమ శాతంతో సంబంధం లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అంతేగాక క్వింటాకు రూ.2350 నుంచి రూ.2550 వరకు ధర లభించింది. కొనుగోలు కేంద్రాల్లో అయితే తేమ 17శాతం వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం బరువు కూడా తగ్గుతుంది. అంతేగాక వాతావరణ మార్పులతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి అసలుకే మోసం వస్తుంది. ఈ నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు బుదులు సన్న రకాల ధాన్యాన్ని నూర్పిడి చేసిన వెంటనే మిల్లులకు తరలించి విక్రయించారు.

3లక్షల ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో రైతులు యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 3లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయనున్నారు. జగిత్యాల జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్క జగిత్యాల జిల్లాలో లక్ష ఎకరాల్లో సన్నాల రకాలు, మిగతా 2 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగుకానుంది. జిల్లాలో రైతులు లక్ష ఎకరాల వరకు సన్నరకం సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా.

వానాకాలంలో సన్నాల అధిక దిగుబడి..

జిల్లాలో సన్నరకం వరిని సాగు చేసిన రైతులు మంచి దిగుబడులు సాధించారు. సన్నాల సాగు చేసిన రైతులకు ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. జిల్లాలో రైతులు ఎక్కువగా జైశ్రీరామ్, బీపీటీతో పాటు మరికొన్ని రకాలను సాగు చేశారు. సన్నాలు సాగు చేసిన రైతులు నేరుగా వరికోత యంత్రాల ద్వారా వరి నూర్పిడి చేయించి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి విక్రయించారు. సన్నరకానికి క్వింటాకు రూ.2350 నుంచి రూ.2550 వరకు ధర పలికింది.

యాసంగిలోనూ సన్నాల సాగు..

వానాకాలంలో సన్నరకం వరిని అధికంగా సాగుచేసిన రైతులు యాసంగిలోనూ సన్నాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలంలో సన్నరకం సాగుతో మంచి దిగుబడులు పొందడంతో పాటు ధర కూడా బాగానే వచ్చింది. గతంలో సన్నరకం పంట నాలుగు నెలల తరువాతగానీ చేతికి వచ్చేది కాదు. ఇటీవల పలు విత్తనాలు 100 నుంచి 120రోజుల్లో పంట చేతికి వస్తున్నాయి. మార్కెట్‌లో ధర కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు సన్నాల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

సన్న రకాలే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు



జగిత్యాల జిల్లాలో యాసంగిలో కూడా ఎక్కువగా సన్నరకం వరి సాగు చేసే అవకాశాలున్నాయి. వానాకాలంలో జిల్లాలో లక్షల ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. యాసంగిల్లో 2లక్షల వరకు సాగు చేసే అవకాశముంది. రైతులు సన్నాలను సాగు చేసి మిల్లుల్లో విక్రయిస్తున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎక్కువగా సన్నరకం సాగు చేసే అవకాశం ఉంది. మార్కెట్‌లో సన్నరకాలకు ధర బాగానే ఉంది. దిగుబడి కూడా మంచిగానే వస్తోంది.

-సీహెచ్.రామచంద్రం డీఏవో, జగిత్యాల జిల్లా

యాసంగిలో కూడా సన్నరకాలే..



యాసంగిలో కూడా సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నా. వానాకాలంలో 8 ఎకరాల్లో చిట్టిపొట్టి సన్నరకం సాగు చేశా. ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.2,550 ధర ప్రకారం విక్రయించా. ఇంకా కొంత విక్రయించాల్సి ఉంది. ప్రస్తుతం క్వింటాకు రూ.2,800 వరకు కొనుగోలు చేస్తున్నారు. అందుకే యాసంగిలో కూడా 1ఎకరాల్లో సన్నరకం సాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేస్తున్నా.

-పురుకూతపు నరేందర్ రెడ్డి రైతు, గ్రామం భూషణ్‌రావుపేట్, మండలం కథలాపూర్

నారుమళ్లు సిద్ధం..

వానాకాలం సీజన్ ముగియడంతో రైతులు యాసంగి సీజన్ వైపు దృష్టి సారించారు. యాసంగి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. యాసంగిలో కూడా అత్యధికంగా వరి సాగు చేయనున్నారు. అందుకోసం రైతులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. రైతులు యాసంగిల్లో విత్తనాలను మండెకట్టి మొలకలు రాగానే చల్లనున్నారు. వానాకాలంలో అయితే దుక్కులు దున్ని వడ్లు చల్లి నారుమళ్లు సిద్ధం చేసేవారు. యాసంగిలో త్వరగా నారు నాటేందుకు భిన్నంగా నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు.

అభ్యుదయ రైతుకు ఎమ్మెల్యే అభినందనలు

జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన సారంగాపూర్ యువ రైతు సాయిని తిరుపతి



నవతెలంగాణ -సారంగాపూర్

డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ కోర్సు జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన సారంగాపూర్ గ్రామ అభ్యుదయ రైతు సాయిని తిరుపతిని బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సన్మానించారు. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన సాయిని తిరుపతి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ మేనేజ్మెంట్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాలలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ కోర్సులో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభ్యుదయ రైతు వ్యవసాయ మార్కెటింగ్ కోర్సు నేర్చుకోవడం అభినంద నీయమన్నారు. ఈ కోర్సు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, మందులు, అమ్మడానికి చట్టబద్ధ అనుమతి లభిస్తుందన్నారు. రైతు వ్యవసాయంపై మక్కువతో ఈ కోర్సు చదివి ఆన్‌లైన్‌లో పరీక్ష రాసి జాతీయ స్థాయిలో గోల్డ్ మోడల్ సాధించడం అభినందనీయమని కొనియడారు. ఈ కార్య క్రమంలో సారంగాపూర్ మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, మాజీ సర్పంచ్‌లు తోడేటి శేఖర్‌గౌడ్, పల్లపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను తొలగించాలి

డిప్యూటీ కలెక్టర్‌కు ఏఐవైఎఫ్ వినతి



నవతెలంగాణ-కోల్‌సిటీ

ఏలాంటి అనుమతి లేకుండా రామగుండం నగరపాలక పరిధిలో చేపడు తున్న నిర్మాణాలపై మున్సి పల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలోని కాజీపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసు కోవడం లేదని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ.. నిబంధ నలకు విరుద్ధంగా ఉన్నా అధికారులు అవినీతికి పాల్పడుతూ అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు. శ్రీ మయి లగ్జరీ హెూటల్ వెనకాల కొత్తగా చేపట్టిన పెద్ద భవన నిర్మాణానికి గ్రౌండ్ ఫ్లోర్ అనుమతులు తీసుకొని సెల్లార్‌ను నిర్మించారని అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలా అనుమ తులు మంజూరు చేశారని సూర్య ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులతో పాటు మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 174(5), 178(1) మరియు 181(2) ప్రకారం అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని సూర్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు సాదుల శివ, ఆసాల నవీన్, రాణవేణి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా మాలల హక్కుల కోసం ఉద్యమించాలి



నవతెలంగాణ-మేడిపల్లి

పార్టీలకు అతీతంగా మాలల హక్కుల కోసం ఉద్యమించాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ పిలుపు నిచ్చారు. బుధవారం మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామంలో మాల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాయితి శంకర్ మాట్లాడుతూ..ఎన్నో ఏళ్ళుగా వెనుకబాటు తనంతో అభివృద్ధికి దూరంగా ఉన్న మాలలు ఆత్మగౌరవం రాజ్యాంగ హక్కులను పొందడం కోసం డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహ గర్జన సభలో లక్షలాదిగా పాల్గొని మన సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మెట్టు దాస్, మాల మహానాడు మండల నాయకులు కొండ్ర గంగాధర్, దామెర రాజయ్య, స్థానిక నాయకులు సత్తయ్య, జోయెల్, భూమయ్య, మధు, బ్యాల, ఆలీస పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండల కేంద్రంలో శ్రీ లొంక వెంకట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బద్ది లక్ష్మణ్, ఎల్లేటి సతీష్‌రెడ్డి, కార్యద ర్శులుగా చెక్కపల్లి సంజీవ్, ఒల్లాల నరేష్‌గౌడ్, సలహాదారులుగా గుగ్గిళ్ళ రవి గౌడ్, పల్లికొండ గణేష్, పల్లి అర్జున్, బసవరాజుల రాజు, చెక్కపల్లి రఘు, పల్లి భీమయ్య, చెక్కపల్లి శంకర్, యువజన సంఘం నాయకులు పరమేశ్వర రావు, మహేందర్ రెడ్డి, కర్నేష్, నాగరాజు, రవితేజ, వెంకటేష్, సాయిరాం, నాని గౌడ్‌ను ఎన్నుకున్నారు.

బండి సంజయ్‌ను కలిసిన కేడీసీసీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి



నవతెలంగాణ-మేడిపల్లి

మండల ప్యాక్స్ చైర్మెన్, కరీంనగర్ కేడీసీసీ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

సంక్షేమ భవనం ముట్టడిలో పాల్గొన్న దాసరి ఉష

నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్

తెలంగాణలోని గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌ల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోయారని హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ముట్టడికి బీఆర్ఎస్‌వీ పిలుపు నిచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవనం ముట్టడి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష పాల్గొన్నారు.

కన్నతల్లిని శ్మశానంలో వదిలేసిన కొడుకులు

వారం రోజులుగా శ్మశాన వాటికలోనే వృద్ధురాలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణం మోతె శ్మశాన వాటికలో వృద్ధురాలు రాజవ్వ వారం రోజులుగా ఇక్కడే జీవనం సాగిస్తుంది. వృద్ధురాలికి నలుగురు కొడుకులు ఉన్నారు. పెన్షన్ డబ్బుల కోసం తల్లిని కుమారుడు చితక బాధడంతో ఆమె కాలు విరిగింది. అచేతన స్థితిలో రాజవ్వ శ్మశాన వాటికలోనే ఉంటుంది. ఈ ఘటన పలువురుని కంటతడి పెట్టించింది. స్థానికులు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్య సేవలం దించారు. వయోవృద్ధుల చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని సంక్షేమశాఖ అధికారి నరేష్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-మేడిపల్లి

ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా మేడిపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల 8, 9 వ తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. ప్రథమ స్థానంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చెందిన కే మైత్రి, ద్వితీయ స్థానంలో జెడ్పీ హెచ్ఎస్ వల్లంపల్లికి చెందిన టి. ప్రణతి, శ్రావణి, తతీయ స్థానం, జడ్పీహెచ్ఎస్ దమ్మన్న పేటకు చెందిన బి. వైష్ణవి ర్యాంకులు సాధించినట్టు మండల విద్యాధికారి ఆకుల లక్ష్మీ నరసయ్య కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్‌హమీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమల్ల ప్రధానోపాధ్యాయులు ఏ. కరుణ, సీఆర్పీ చంద్రశేఖర్, 12 పాఠశాలల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

జిల్లాలో మూడవ స్థానంలో ముత్తారం

ముత్తారం ఎంపిడిఓ ఎం.సురేష్



నవతెలంగాణ-ముత్తారం

మండలంలో జరిగిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియ శరవేగంగా కొన సాగుతుందని ఎంపీడీవో ఎం.సురేష్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చేపట్టిన సర్వే పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. ఇప్పటి వరకు 8828 కుటుంబాల సర్వే పత్రాలను ఆన్‌లైన్ చేయడం జరిగిందని తెలిపారు. దీంతో జిల్లాలో ముత్తారం మండలం ఇప్పటి వరకు మూడవస్థానంలో తెలిపారు. ఇదే విధంగా కొనసాగుతూ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచేలా సర్వే పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు.

గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం దేశ చరిత్రలోనే అరుదు

- గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల
- వేములకుర్తిలో గల్ఫ్ జేఏసీ కృతజ్ఞత సభ



మాట్లాడుతున్న స్వదేశ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

జి.ఓ.205 జారీ చేసి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం దేశ చరిత్రలోనే అరుదని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. బుధవారం మండలంలోని వేములకుర్తి గ్రామంలో గల్ఫ్ మిత్రులు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ గల్ఫ్ సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలకు గ్రామంలోని బస్టాండ్ ప్రాంగణంలో గల్ఫ్ కార్మికుల జేఏసీ జెండా వంద్ద సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, గల్ఫ్ వలసల విశ్లేషకులు మంద భీమ్ రెడ్డి, గల్ఫ్ జేఏసీ చైర్మెన్ గుగ్గిళ్ళ రవి గౌడ్‌తో కూడిన చిత్రపటాలకు గోదావరి నది జలాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల హాజరై మాట్లాడారు. కొన్నేండ్లుగా కార్మికులు అవిశ్రాంతంగా అనేక పోరాటు చేసిన గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కార్మికుల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కంతం రాజ్‌కుమార్, ఇబ్రహీంపట్నం ప్రవాసి మిత్ర యూనియన్ అధ్యక్షుడు చాట్ల గణేష్‌లు మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికులు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు పరిహారం. 2023 డిసెంబర్ 7 నుంచి చోటు చేసుకున్న ఘటనలకు ఇది వర్తిస్తుందన్నారు. గల్ఫ్ కార్మికుల స్థితిగతుల అధ్యయనానికి అడ్వైజరీ కమిటీ ఏర్పాటు, ప్రజా భవన్ లో కొనసాగుతోన్న ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా ప్రవాసి ప్రజావాణికౌంటర్ ఏర్పాటు, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ల అడ్మిషన్లలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినదనియం అన్నారు. ఈ కార్యక్రమంలో యామపుర్ సహకార సంఘ చైర్మెన్ అంకతి రాజన్న, వీడీసీ చైర్మన్ ఎడిపెల్లి గంగారెడ్డి, నాయకులు దేశెట్టి రాజారెడ్డి,పెంట లింబద్రి, మార్కెట్ డైరెక్టర్ గుమ్మల రమేష్, రాధరపు దేవదాస్, నాంపల్లి వెంకటాద్రి,తరి రామానుజం, కారం ఇంద్రయ్య, గుమ్మల గంగన్నమెగిలి ప్రభుదాస్, తులి స్వామి,అరె మల్లయ్య, దొంగిరి శేఖర్,కంబ కైలాష్ ,దోనికెన శ్రీనివాస్,గల్ఫ్ మిత్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందికి బేసిక్ పే ఇవ్వాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య


పెగడపల్లిలో నిరసన తెలుపున్న ఉపాధ్యాయులు


వెల్గటూర్‌లో నిరసన తెలుపున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-వెల్గటూర్ /పెగడపల్లి

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కుమ్మరపల్లి కేజీబీవీలో భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య మాట్లాడుతూ.. కేజీబీవీ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ పే అందించడం ద్వారా వారి హక్కులను కాపాడాలి అని డిమాండ్ చేశారు. అదే విధంగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, సిఆర్టీలకు కూడా బేసిక్ పే కల్పించాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే జనవరి 28న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీప, పీజీ సిఆర్టీలు ఉమా, స్వాతి, శ్వేత, సుప్రియ, జ్యోతి, లావణ్య, సిఆర్టీలు స్వప్న, నసీం సుల్తానా, నీతు, జయ, మమత, మౌనిక, పద్మ, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ప్లే కార్డులు ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యాంసుందర్ మాట్లాడుతూ.. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం (మినిమం టైమ్ స్కేల్) అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గడ్డల శ్రీధర్, గుర్రం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గంగం అనీల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా 15వ ఫైనాన్స్ నిధులు రూ.20 లక్షలతో పల్లె దవాఖాన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాధి వచ్చిన తర్వాత మందులు వాడటం కన్నా వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీ ఓ రవిబాబు, ఏఈ రాజ మల్లయ్య, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2 లక్షల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్ డాక్టర్ సంజయ్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలే శంకర్, మల్లారెడ్డి, తిరుపతి, రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరే రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

ప్రభుత్వా స్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరిం టెండెంట్‌కు ఎమ్మెల్యే సంజయ్ సూచించారు. బుధవారం మెట్‌పల్లి ప్రభుత్వాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని ఆరాతీశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వంటశాలను సందర్శించి రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఆస్పత్రి పరిస రాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులతో మర్యాదగా వ్యవహరిం చాలన్నారు. అసంపూర్తిగా నిర్మితమైన నూతన ఆస్పత్రి భవనాన్ని పరించారు. వారి వెంట ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ సాహిత్, అమరేశ్వర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం త్వరితగతిన తరలించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- కొనుగోలు చేసిన ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ 100 శాతం పూర్తి చేయాలి



నవతెలంగాణ-పెద్దపల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమ శాతం 17 రాగానే కొనుగోలు చేసి త్వరితగతిన తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, ధాన్యం తేమ శాతం 17 రాగానే వెంటనే కొనుగోలు చేసి, సెంటర్‌కు కేటాయించిన రైస్ మిల్లులకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, 100 శాతం కొనుగోలు ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలని అన్నారు.

బ్రూస్ లీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : మండల కేంద్రం సీఎస్ఐ చర్చ్ ప్రాంగణం ప్రధాన కరాటే డోజోలో మార్షల్ ఆర్ట్స్ యోధుడు బ్రూస్ లీ 84వ జయంతి వేడుకలు జె.కె.ఎ ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా, ఇబ్రహీంపట్నం ప్రధాన బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు మాస్టర్ ప్రవీణ్‌కుమార్ బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు విశ్వ తేజ, విశ్వంత్, హర్షవర్ధన్, ప్రదీప్, శ్రీనివాస్, కరాటే విద్యార్థులు హరిప్రిత్, హృషికేష్, విఘ్నేష్, హర్షవర్ధన్, మనోహర్, పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి
గురువారం | నవంబర్ 28, 2024 | www.navatelangana.com

కార్యాలయం ఇక్కడ.. కార్యక్రమాలు అక్కడ

2016లో ప్రారంభించి వదిలేశారు?



నవతెలంగాణ - చందుర్తి : ఇక్కడ మాత్రం డీఈఈ పంచాయతీ కార్యాలయం అని రాతలు రాసారు. కానీ తాళం తీసేది లేదు సార్ వచ్చేది లేదు? ఎనిమిది సంవత్సరాలుగా కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో పనులపై వచ్చే వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2016లో జిల్లాలు, మండలాల విభజనలో భాగంగా చందుర్తి, కొనరావుపేట, రుద్రంగి మండలాలను కలిపి చందుర్తిని సబ్ డివిజన్ ఏర్పటు చేసి డీఈఈ పంచాయతీ కార్యాలయం ఏర్పటు చేశారు. కానీ పేరుకు మాత్రమే ఉన్న కార్యాలయం అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. దీంతో మూడు మండలాల ప్రజలు వేములవాడ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది.

ఇంటికెళ్లేదాక ఉక్కపట్టుకోవాల్సిందేనా?

- బయటకు వస్తే.. ఒకటి, రెంటికి వెళ్లలేని దయనీయం
- రామగుండం, అంతర్గాం రద్దీ ప్రాంతాల్లో కానరాని మరుగుదొడ్లు
- చెప్పుకోలేని అవస్థతో ప్రజల ఇబ్బందులు
- తప్పనిసరి అవసరాన్ని గుర్తించని అధికారులు



నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

నవతెలంగాణ - రామగుండం :

తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన అవసరాల జాబితాలో మరుగుదొడ్ల ప్రాధాన్యాన్ని గుర్తించి సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వాలు పలు పథకాలు ప్రవేశపెట్టినా అవి అమలుకు నోచుకోవడం లేదు. రామగుండం, అంతర్గాం ప్రాంతాల ప్రజలు అవసరాల నిమిత్తం ఇల్లు దాటి బయటకు వస్తే తిరిగి ఇంటికెళ్లేదాక ఒకటికి రెంటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రామగుండంలో రద్దీ ప్రాంతాలైన మసీద్ కార్నర్, బీ పవర్ హౌస్ బస్సు షెల్టర్, రైల్వే స్టేషన్ ఏరియాల్లో మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ఈ ప్రాంతాల్లో జనసామర్థ్యం అధికంగా ఉన్నా వారి అవసరాల రీత్యా కాలకృత్యాలను తీర్చుకునే అవకాశం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎస్‌బీఐ బ్యాంకు, రైల్వే స్టేషనే దిక్కు..

రామగుండం మసీద్ టర్నింగ్ సెంటర్, రైల్వే స్టేషన్, బీ పవర్ హౌస్ ప్రాంతాలకు రామగుండం చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిత్యం ఏదో ఒక పని మీద వస్తుంటారు. ఈ ప్రాంతాల్లో మరుగుదొడ్లు అవసరమని ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నా వారు మాత్రం టాయిలెట్ల ప్రాధాన్యాన్ని గుర్తించడం లేదు. వాష్ రూములు లేకపోవడంతో మసీద్ టర్నింగ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు, రైల్వే స్టేషన్లో ఉండే టాయిలెట్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి. బయటివారు రైల్వేస్టేషన్లోకి వెళ్లాలంటే ప్లాట్ ఫామ్ టికెట్ తీసుకోవాలి. ఎస్బీఐలో టాయిలెట్లు లోపల వైపున ఉండటంతో దాంట్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా బహిరంగ మల మూత్ర విసర్జన ప్రజలకు తప్పడం లేదు. దీంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అంతర్గాంలో నిరూపయోగంగా..

అంతర్గాం మండలకేంద్రంలో గతంలో మరుగుదొడ్లు నిర్మించినా వాటికి వెళ్లేందుకు దారిలేదు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా దారి నిర్మించినా అది పూర్తిగా ధ్వంసమై చెట్లు, ముళ్ల పొందలతో నిండిపోయింది. నీటి సదుపాయం లేకపోవడం, గుంతలో మరుగుదొడ్లు నిర్మించడం కారణంగా వాటి చుట్టూ మురుగునీరు చేరి అపరిశుభ్రం, నిరుపయోగంగా మారిపోయాయి. దీనిపై గ్రామ కార్యదర్శి రవిని వివరణ కోరగా అక్కడి పొదలను తొలగించి వినియోగంలోకి తెస్తామని వివరణ ఇచ్చారు. దారి నిర్మాణంపై ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ కోసం నవతెలంగాణ ఫోన్ కాల్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు

నిధుల మంజూరులో ఆలస్యం



2021లో రామగుండం ఎస్‌బీఐ సమీపంతో పాటు రైల్వేస్టేషన్ ప్రాంతంలో టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. రూ.30 లక్షల నిధులతో నిర్మాణానికి తీర్మానాలు పూర్తి చేశాం. కానీ నిధుల మంజూరులో ఆలస్యం కారణంగా టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలుపెడతాం.

– కన్నూరి సతీష్, 20వ డివిజన్ కార్పొరేటర్

వరి కొయ్యలు కాల్చొద్దు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



పొలాల్లో వరి కోసిన తర్వాత కొయ్యలను కాల్చవద్దని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలో పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వరి కొయ్యలు కాల్చడం వలన కలిగే నష్టాల గురుంచి రైతులకు వివరించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి మేలు చేసే మిత్రపు రుగులు, సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు. పొలంలోనే వరి కొయ్యలను గడ్డిని కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. వంగ రవి, దుర్గ ప్రసాద్, వెంకటి బోనాల రైతులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



సిరిసిల్ల పట్టణంలోని 38 వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి బుధవారం భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రజా రవాణా సౌకర్యార్థం వార్డులో దాదాపు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య కౌన్సిలర్ గూడూరి భాస్కర్, డీఈ వాణి, ఏఈ నరసింహస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యా పరికరాల పంపిణీ



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాజన్నపేట గ్రామంలో మాజీ సర్పంచ్ ముక్క శంకర్ తన సొంత ఖర్చులతో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 90మంది విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు అందించారు. మాజీ సర్పంచ్ ముక్క శంకర్ మాట్లాడుతూ పాఠశాలకు ఏ అసరాలు ఉన్నా తనకు తెలియజేస్తే గ్రామస్తుల సహకారంతో ఆ సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానన్నారు. టై, బెల్ట్, ఐడీ కార్డులకు సమారు రూ.10వేల ఖర్చు అయిందని తెలిపారు. విద్యార్థులకు తన సొంత ఖర్చులతో విద్యాపరికరాలు అందించిన ముక్క శంకర్‌కు పాఠశాల తరుపున ప్రధానోపాధ్యాయులు పి.శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ న్యాలపెల్లి మంజుల, ఉపాధ్యాయులు వి.ప్రవీణ్‌రావు, లక్ష్మి దేవి, విజయ లక్ష్మి, వేణు మాధవ్‌లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగుడైనా పెన్షన్ రావడం లేదు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



మండల కేంద్రానికి చెందిన చిట్టి శంకర్ పుట్టగానే చెవుడుతో బాధపడుతూ తన మాతృమూర్తి మీద ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నాడు. వికలాంగులకు పెన్షన్స్ ఇవ్వాలని ప్రత్యేక జీవో ఉన్నా శంకర్‌కు పెన్షన్ ఇప్పటివరకు రావడం లేదని ఆ వికలాంగుడి తల్లి అమృతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తుంది. వివరాల్లోకి వెళ్లితే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చిట్టి అమృతమ్మ కొడుకు చిట్టి శంకర్(55), మూగ, చెవిటితో పుట్టాడు. అవిటివాడని తెలిసిన మమకారం వీడకుండా ఏనాడు బాధపడకుండా కొడుకు పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. తనకు వృద్ధాప్యం, ఆరోగ్యసమస్యలు రావడంతో తన కొడుకును పోషించుకోవడం భారంగా మారిందని రోదిస్తున్నది. గత ప్రభుత్వంలో పలుమార్లు స్థానిక, జిల్లా నేతలను, అధికారులను సంప్రదించి మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయింది. పెన్షన్ కొరకు దరఖాస్తులు గ్రామపంచాయతీ, ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించిన అప్పటి అధికారులు మాత్రం తనపై జాలి చూపలేదని రోదిస్తూ తెలిపింది. అనర్హులకు పెన్షన్లు మంజూరు చేసి, అర్హులకు పెన్షన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపింది. కనీసం ఇప్పుడైన తన కొడుకుకు పెన్షన్ వచ్చేవిధంగా చూడాలని అధికారులను వేడుకుంటోంది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ - గంభీరావుపేట:

ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గంభీరావుపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ. శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా ఎల్పుగొండ మండలంలోని సత్యనారాయణ కుమారుడు భరత్ కుమార్ (31)స్థానికంగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత 11నేలల క్రితం వివాహం జరగడంతో ఆర్థిక ఇబ్బందులతో పాటు ఆరోగ్యం క్షీణించడంతో మానసిక వేదనకు గురై మనస్థాపానికి గురై మంగళవారం ఎగువ మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం ను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి కి తరలించి మృతుడి తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం పీఎం విశ్వకర్మ అందించాలి

ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



నవతెలంగాణ - సిరిసిల్ల : అర్హులకు నిబంధనల ప్రకారం పీఎం విశ్వకర్మ అందించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఎంపీడీఓలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసిన వారి అప్లికేషన్, డిక్లరేషన్, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఇతర వివరాల ప్రింట్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జీఎం ఇండస్ట్రీస్ కు పంపించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్క్రూటినీ, ఇతర అంశాలు ఆన్లైన్ లో నమోదు చేసే విషయమై ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఆయా శాఖల అధికారులను సంప్రదించాలని సూచించారు.

మండలాలు..

మున్సిపాలిటీల వారీగా దరఖాస్తులు

సిరిసిల్ల మున్సిపాలిటీలో 101, వేములవాడ మున్సిపాలిటీలో 72, బోయినపల్లి మండలంలో 178, చందుర్తి మండలంలో 232, ఇల్లంతకుంట మండలంలో 667, గంభీరావుపేట మండలంలో 185, కొనరావుపేట మండలంలో 347, ముస్తాబాద్ మండలంలో 166, రుద్రంగి మండలంలో 61, తంగళ్లపల్లి మండలంలో 372, వీర్నపల్లి మండలంలో 168, వేములవాడ రూరల్ మండలం 38, వేములవాడ అర్బన్ మండలం 237, ఎల్లారెడ్డిపేట మండలం నుంచి 274 దరఖాస్తులు ఆన్‌లైన్ అయ్యాయి. సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, ఇండస్ట్రీస్ ఏడీ భారతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎల్డీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని వ్యాపారంగా మలచుకోవాలి

కరీంనగర్ శాస్త్రవేత్తలు మధన్‌మోహన్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్



నవతెలంగాణ - గంభీరావుపేట : వ్యవసాయ రంగాన్ని వ్యాపారంగా మలుచుకోవాలని శాస్త్రవేత్తలు మదన్ మోహన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల పరిధిలోని గోరంటాల గ్రామంలో రైతులకు వ్యవసాయ సంబంధిత ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని వ్యాపారంగా మలుచుకోవాలని, ప్రస్తుతం యాసంగికి అనువైన వరి రకాల గుణ గణాలను వివరించారు. వరి కొయ్యలను కాల్చకుండా నేలలోనే కలియదున్నాలని రైతులకు సూచించారు. యాసంగి వరిలో పురుగులు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు, మొగి పురుగు, అగ్గి తెగులు నివారణా చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సలావుద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు ముకుంద కుమార్, సాయితేజ, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ అంజిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

సంస్కారహీనంగా మాట్లాడితే సహించబోం

- కేటీఆర్ కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నాడు : మృత్యుంజయం
- అధికారులను దూషించడం సరికాదు
- జిల్లా కలెక్టర్‌కు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి
- కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం





నవతెలంగాణ - సిరిసిల్ల : మాజీమంత్రి కేటీఆర్ కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నాడని తెలంగాణ ఉద్యమ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి టికెట్‌ను నువ్వు హైజాక్ చేసి సిరిసిల్లకు వచ్చావని అది గుర్తుంచుకుని మాట్లాడాలని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అన్నారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో మధ్య మానేరు భూ నిర్వాసితులకు ఏం చేశావో చెప్పాలని, 10, 11వ ప్యాకేజీలు పూర్తి అయినప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9వ ప్యాకేజీ ఎందుకు పూర్తి చేయించలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. త్వరలో సిరిసిల్లలో ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని, నేను పోటీ చేయనని, పోటీ చేసే నాయకుడిని గెలిపిస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు వైద్య శివప్రసాద్, గడ్డం నరసయ్య, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, బొప్ప దేవయ్య, వంతడుపుల రాము, నేరెళ్ల శ్రీకాంత్ ,నీలి రవీందర్, ఆడెపు ప్రభాకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంస్కారహీనంగా మాట్లాడితే సహించబోమని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన 11నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే సిలిండర్, రూ.35వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయలేదని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. నేతన్నలకు బకాయిలు చెల్లించి, నూలు డిపో ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఏక మొత్తంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని, సన్న రకాలకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. ఒక జిల్లా అధికారిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నాడని అనడం సరికాదన్నారు. గతంలో అధికారులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు రాజ్యమేలారని ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ తన ప్రవర్తనను మార్చుకొని హుందాగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మెన్ వెలుముల స్వరూప, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర దేవరాజు, మాజీ పిసిసి కార్యదర్శి గడ్డం నరసయ్య, బొద్దుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని బుధవారం ఎల్లారెడ్డిపేట మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. దొమ్మాటి నర్సయ్య కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. జిల్లా మేజిస్ట్రేట్ కాంగ్రెస్ కండువా కప్పుకొని పరిపాలస్తున్నాడని అనడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రాన్ని 10సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్పీలు, కలెక్టర్‌లు వాళ్ల కింద పనిచేసిన వాళ్లేనని అన్నారు. అధికారం పోయేసరికి ప్రజా పాలన సాగిస్తున్న కలెక్టర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న కలెక్టర్‌ను దూషించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఉపాధ్యక్షులు గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు మెండే శ్రీనివాస్‌యాదవ్, నంది కిషన్, వెంకటేశ్ గౌడ్, సూడిది రాజేందర్, చెన్ని బాబు, బం డారి బాల్‌రెడ్డి, రఫీక్, గుర్రపు రాములు, మేగి నర్సయ్య, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సంతోష్‌గౌడ పాల్గొన్నారు.

నవతెలంగాణ - తంగళ్లపల్లి : అధికారం కోల్పోయిన తర్వాత మాజీ మంత్రి కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ ఎద్దేవా చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెదిరింపు రాజకీయాలకు భయపడేదదిలేదన్నారు. అధికారులపై, పోలీసులపై అజమాయిషీ చలాయించడం, తిట్టడం హేయమైన చర్య అన్నారు. 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేటీఆర్ ఇక్కడ సంపద దోచుకొని రూ.5వేల కోట్లను దాచుకున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగాల భూపతి, ప్రెస్‌క్లబ్ అడక్ కమిటీ కన్వీనర్ పూర్మాని లింగారెడ్డి, రాజశేఖర్, మార్కెట్ డైరెక్టర్లు కళ్లేపల్లి తిరుపతిరెడ్డి, పొన్నాల పరుశురాం, ఆరెపల్లి బాలు, మండల నాయకులు శ్రీకాంత్ గౌడ్, బైరి నేని రాము, మునిగాలా రాజు, కొత్త రవి, ఎగుర్ల ప్రశాంత్, కోల శంకర్, భరత్, చిలుక శ్రీను, చంద పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంభీరావుపేట : కేటీఆర్‌కు అధికారం పోవడంతో అధికారులను దూషించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో హమీద్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోగానే కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇచ్చిన 6గ్యారంటీలను అమలు చేస్తూ వస్తున్నదన్నారు. వడ్ల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా జిల్లా కలెక్టర్ చిత్తశుద్ధితో ప్రజలతో మమేకమై ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నా దూషించడం కేటీఆర్‌కు తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, విట్టల్ నాయక్, అజాం, కొత్తపల్లి రాజుగౌడ్, దేశెట్టి రాజశేఖర్, గౌరీ శంకర్, ప్రసాద్‌రావు, అక్కపల్లి బాలయ్య, లచ్చయ్య, నల్ల రాజకుమారు, బంగ్లా రాజుగౌడ్, జంగం రాజు, ప్రవీణ్, బాబు, మాడుగుల మల్లయ్య పాల్గొన్నారు.

29న కుటుంబ నియంత్రణ శిబిరం

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో 29న శుక్రవారం కుటుంబ నియంత్రణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు డాక్టర్ దివ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ నియంత్రణ శిబిరంలో మగవారికి కోత కుట్టులేని వ్యాసెక్టమీ ఆపరేషన్లు నూతన ఆధునిక పద్ధతిలో చేయనున్నట్లు తెలిపారు. కుటుంబ నియంత్ర శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావు ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నట్టు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో పరిధిలో ఉన్న ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నవతెలంగాణ - కొనరావుపేట



మధ్యాహ్న భోజన కార్మికులు గౌరవ వేతనం, మెనూ చార్జీలు, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారని ఎంఈవో సీఐటీయూ నాయకులు అన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొనరావుపేట ఎంఈవోకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. బిల్లులు రాకపోవడంతో కార్మికులు అప్పుల పాలవు తున్నారని, తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షులు ఎగమాటి ఎల్లారెడ్డి, జిల్లా మధ్యాహ్న భోజన రంగం కార్యదర్శి, గురుజల శ్రీధర్, మధ్యాహ్న భోజన రంగం కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల బహూకరణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :



మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పారిపాలన దినోత్సవం జరుగగా మండల విద్యాధికారి జి.కృష్ణహరి గెలుపొందిన విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు బహూకరించారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉత్సహంగా ఉపాధ్యాయులుగా పాఠశాలను నిర్వహించారు. మండల విద్యాధికారి జి.కృష్ణహరి మాట్లాడుతూ కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. బాలల దినోత్సవం రోజున నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ద్వారా, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రజిత రూ.3వేల విలువ కలిగిన ప్లేట్స్, గ్లాస్‌లను విద్యార్థులకు ఎంఈవో చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంపత్, ఉపాధ్యాయులు నరేష్, రజిత, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా తయారైందని, వాటిని పర్యవేక్షించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు రోజురోజుకు నమోదువుతున్నాయని, ఇప్పటికే దాదాపు 40మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా చేసేందుకు సిద్ధమవుగా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు మట్టి శ్రీనివాస్, ముద్దం అనిల్, దేవరాజ్ ఉన్నారు.

మానవత్వం చాటిన కౌన్సిలర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :



ఆపద సమయంలో ఓ వ్యక్తికి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు సిరిసిల్ల పట్టణం 36వ వార్డు కి చెందిన కౌన్సిలర్ కల్లూరి రాజు. హైద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధు అనే వ్యక్తిక రక్తం అవసరంకాగా కౌన్సిలర్ రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానం ఆపద సమయంలో యువత రక్తదానం చేయాలని సూచించారు. తాను ఇప్పటి వరకు 50సార్లు రక్త దానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ బంధువులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒప్పందం ప్రకారం కార్మికులకు కూలీ చెల్లించాలి



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

పాలిస్టర్ పవర్‌లూం కార్మికులకు ఒప్పందం ప్రకారం యాజమానులు కూలీ చెల్లించాలని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్ల కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిస్టర్ యజమానులు ఒప్పంద ప్రకారంగా 10పీకులకు 25పైసలు చెల్లించకుండా 22పైసలు చెల్లిస్తున్నారని, దీనివల్ల కార్మికులు నష్టపోతున్నారన్నా రు. ఒప్పందం ప్రకారమే కార్మికులకు కూలీ చెల్లించాలని, లేకుంటే పాలిస్టర్ అసో సియేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పవర్లూమ్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు గుండు రమేష్, సహాయ కార్యదర్శి బెజిగాం సురేష్, బింగి సంపత్, లక్ష్మణ్, సందు పట్ల పోచమల్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శనలో ట్రైనీ ఐఏఎస్‌లు



నవతెలంగాణ - గంభీరావుపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం జార్ఖం డ్, బిహార్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సందర్శించింది. కళాశాలలో ఉన్న ప్రయోగశాలలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థిని విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయి భవిష్యత్తుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇంగ్లీష్, కంప్యూటర్‌తోపాటు సాంకేతిక పరిజ్ఞానం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్‌లు ఐదుగురు, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, అంజనేయులు, శ్రావణ్ కుమార్, వాణి, ఆదివిష్ణు, బిక్షమయ్య మనోహర్, కృష్ణ ప్రసాద్, శైలజ, దీపిక, భార్గవి, రాములు, మహేష్, జగన్నాథం, శ్రీనివాస్, లక్ష్మీ, లావణ్య నదీముద్దీన్, కవిత పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ముత్తారం


కేంద్రాలను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్

మండలంలోని ముత్తారం, పారుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ డి.వేణు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసి ధాన్యం, కొనుగోలు చేసిధాన్యం నిల్వలను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.సుమన్, డిప్యూటీ తహశీల్దార్ షఫీ, గిర్దవార్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ భవానీ ప్రసాద్ తదితరులున్నారు.

పెద్ద కాల్వలలో నిరుద్యోగ విజయోత్సవ సభ

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- గ్రూప్-4 తో పాటు వివిధ పరీక్షలు రిక్రూటైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

నవతెలంగాణ-పెద్దపల్లి


సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

డిసెంబర్ 4న నిరుద్యోగ యువతతో పెద్దపల్లిలో జరుగునున్న విజయోత్సవ సభ పెద్ద కల్వలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్ద కల్వలలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని శుభ్రం చేయాలని, రేపు ఉదయం స్టేజ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి బృందం వస్తుందని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ.. నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని, ఈ సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈఈ ఆర్ఎన్‌బీ భావ్ సింగ్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- రామగుండం ఎస్ఐ సంధ్యారాణి

నవతెలంగాణ-రామగుండం


మాట్లాడుతున్న ఎస్ఐ సంధ్యారాణి


మట్టిపోయిస్తున్న ఎస్ఐ సంధ్యారాణి

రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెంటిల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై సంధ్యరాణి మహిళల రక్షణకు, చట్టాలు, షీటీమ్ నిర్వహిస్తున్న విధులను వివరించారు. షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు, ర్యాగింగ్ ఇవిటీజింగ్, పోక్సోషీ టీమ్స్ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా షీ టీం పనిచేస్తుందని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులను ఎవరైనా, వేధింపులకు గురి చేసిన అవహేళనగా మాట్లాడిన డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పాఠశాలకు వెళ్లే రహదారి సరిగా లేదని, పాఠశాలకు చేరుకోవడంలో అసౌకర్యం, ఇబ్బందులు ఎదురవుతున్నాయని గమనించిన ఎస్సై సంధ్యారాణి స్పందించి స్థానికుల సహకారంతో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్పించి చదును చేయించారు.

సింగరేణి ఆర్జీ-1లో వృత్తి శిక్షణాతరగతుల ప్రారంభోత్సవం

శిక్షణ పొంది ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికేట్స్

నవతెలంగాణ-గోదావరిఖని:


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఆర్జీ 1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్

సింగరేణి సేవా సమితి ఆర్జీ-1 ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులు, మహిళలకు సామాజిక భాధ్యత, స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వారికి జీవనోపాధి కల్పించేందుకు వృత్తి శిక్షణ కేంద్రాలను నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 ఏరియా సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయి జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కత్తిరించి, టైలరింగ్, మగ్గంవర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర 15 శిక్షణ వత్తి శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. అలాగే గత సంవత్సరం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత పొందిన 18 వృత్తి శిక్షణల అభ్యర్థులకు 365 సర్టిఫికేట్స్ ప్రదానం చేశారు. ప్రతి ఒక్కరూ వృత్తి శిక్షణను శ్రద్ధతో మెళకువలు నేర్చుకొని ప్రావీణ్యం సాధించి స్వంతంగా యూనిట్స్ నెలకొల్పుకొని స్వయం ఉపాధి పొందాలని, నేర్చుకున్న తదుపరి ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని, వీటిని నేర్చుకొనుట వలన వారి మహిళల జీవనోపాధి మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సిఎంఓఏఐ ప్రతినిధి శ్రావణ్ కుమార్, ఎస్ఓటూజీఎం గోపాల్ సింగ్, డిజీఎం పర్సనల్ డి.కిరణ్ బాబు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, సేవా సెక్రటరీ శిరీష, జాయింట్ సెక్రటరీ బీనాసింగ్, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మి, సభ్యులు రష్మి సింగ్, కల్యాణి, సేవా కోఆర్డినేటర్ మేడి తిరుపతి తదితరులున్నారు.

షావెల్ దగ్ధంకు కార్మికులను బాధ్యులుగా చేయరాదు

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


నవతెలంగాణ-గోదావరిఖని



సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని ఓసిపి 5 ప్రాజెక్ట్‌లో జరిగిన షావెల్ దగ్ధంకు కార్మికులను బాధ్యులుగా చేయరాదని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో తరచూ జరుగుతున్న ఓపెన్ కాస్ట్ అగ్ని ప్రమాదాల్లో భాగంగా మంగళవారం సెకండ్ షిఫ్ట్‌లో ఆర్జీ-1 ఓసిపి 5లో సర్ఫేస్ ఫీడర్ వద్ద, యార్డ్ 2లో సింధూ షావెల్ అగ్ని ప్రమాదానికి మిషనరీ 70శాతం కాలిపోయిందని తెలిపారు. కొద్దిపాటి సమయంలో షావెల్ ఆపరేటర్‌కు ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు. మిషనరీ చాలా పాతదైపోవడం, అధికారులు పూర్తి మెయింటెనెన్స్ చేయకుండా కార్మికులతో బలవంతంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిషనరీకి ఆటో ఫైర్ సప్రెషన్ సిస్టం 180 డిగ్రీస్ వేడి తగిలినప్పుడు ఆటోమెటిక్‌గా ఫైర్ కంట్రోల్ చేయాల్సిన పరికరాలు పని చేయకుండా ఉన్నా, మిషనరీని ఓకే లిస్ట్‌లో పెట్టి బలవంతంగా పని చేయిస్తున్నారని పేర్కొన్నారు. బలవంతంగా ఎక్విప్మెంట్‌ను నడిపించడం వల్ల ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించే ఆపరేటర్లు సింగరేణి సంస్థ మనగడకు కార్మికులందరూ సహకరించడానికి సిద్ధంగా ఉన్న సరైన మెయింటెనెన్స్ లేని మిషనరీ నడిపించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. మెయింటెనెన్స్‌కు సమయం ఇవ్వకుండా ప్రొడక్షన్ పేరుతో నిర్లక్ష్యం చేయడం వల్ల జరిగిన ప్రమాదాన్ని ఎన్‌సిడబ్ల్యుఏ కార్మికులపై నెట్టివేయకుండా ఇప్పటికైనా అధికారుల ధోరణి మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కార్మికులను బాధ్యులుగా చిత్రీకరించరాదని, అలాంటి ప్రయత్నం చేస్తే కార్మికుల మనోభావాలను దెబ్బతీసినట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కు సన్మానం

నవతెలంగాణ-మెట్‌పల్లి


ఎమ్మెల్యేని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం ఆయుర్వేద సిద్ధాంతి మొట్టమొదటి వైద్యుడు ధాన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై మాట్లాడారు. వైద్యుడు దేవుడితో సమానం అన్నారు. దేశంలో రోజురోజుకు విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని,విద్యార్థులు వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఎమ్మెల్యే సంజయ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ- మేడిపల్లి

మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జగిత్యాల జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ అరుట్ల రజిత చైల్డ్ హెల్ప్ లైన్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. 18 ఏండ్ల లోపు బాల బాలికలకు రక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బిక్షాటన చేస్తున్న ఎక్కడ కనబడిన టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచిం చారు. ప్రధానో పాధ్యాయులు సాహెదా, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-గోదావరిఖని



గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బిజెపి క్రియాశీల కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో 110 క్రియాశీల సభ్యత్వ నమోదు చేసినటువంటి కార్యకర్తలు, 100 ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యవర్గ సభ్యులు గొట్టె ముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో బిజెపి మరింత బలపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాజీపేట శివాజీ, స్టేట్ మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సొమవరపు లావణ్య, బీజేపీ నాయకులు పెద్దపల్లి రవీందర్, దాసరి శ్రీనివాస్, మూకిరి రాజు, సుల్వ లక్ష్మీనరసయ్య, మహావాది రామన్న, జనగామ శివరామ కృష్ణ, తిలక్ నగర్ మండల అధ్యక్షులు గోపగాని నవీన్ గౌడ్, ఆకుల శశికుమార్, జి.మంజుల, వసంత, లక్ష్మి, గంద్ర స్వరూప, పాలకుర్తి మల్లేష్, బూడిద రమేష్, సురేష్, చుక్కల రాములు, లింగం నాయక్ తదితరులున్నారు.

కంటి శస్త్ర చికిత్సకు తరలింపు

నవతెలంగాణ-ఓదెల


తరలివెళ్తున్న వృద్ధులు

ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవ స్థాపక అధ్యక్షుడు నేత్రవైద్య నిపుణులు లయన్ పూదరి దత్తాగౌడ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరంలో 31 మందిని ఉచిత కంటి ఆపరేషన్‌కి ఎంపిక చేశారు. 31 మందికి ఉచితంగా కంటి సరస్ చికిత్స చేయడానికి బుధవారం ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్, డాక్టర్ అనురాగ్ పవార్, డాక్టర్ శుభం, గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేష్ కుమార్, లలిశెట్టి వంశీ, సర్వంగ్ ఉన్నారు.

ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-మల్యాల



మండలంలోని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయ గిరి ప్రదక్షణలో భాగంగా కొండగట్టు చుట్టూ చదును చేయడానికి (రోడ్డు మార్గం కోసం) బొజ్జ పోచన్న ఆలయం వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, మల్యాల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-మల్యాల


రిబ్బన్ కట్ చేస్తున్న డైరెక్టర్

మల్యాల మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఫోరైడ్ రహిత మంచినీటి పథకంలో భాగంగా ఫాతిమానగర్ ఆడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ ఆర్థిక సహాయంతో వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. స్పెయిన్ దేశం నుంచి విచ్చేసిన రోషియ్, అలిభాట్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సిస్టర్ ప్రీతి, సంస్థ ప్రొవెన్సిషల్ మదర్ అనిష్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, సిస్టర్ వెలంగాణి, గ్రామ పెద్దలు ఆనంద్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, చారి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న జనగామ జడ్జీ

నవతెలంగాణ-మల్యాల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయస్వామిని జనగామ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జీ డి.రవీందర్ శర్మ కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహర్నాథ్ శాలువాతో సత్కరించి, లడ్డు ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, ఏఎస్ఐ రమణారెడ్డి తదితరులున్నారు.

జోనల్ స్థాయి నెట్‌బాల్ పోటీలకు మల్యాల విద్యార్థులు

నవతెలంగాణ-మల్యాల



లక్ష్మీపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి నెట్బాల్ పోటీలలో మల్యాల మండలం వాగ్దేవి స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు గౌతమ్‌చారి, హాసిని, సింధులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోకల నరేష్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరిని తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, పుర ప్రముఖులు అభినందించారు.

మాల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎండపల్లి



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మాలల సింహ గర్జన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటంలో భాగంగా డిసెంబర్ 1తేదీన హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జనకు మాలలంతా తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బోల్లం మల్లేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల సత్యం, మండల అధ్యక్షుడు రెడ్డి మల్ల తిరుపతి, మండల నాయకులు గౌరీ ప్రభాకర్, కోడి గంగయ్య కంది విష్ణుమూర్తి ,దేవి రవీందర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ - మెట్‌పల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం కేవలం తమకు నచ్చిన వారికే, మెచ్చిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, యువనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-గోదావరిఖని

గోదావరిఖనిలోని శ్రీ రామా విద్యానికేతన్ పాఠశాలలో శ్రీకాంత్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు డాక్టర్ ఇ.శ్రీకాంత్, డాక్టర్ ఇ.సుమలత విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలతో బాధ పడుతున్న వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



జిల్లాకు 2వేల ఎకరాల్లో పామ్ ఆయిల్ సాగు లక్ష్యం

ఉద్యాన అధికారి జ్యోతి తిరుమల


వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్న ఉద్యాన అధికారి జ్యోతి తిరుమల

నవతెలంగాణ-ముత్తారం

ఈ సంవత్సరంలో జిల్లాకు 2వేల ఎకరాల్లో పామ్ ఆయిల్ సాగుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఉద్యాన అధికారి జ్యోతి తిరుమల తెలిపారు. బుధవారంముత్తారం మండలంలోని సర్వారం, మైదంబండ గ్రామాల్లో రైతులు గుజ్జుల రాజిరెడ్డి, ఎర్రం సమ్మయ్య వ్యవసాయ క్షేత్రాలను ఉద్యాన అధికారి జ్యోతి, నాబార్డ్ డిడిఎం ఎస్.జయప్రకాష్ బుధవారం పరిశీలించారు. రైతులకు ఆయిల్ పామ్ సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సంవత్సరానికి గాను మొక్కలు పెట్టుకోవడానికి డీడీలు తీసిన రైతులు నర్సరీ నుండి మొక్కలు తీసుకువెళ్లి నాటుకోవాలని సూచించారు. పామ్ ఆయిల్ రైతులు అంతర పంట పెట్టినందుకు సంవత్సరానికి రూ.4200 చొప్పున నాలుగు సంవత్సరాలకు కలిపి రూ. 16,800 ఉద్యాన శాఖ ద్వారా రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఎకరానికి 57 మొక్కలకు రూ.1140 చెల్లించి, రైతు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ బ్యాంకు, అకౌంటు పాస్ పుస్తకం సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే రామగుండం, మంథని ఉద్యాన శాఖ అధికారి ఎ.జ్యోతిని 8977714039, ఎ.ప్రీతం 807455 7314 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ సెక్రటరీని తిట్టిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

నవతెలంగాణ - మెట్‌పల్లి

డంపింగ్ యార్డ్ చెత్త తరలించిన సిబ్బందిని, పంచాయతీ సెక్రటరీని దుర్భాషలాడిన మల్లాపూర్ మండలం ముత్యంపేట్ గ్రామానికి చెందిన ఖజఖాన్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.200ల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారు. 2019లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సెక్రెటరీ ఎండి జమీన్ ఆదేశానుసారం ముత్యంపేట గ్రామపంచాయతీ సిబ్బంది చెత్తను రిక్షాలో వేసుకొని గ్రామ శివారులోని డంపింగ్ యార్డ్‌లో చెత్త వేయగా, అవతల వైపు భూమి ఉన్న ఖాజా ఖాన్, పంచాయతీ సెక్రెటరీని ఇది నా భూమి, చెత్త వేస్తున్నవని దుర్భాషలాడుతూ విధులకు భంగం కలిగించడంతోపాటు కొడవలితో గాయపరచగా, పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు ఖజాఖాన్‌పై కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించిన మెజిస్ట్రేట్ ఖజాఖాన్ నేరం నిరూపణ కావడంతో నందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్షేత్ర పర్యాటనతో జ్ఞానం

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి


సందర్శనలో ఆల్ఫోర్స్ విద్యార్థులు

నవతెలంగాణ-మల్యాల

క్షేత్ర పర్యాటన ద్వారా విద్యార్థులకు చాలా లాభాలు చేకూరుతాయని, జ్ఞానం పెరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని స్థానిక అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు పాఠశాల తరగతి విద్య ప్రణాళికలో భాగంగా కరూర్ వైశ్య బ్యాంక్ క్షేత్ర పర్యాటనకు బయలుదేరే ముందు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు స్థానిక కేవీబీని సందర్శించారని, బ్యాంక్ మేనేజర్ సహకారంతో బ్యాంక్‌లో జరుగుతున్న లావాదేవీల తీరును తెలుసుకున్నారని చెప్పారు. చాలా మందికి బ్యాంకులో నిర్వర్తిస్తున్న వివిధ అంశాల పట్ల అవగాహన లేకపోవడం వల్ల ఆర్థిక రంగంపై ప్రభావం చూపుతున్నదని తెలిపారు. ప్రత్యేకంగా నగదు బదిలీ విధానం, నగదు ఉపసంహరణ చేసే ప్రక్రియను శాస్త్రీయంగా విద్యార్థులకు తెలిపినట్టు చెప్పారు. బ్యాంకుల్లో అత్యంత కీలకమైన లాకర్స్ విభాగాన్ని విద్యార్థులకు వివిధ దృశ్య మాలికల ద్వారా వర్ణించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు బాయ్ లింగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తామని చెప్పి నేటికి దాని ఒసే తీయడం లేదని అన్నారు. రైతు రుణమాఫీ ఇంకా 70శాతం మంది రైతులకు ఇవ్వాల్సి ఉన్న పూటకో మాట మాట్లాడుతూ.. కాలం వెళ్ళదీస్తున్నారని విమర్శించారు. ఇంకా రైతు భరోసా ఊసే లేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండకు వెళ్లే దారిలో రెండు లోన్ లెవెల్ వంతెన నిర్మాణం పనులు శిలాఫలకాలికే పరిమితం అయ్యాయి అన్నారు. ఈ సమా వేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రణధీర్, వెంకటేష్, గోపాల్, శేఖర్ రాకేష్ పాల్గొన్నారు.

చెత్తను తరలించే వాహనం దగ్ధం

నవతెలంగాణ-కోల్‌సిటీ

రామగుండం నగరపాలక పరిధిలో చెత్తను తరలించే ఓ ట్రాలీ వాహనం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వాహనంలో తలెత్తిన సమస్య కారణంగా దానిని రిపేర్ చేయించేందుకు తీసుకెళ్తుండగా గోదావరిఖని గౌతమ్‌నగర్‌లోని అలేఖ్య థియేటర్ ప్రాంతంలో ఈ ప్రమాదం సంభ వించింది. బ్యాటరీలో తలెత్తిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని ప్రమాదం జరిగి నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 29, 30 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా 10వ మహాసభలు జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. బుధవారం జమ్మికుంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టజీవుల పక్షాన నికరంగా నిలబడుతూ, జిల్లాలో ప్రజా సమస్యలపై ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) జిల్లా 10వ మహాసభలు జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకుంటామన్నారు. మహాసభలో ప్రజా సమస్యలపై తీర్మానాలు చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. నాటి నుండి నేటి వరకు పేద ప్రజలు, కష్టజీవుల పక్షాన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది ఎర్రజెండానే అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నా అరికట్టడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు రాకపోగా పది సంవత్సరాల కాలంలో కాలంలో సుమారు 18 లక్షల ఉద్యోగాలను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యం చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అతి ముఖ్యమైన గ్యారంటీ సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు ఇస్తామన్న హామీ నేటికీ అమలు కావడం సిగ్గుచేటని విమర్శించారు. రేషన్ కార్డు లేక అనేక మంది కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించేలా దీక్షా దివస్

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ - గంగాధర

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా దీక్ష దివస్ నిర్వహిస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ నెల 29న కరీంనగర్ అల్గునూర్‌లో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని దండుగా కదులుదాం.. విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గంగాధర మండలం బూరుగుపల్లి బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ 2009 నవంబరు 26న దీక్ష చేసేందుకు కేసీఆర్ కరీంనగర్‌కు వచ్చారన్నారు. ఆనాడు వలస పాలకుల వివక్షపై స్వరాష్ట్రం కోసం తెలంగాణ పోరాటం చేశామని, ఇప్పుడు మరో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అసమర్థ పాలన చేస్తుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రతి సభలో కేసీఆర్ స్మరణ చేయడం తప్ప ఆయన ఏమి చేస్తాడో చెప్పడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇప్పలపల్లి సాంబయ్య, నాయకులు కృష్ణారావు, మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు సర్కారు అండ

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


రూ. 5 లక్షల పరిహారం ప్రొసీడింగ్ పత్రం అందజేసిన ఎమ్మెల్యే సత్యం

నవతెలంగాణ - గంగాధర

గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు సుందరగిరి రమేష్ అబుదాబిలో మరణించగా, అతని కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ప్రొసీడింగ్ పత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందించారు. రమేష్ అబుదబిలో పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడే మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో భార్య, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారు అయ్యారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.5లక్షల పరిహారం మంజూరు చేయించి బాధిత కుటుంబాని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి, అనివార్య కారణాలతో అక్కడే మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్నారై పాలసీని అమలు చేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆపదలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు దొమకొండ మహేష్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మ్యాక వినోద్, సురేష్, కార్తిక్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6.950

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు విడి పత్తి 183 క్వింటాళ్లు 21వాహనాలలో బుధవారం రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.6,950, మాడల్ - 6,800, కనిష్ఠ - 6,600 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో13 క్వింటాళ్లు ఏడుగురు రైతులు తెచ్చారు. గరిష్ఠ ధర రూ.6,500, మాడల్ - 6,400, కనిష్ఠ - 6వేలు పలికిందని మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధి దశలో టూరిజం..

- ముస్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- కిమ్స్‌లో కేక్ మిక్సింగ్ వేడుక..



నవతెలంగాణ - కరీంనగర్

ప్రపంచ స్థాయిలో టూరిజం చాలా అభివృద్ధి దశలో కొనసాగుతుందని, దీనికి కారణం హోటల్ మేనేజిమెంట్ రంగమే ప్రముఖ పాత్ర వహిస్తుందని కరీంనగర్ ముస్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కరీంనగర్‌లోని కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డ్రైఫ్రూట్స్‌తో కేక్ మిక్సింగ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలలకు ఎక్కడికి వెళ్లినా టూరిస్టుల అభిరుచులకు తగినట్టుగా హోటల్ రంగం వారికి సకల సౌకర్యాలు అందిస్తుందని, ఈ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని అన్నారు. కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మెన్ సాకేత్ రామారావు మాట్లాడుతూ.. టూరిజం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శాలిని, ప్రిన్సిపాల్స్ అనూష్‌రెడ్డి, అర్జున్‌రావు, అధ్యాపకులు గౌతమ్, యశ్వంత్, సతీష్, అజయ్, చంద్రకళ, 400 మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాన్సన్ కోరా విద్యార్థుల ఎడ్యుకేషనల్ ట్రిప్



నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని జాన్సన్ కోరా పాఠశాల విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్లో భాగంగా కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లోని పాల కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. విద్యార్థులు పాల ఉత్పత్తి విధానాన్ని వాటిని శుభ్రపరిచి వేడి చేసి స్టోర్ చేసే విధానాన్ని అక్కడి సిబ్బంది విద్యార్థులకి సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి ఎడ్యుకేషన్ పర్యటన ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ డివిజన్ పరిధిలో కొంతకాలంగా సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సుమారు 50 సెల్ ఫోన్లను బుధవారం ఏసీపీ శ్రీనివాస్ జి ఆధ్వర్యంలో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఒకవేళ పోలీసులకు ఫిర్యాదు చేయకుంటే దొంగలించబడిన సెల్‌ఫోన్‌లతో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హుజురాబాద్, జమ్మికుంట సీఐలు తిరుమల్‌గౌడ్, వరగంటి రవి, కిషోర్, ఎస్సైలు తోట తిరుపతి, ఎన్.రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత, పోషకాహారంతో ఆరోగ్యం..

నవతెలంగాణ - జమ్మికుంట: మనం పరిశుభ్రంగా ఉండి, పోషకాహారాలు తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థినులు అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధినిలోని మొత్తుకులగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారం, పరిశుభ్రత, గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక కెవికె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎ.ప్రశాంతి, మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు నందన, మానస, మాధురి, లావణ్య, నిహారిక, నిత్య నిఖిత, మనీషా, మతంకి, మనస్విని, ముస్కాన్, ఉపాధ్యాయుడు అశోక్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండల అభివృద్ధిలో భాగంగా ఎంజిఎన్ఆర్ఎస్ నిధుల నుండి 3.07 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజల తరపున బుధవారం మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



నవతెలంగాణ - హుజురాబాద్ : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలును పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, క్రీడాకారులు చింత శ్రీనివాస్ పరిశీలించారు. అన్నం ముద్ద ముద్దగా తినలేనంత పరిస్థితిలో ఉందని, చారు నాసిరకంగా ఉందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహ గర్జన పోస్టర్‌ను జాతీయ మాల మహనాడు తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు ఎలుక రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక అంజనేయులు, నాయకులు గంట శ్రీనివాస్, దామెర సత్యం, ఇరుకుల్ల యాదగిరి, ఎలుక శ్రీధర్, దొంత తిరుపతి, రొడ్డ రమేష్, పురం బాబు, బురుగు అంజయ్య, రాజు కుమార్, బొబ్బిలి అఖిల్, కిరణ్, గూడ కృష్ణ పాల్గొన్నారు.

గునుకులపల్లె పెట్రోల్ బంక్ ప్రారంభం



నవతెలంగాణ - చిగురుమామిడి

వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ 24గంటలు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా గునుకులపల్లెలో బిపిసి ఎల్ బంక్‌లో పెట్రోల్ పంపును నూతనంగా ఏర్పాటు చేసినట్టు చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గునుకులపల్లెలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్, డీజిల్ బంక్‌ను కరీంనగర్ సిఎస్ సేల్స్ మేనేజర్ శరణ్‌జిత్, పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి పున: ప్రారంభించారు. ప్రయివేటు బంక్‌లకు దీటుగా వినియోదారులకు, రైతులకు 24గంటలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక చేసినట్టు చైర్మన్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పెట్రోల్ బంక్ పున:ప్రారంభోత్సవానికి సహకరించిన నాస్కాబ్ చైర్మన్, కేడీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావుకు చైర్మన్, పాలకవర్గ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు ముద్రకోల రాజయ్య, కూతురు రవీందర్‌రెడ్డి, పోతరవేని శ్రీనివాస్, తాళ్లపల్లి తిరుపతిగౌడ్, అందే స్వామి, పేరాల లక్ష్మి, మాచమల్ల లచ్చవ్వ, సింగిల్‌విండో సీఈవో కాటం నరసయ్య, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోటి కపడా రొమాన్స్ సినిమా యూనిట్ సందడి



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లో బుధవారం రోటి కపడా రొమాన్స్ సినిమా యూనిట్ సందడి చేసింది. మొదట తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి, కరీంనగర్‌లోని కొత్తపల్లి అల్ఫోర్స్, ట్రినిటీ, కోట ఇన్స్టిట్యూట్‌లో విద్యార్థులతో ముచ్చటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన 'రోటి కపడా రొమాన్స్' చిత్రం ఈ చిత్రాన్ని 'హుషారు', 'సినిమా చూపిస్త మావ', 'మేం వయసుకు వచ్చాం, 'ప్రేమ ఇష్క్ కాదల్', 'పాగల్' లాంటి యూత్ ఫుల్ సినిమాలను నిర్మించిన బెక్కెం వేణుగోపాల్, సృజన్ ప్రొడ్యూస్ చేశారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుషిబ్బు చౌదరి ప్రధాన పాత్రల్లో నటించారు. దిల్ రాజు, శిరీష్ రెడ్డి ఆఫీసు నుంచి సినిమా విడుదల చేస్తున్నారు. సినిమాను కరీంనగర్ పట్టణానికి చెందిన పెద్ది ప్రవీణ్, టీం నైజాం డిస్ట్రిబ్యూటర్లుగా వ్యవహరిస్తూ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'రోటి కపడా రొమాన్స్' సినిమాలోని చక్కటి కంటెంట్, ఎమోషనల్ డెప్త్ యువతను బాగా ఆకట్టుకుంటుందన్నారు.

ప్రజా పాలనపై కళా ప్రదర్శన

నవతెలంగాణ - శంకరపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది కాలంలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై బుధవారం మండలంలోని కొత్తగట్టు, మొలంగూర్, మెట్‌పల్లి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి వడ్లకొండ అనిల్ కుమార్ బృందం కళాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు మహాదేవుని శ్రీధర్, ఎర్ర సురేష్, రావుల తిరుపతి, దొగ్గల శ్రీధర్, దొగ్గల రాజు, ఎండి.నిజాముద్దీన్, రావుల సాయికుమార్, కొంకట తిరుపతి, ఎండి.ఆసియా, పోతరవేని పద్మ పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్ మృతి



నవతెలంగాణ - శంకరపట్నం : టీడీపీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్ గుండెపోటుతో మృతిచెందాడు. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన సయ్యద్ ఆరిఫ్ బుధవారం వీనస్ హాస్పిటల్‌లో మృతిచెందారు. ఆయన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి సాధారణ కార్యకర్తగా ఉమ్మడి జిల్లా మైనార్టీ శాఖ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

సోషల్‌మీడియాలో పోస్టులపై కేసు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనను వ్యతిరేకించడమే కాకుండా కుల గణనకు మద్దతు తెలిపిన పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీని కించపర్చే విధంగా బూతులు తిడుతూ బీజేపీ నేత సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నబోయిన రవి ఆధ్వర్యంలో నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిమ్మాపూర్ ఎస్ఐ వివేక్ కేసు నమోదు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నల్ల కొండల్‌రెడ్డి తండ్రి నల్ల పుల్లారెడ్డి మరణించగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు పరామర్శించారు. అనంతరం మండలంలోని శ్రీరాములపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కాంతాల శంకర్‌రెడ్డి, లాస్మక్కపల్లి గ్రామంలో మ్యాకల మల్లారెడ్డి, నాగిడి భారతమ్మ, నర్సింగాపూర్ గ్రామంలో వంగల సమ్మిరెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు కొమ్మిడి రాకేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదాసి సునీల్, కామెడీ శ్రీపతిరెడ్డి, నల్లగొని సతీష్, ఎండి రషీద్ పాషా, నాయకులు కురిమిండ్ల తిరుపతయ్య, మసాడి చొక్కారావు, తదితరులు ఉన్నారు.

పారమిత పాఠశాలలో ఆకట్టుకున్న ప్రాజెక్టుల ప్రదర్శన


ప్రాజెక్టులు పరిశీలిస్తున్న చైర్మెన్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

నగరంలో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస ప్రదర్శన ఇంటర్ పీబీఎల్ ముగింపు వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పారమిత పాఠశాలలో విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఆలోచనతో ప్రతి సంవత్సరం ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసనను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి అన్ని పారమిత పాఠశాలలలో గత ఫిబ్రవరి మాసంలో 1500 మంది విద్యార్థులతో 200 గ్రూపులుగా పరిశోధనలు ప్రదర్శించగా అందులో 80 గ్రూపులు మంచి ప్రదర్శనను చూపించాయి. తర్వాత మార్చి మాసంలో నిర్వహించిన చివరి పోటీలో 80 గ్రూపులు పాల్గొనగా 60 మంది విద్యార్థులతో కూడిన 12 గ్రూపులు 2023-24 సంవత్సరానికి పీబీల్ అవార్డు విజేతలుగా గుర్తించారు. అవార్డులు పొందిన బెస్ట్ ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. అదనపు కలెక్టర్‌తో కలిసి పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు విజేతలకు అవార్డులు, సర్టిఫికెట్స్ ఇచ్చి సత్కరించారు. ఈ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసన ద్వారా 8 సంవత్సరాలుగా దాదాపు 30 వేలకు పైగా విద్యార్థులు, 500కు పైగా ఉపాధ్యాయులు ప్రయోజనం పొందారని పీబీఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు తెలిపారు. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, టీఎస్వీ రమణ, వినోదరావు, వీయూఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, బాలాజీ, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రశాంత్, కవితాప్రసాద్, పీబీఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు, పీబీఎల్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫామ్స్ పంపిణీ



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి పట్టణంలోని రాంనగర్ అంగన్వాడి సెంటర్‌లో బుధవారం ప్రీస్కూల్ పిల్లలకు కౌన్సిలర్ నలుమాచు జ్యోతిరామకృష్ణ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్ మల్లేశ్వరి, ఆయా అమల, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ - శంకరపట్నం : టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగు దశలవారీ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శంకరపట్నం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా (కేజీబీవీ) విద్యాలయంలో భోజన విరామ సమయంలో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ నాయకులు ఎం.ఏ.ఖాద్రీ, బోడ శ్రీనివాస్, ఎండి.అలీం, ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో రోజు రోజుకు భారం అవుతుందని, నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుకుంటున్నాయని, పని భారం ఎక్కువ అవుతున్నా జీతాలు పెరుగటం లేదని వాపోయారు.విద్యాలయాల్లో చిల్డ్రన్ కేర్‌టేకర్‌లను వెంటనే ప్రభుత్వం నియమించాలని అన్నారు. నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండిలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్ కోరారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయంలో బుధవారం కరీంనగర్, చొప్పదండికి చెందిన అయ్యప్ప భక్తులు దీక్షలు తీసుకున్నారు. భక్తులందరికి అన్ని ఏర్పాట్లు ఆలయంలో చేస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండే సత్యానందం, ఉపాధ్యక్షులు ఎలిగేటి రాములు, బత్తిని ప్రశాంత్ పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ టాలెంట్, వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనంలో బుధవారం ఎంఈఓ దీక్షితులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సైన్స్‌లో ప్రయోగాలు మానవ జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుందన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా ఆర్నకొండ జెడ్‌పిహెచ్ఎస్, వ్యాసరచన పోటీలలో డి.శ్రీరుతిక్, చొప్పదండి జెడ్‌పిహెచ్ఎస్ బాలురు, కె.సాత్విక్ వీణాదరి, కె.సాహిత్య రేవెల్లె యుపిఎస్, ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు.



జీడిమెట్ల అగ్నిప్రమాదంలో కుప్పకూలిన పరిశ్రమ భవనం

- రూ.100 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల ఎస్ఎస్వీ ఫ్యాబ్ ఇండస్ట్రీస్ పాలిథిన్ సంచుల తయారీ కంపెనీలో మంగళవారం భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. పరిశ్రమలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అర్ధరాత్రి వరకు అదుపులోకి తీసుకొచ్చారు. వివారల్లోకెళ్తే.. జీడిమెట్ల ఫేజ్ 5 దూలపల్లి రోడ్డులో ఎస్ఎస్వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమ ఉంది. పరిశ్రమ మొత్తం 3 ఫ్లోర్లలో నడుస్తోంది. ఆ పైన రేకుల షెడ్డు నిర్మించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భవనంలోని మూడో అంతస్తులో మంటలు ఏర్ప డగా, క్రమంగా ఒకటో అంతస్తు వరకు వ్యాపించాయి. ఆ తర్వాత భవనం మొత్తం మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఫ్యాక్టరీలోని కెమికల్ డ్రమ్ములు పెద్ద ఎత్తున పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. సమా చారం అందుకున్న అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి ప్రమాద తీవ్రతను గమ నించి, ఉన్నతాధికారులకు వివరించి, నగరంలోని పలుచోట్ల నుంచి ఏడు ఫైరింజన్లను తరలించారు. అలాగే, వాటర్ బోర్డుతో పాటు ప్రయివేటు ట్యాంకర్లతో నీటిని తరలించారు. ఒక దశలో మంటలు వంద మీటర్ల ఎత్తు వరకు ఎగిసి పడ్డాయి. రసాయన డ్రమ్ముల పేలుడుతో మంటలు భారీగా ఎగిసిపడగా.. మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. మంటల ధాటికి భవనం గోడలు బీటలు వారి కుప్పకూలి పోయింది. దాదాపు రూ.100కోట్లకుపైగా నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. పరిశ్రమలో మొత్తం 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలో జనరల్ షిఫ్ట్‌లో 200 మందికిపైగా కార్మికులు ఉన్నట్టు సమాచారం. మంటలు రాగానే కార్మికులంతా బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

మై హెూమ్ భుజ 9వ అంతస్తుపై నుంచి పడి వివాహిత మృతి

- సరోగసి కోసం ఒడిశా నుంచి వచ్చిన మహిళ
- లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి నుంచి తప్పించుకునే క్రమంలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

మై హెూమ్ భుజ 9వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వివాహిత మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన అశ్వితసింగ్(25) సరోగసి ద్వారా పిల్లలను కనడానికి ఓ వ్యక్తి ద్వారా హైదరాబాద్‌కు వచ్చింది. హై మోమ్ భుజ 9వ అంతస్తులో ఉంటున్న రాజేష్‌బాబు అనే వ్యక్తి ఆమెకు పిల్లలను కనివ్వడానికి రూ.10 లక్షల డీల్ కుదుర్చుకున్నాడు. అయితే నెలరోజులుగా మృతురాలిని బయటకు వెళ్లనివ్వకుండా రాజేష్ తన ఫ్లాట్‌లోనే బంధించాడు. కనీసం ఆమె భర్తను కూడా కలవనివ్వలేదు. దాంతో పాటు ఆమెను లైంగికంగా వేధించాడు. దాంతో రాజేష్‌బాబు ప్రవర్తన నచ్చక ఆమె పారిపోవడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో 9వ అంతస్తు నుంచి కిందపడి చనిపోయింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వీహెచ్ కారును ధ్వంసం చేసిన దుండగులు

- ఇంటి ముందు పార్క్ చేసిన వాహనం
- మరో వాహనంతో ఢీకొట్టిన నిందితులు

నవతెలంగాణ-అంబర్‌పేట



కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు (వీహెచ్) కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. హైదరాబాద్ అంబర్ పేట లో వీహెచ్ ఇంటి ముందు పార్క్ చేసిన కారును బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై పోలీసులకు వీహెచ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. కారు నెంబర్ ప్లేట్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై వీహెచ్ మాట్లాడుతూ.. తన వాహనంపై ఇలా దాడి జరగడం ఇది రెండోసారి అని చెప్పారు. దాడికి గల కారణాలు తెలుసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురౌతుంటే పాలకులు, అధికారుల్లో కదలిక లేదని మండిపడింది. వాంతులు, విరోచనాలు చేసుకుని అనారోగ్యానికి గురౌతుంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల ప్రాణాలు పోతేగానీ స్పందించరా అంటూ ప్రభుత్వాన్ని నిలదీసింది. నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీ స్కూల్‌లో వరుసగా మూడుసార్లు విద్యార్థులు ఆస్పత్రిపాలైన ఘటనపై వివరాలు ఇచ్చేందుకు వారం రోజులు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో కోర్టు అసహనం వ్యక్తం చేసింది. వాయిదా వేసే ప్రసక్తే లేదనీ, నారాయణపేట డీఈవో ఇతర ఆఫీసర్ల దగ్గర సెల్‌ఫోన్లు లేవా అని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి మేమైతే వెంటనే డీఈవోను సస్పెండ్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రభుత్వం తరఫున వాదించేందుకు అదనపు అడ్వొకేట్ జనరల్ విచారణకు రావాలని తేల్చి చెప్పింది. దీంతో పది నిమిషాల తర్వాత అదనపు ఏజీ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ విచారణకు హాజరై పూర్తి వివరాలు భోజన విరామం తర్వాత ఇస్తామని చెప్పడంతో హైకోర్టు సమ్మతించింది. ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు సరిగ్గా లేదంటూ హైదరాబాద్‌కు చెందిన కె.అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. మాగనూరులో ఈనెల 20, 24, 26 తేదీల్లో వరసగా విద్యార్థులు మిడ్డే మీల్స్ తిని ఆస్పత్రి పాలయ్యారని పిటిషనర్ లాయర్ చిక్కుడు ప్రభాకర్ వాదించారు. దీనిపై కౌంటర్ వేసేందుకు వారం రోజులు కావాలని ప్రభుత్వ ప్లీడర్ కోరడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మాగనూరు 70 కిలోమీటర్ల దూరంలోనే ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రభాకర్ చెప్పారు. అక్కడ నుంచి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని తెప్పించుకునే సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. దీంతో, ఫోన్‌లో డీఈవో నుంచి సమాచారాన్ని తెప్పించుకునేందుకు వారం రోజులు సమయం ఎందుకుని హైకోర్టు ప్రశ్నించింది. గడువు కోరడానికి సిగ్గుపడాలని వ్యాఖ్యానించింది. అధికారులకు కూడా పిల్లలు ఉన్నారనీ, మన పిల్లలకు అలా జరిగితే ఎలా వ్యవహరిస్తామో ఒకసారి ఆలోచన చేయాలని సూచించింది. విద్యార్థులు చచ్చిపోతేనే మీలో కదలిక వస్తుందా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఈరోజే రెక్కలు కట్టుకుని సమాచారంతో వచ్చి వాలుతారని పేర్కొంది. లంచ్ తర్వాత అదనపు ఏజీ వాదనలు వినిపిస్తూ, లోకల్‌గా తయారు చేసిన కుర్‌కురేను విద్యార్థులు తినడంతోనే అస్వస్థతకు గురయ్యారనీ, రెండు సార్లు మాత్రమే స్కూల్‌లో మిడ్డే మీల్స్ వల్ల ఇబ్బందులు పడ్డారని కోర్టుకు తెలిపారు. మిడ్డే మీల్ తిన్నడం వల్ల జరిగిన ఘటనలకు బాధ్యులైన అధికారులు సస్పెండ్ అయ్యారని చెప్పారు. మధ్యాహ్న భోజనం తయారీదారు లను కూడా మార్పు చేశారని వివరించారు. కరీంనగర్ జిల్లా బూరుగపల్లి మండలం గంగాధరలో కూడా ఈ నెల 24న 20 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారని కోర్టుకు తెలిపారు. వాదనల అనంతరం ప్రభుత్వం తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు డివిజన్ బెంచ్ తదుపరి విచారణను డిసెంబర్ 2కు వాయిదా వేసింది.

క్వింటాకు ఐదు కిలోల కోత

ధాన్యం తూకంలో దోపిడీ

- రైతాంగం నిస్సహాయత



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు, మిల్లర్లు.. రైతులను ఎడాపెడా దోచుకుంటున్నారు. క్వింటాల్‌కు 5 కిలోల మేరకు కోత పెడుతుండటంతో రైతాంగం భారీగా నష్టపోతోంది. ఎకరాకు 40 క్వింటాళ్ల ధాన్యం పండించిన రైతు సగటున క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున 2 క్వింటాళ్ల ధాన్యాన్ని కోల్పోతున్న పరిస్థితి ఉంది. సన్నాలైనా, దొడ్డు రకాలైన తూకంలో కోతలు విధించడం సర్వసాధారణం అయిపోయింది. రైతులను దబాయించి మరీ ధాన్యం తూకంలో కోతలు విధిస్తుండటం, ప్రశ్నించినా దోపిడీ ఆగకపోవడం పట్ల రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవు తున్నారు. అలాగే, కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు కరువ య్యాయి. రైతుల సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా నిర్వాహకులుగాని, అధికారులు గాని స్పందించకపోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు చాలాచోట్ల ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగే తూకంలో మోసాలు కొనసాగు తూనే ఉన్నాయి. హన్మకొండ జిల్లాలో శనివారం నాటికి 31,701 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఇందులో క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున కోత పెట్టగా జిల్లాలో సుమారు 1,268 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. హన్మకొండ జిల్లాలో 157 కొను గోలు కేంద్రాలు కేటాయించగా 148 మాత్రమే ప్రారంభిం చారు. వాటిలో ఐకేపీకి సంబంధించి 37, పీఏసీఎస్‌కు చెందిన 83 కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన 28 కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదు. 9 కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం. ప్రారంభించిన ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో మోసాలు కొనసాగు తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులు 2 కిలోలు కోత పెడితే, కొనుగోలు కేంద్రం నుంచి మిల్లర్ల వద్దకు వెళ్లిన ధాన్యంలోనూ మిల్లర్లు 3 కిలోలను కోతపెడుతున్నారు. మొత్తంగా రైతులు 5 కిలోల మేరకు ధాన్యాన్ని ప్రతి క్వింటాల్‌కు నష్టపోతున్నారు. వివిధ నాణ్యతా ప్రమాణాల నెపంతో నిర్వాహకులు రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ విషయమై ఎంత మంది అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండాపోతుందని రైతులు వాపోతున్నారు. ఈ మోసాలపై అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషించడం గమనార్హం. సివిల్ సప్లయ్ అధికారులు ఈ వ్యవహారాన్ని చూసీచూడనట్టు ఉండటంతో ఈ దందా కొనసాగుతోంది. అలాగే, కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు కరువ య్యాయి. జిల్లా కలెక్టర్లు ధాన్యం కొనుగోలుకు సంబంధించి సన్నాహక సమీక్షా సమావేశాలు నిర్వహించిన సందర్భంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు రైతులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. రైతులే స్వయంగా టార్పలిన్లు సమ కూర్చుకొని ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది.

పట్టించుకోరేం..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడిపై రైతులు, రైతు సంఘాలు ఎన్ని విమర్శలు చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, మటి పెల్లలు, చెత్తాచెదారం, గన్నీ బ్యాగుల పేరిట తరుగు తీయ డంలో భాగంగా భారీగా కోత పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఓ పద్ధతిలో కోత పెడితే మిలర్లు అంతకు రెట్టించి కోత పెడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపో తున్నారు. ఆరుగాలం కష్టించి క్వింటాల్ ధాన్యానికి 5 కిలోలు నష్టపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా మమ్మల్ని మోసం చేస్తున్నా రని, ఎంత మొత్తుకున్నా తమ మొర ఆలకించేటోళ్ల లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోసం చేసేందుకు ఎవ్వరికైనా రైతులే దొరుకుతున్నారని వాపోతున్నారు.

నేటి నుంచి పాలమూరులో రైతుల పండుగ

- ఏర్పాటను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్
- మూడ్రోజులపాటు నిర్వహణ
- 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడ్రోజులపాటు రైతుల పండుగ సంబురాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 28 నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని గురువారం వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. చివరి రోజు 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జి.మధు సూదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే లక్ష్యంగా ఇప్పటికే వరంగల్ జిల్లాలో ఇందిరా మహిళాశక్తి సంబురాలు నిర్వహించా మని తెలిపారు. గురువారం రైతు పండుగ సంబరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభిస్తారని చెప్పారు. వ్యవసాయ రంగంలో చేపడుతున్న విధానాలపై 150 స్టాల్స్ ఏర్పాటు చేశామ న్నారు. వచ్చిన రైతులందరికీ భోజన ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఈ రైతు సంబరాలలో రైతు భరోసా, మిగిలి ఉన్న రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని తెలిపారు.



కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రారంభమై సంవత్సరం పూర్తి కావస్తున్న దృష్ట్యా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మహ బూబ్‌నగర్ జిల్లాలో "రైతు పండుగ"ను మూడ్రోజులపాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో వస్తున్న ఆవిష్కరణలు, యాంత్రీకరణ, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు తదితరాంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహిస్తామని, వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు, వివిధ కంపెనీలు, రైతు సంస్థలు, రైత మేధావులు, ప్రొఫెసర్లు, ఆదర్శ రైతులు హాజరై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ జానకి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, స్థానిక ఆర్డీఓ నవీన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ అమిస్తాపూర్, నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద "రైతుపండుగ" కోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను, భూత్పూర్ వద్ద పార్కింగ్, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఇథనాల్ పరిశ్రమకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క హామీ మేరకు దీక్షలు విరమించినట్టు రైతులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉన్నతాధికారులు రైతులతో చెప్పడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలమంతా సంబురాల్లో మునిగిపోయింది. సుదీర్ఘంగా సాగించిన రైతుల పోరాటం విజయం సాధించింది. అయితే, ఈ ఫ్యాక్టరీ గత ప్రభుత్వంలోని మంజీ మంత్రి కుటుంబ సభ్యులకు సంబంధించినదని తెలిసింది.

ఏడాది కాలంగా పోరాటం..!

దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు గుండంపల్లి తదితర గ్రామాల మధ్య 42 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమను నిర్మిస్తున్నారు. ఈ పరిశ్రమతో చుట్టుపక్కల పంట పొలాలు పనికిరాకుండా పోతాయని.. భవిష్యత్‌లో వాటిలోకి వెళ్లలేని పరిస్థితి ఉంటుందని రైతులు తొలి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తు వస్తున్నారు. ఇది వరకే మహబూబ్‌నగర్ జిల్లా చిత్తనూరులోని ఇథనాల్ పరిశ్రమను, అక్కడి పంట పొలాలను పరిశీలించి వచ్చారు. పొలాలు కలుషితం కావడం గమనించిన రైతులు తమ వద్ద ఇథనాల్ పరిశ్రమ వద్దేవద్దని నినదించారు. ఏడాది కాలం నుంచి పోరాడుతున్నారు. తొలుత దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టగా.. కొన్ని రోజులకు మండలంలోని అన్ని గ్రామాల వారు వీరికి తోడయ్యారు. పరిశ్రమను తరలించే వరకు ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తున్న రైతులు 129 రోజులపాటు రిలే నిరాహార దీక్షలకు దిగారు. కొన్ని రోజుల నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. గ్రామాల నుంచి రైతులంతా రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో కొందరు రైతులపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిని ఎత్తివేయాలని మళ్లీ రైతులు పోలీసు స్టేషన్ ఎదుట పురుగు మందు డబ్బాలు చేతపట్టుకొని నిరసన తెలపడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. చివరకు ప్రభుత్వం దిగొచ్చి ఈ పరిశ్రమను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

కలెక్టర్ చర్చలు సఫలం

బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల రైతులతో చర్చలు జరిపారు. పరిశ్రమ పనులను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఈ పరిశ్రమను రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టు రైతులతో చెప్పడంతో దీక్షలు విరమించేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా రైతులపై నమోదైన కేసులను కూడా ఎత్తేయాలని కోరగా.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీనిచ్చారు. అనంతరం ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి విషయం చెప్పడంతో ఆయా గ్రామాల్లో సంబురాలు మిన్నంటాయి.

సోషలిజం కోసం యువత ఆలోచించాలి

- భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

షాహిద్ భగత్ సింగ్ కలలుగన్న సోషలిజం కోసం యువత, విద్యార్థి లోకం ఆలోచించాలని భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లో రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి వచ్చారు. గాంధీనగర్, జగద్గిరిగుట్ట, మక్దుమ్ నగర్, భగత్ సింగ్ మార్గ్ ప్రాంతాల్లో ఉన్న భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గాజుల రామారంలోని విన్ పాలస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. భగత్ సింగ్ చిన్నతనంలోనే సొంతంగా చదివి ఆలోచించే గుణం కలిగి ఉండేవరని, అందుకే సమాజంలో జరిగిన అన్ని అన్యాయాలనూ ప్రశ్నిస్తూ వాటికి శాస్త్రీయమైన సమాధానాలు రాబట్టేవారని తెలిపారు. మత, కుల, లింగం లాంటివి మనుషులను విభజిస్తున్నాయని, అలాంటి విభజన ఉండొద్దంటే ఈ దేశంలో అందరూ సమానులే అనే భావన తీసుకురావాలని 17 సంవత్సరాల వయసులోనే నౌజవాన్ సభ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రజలు కులం, మతం అనే అభిప్రాయాల నుంచి దూరంగా ఉండాలని, శాస్త్రీయమైన విద్యను అభ్యసించాలని కోరుకున్నారని చెప్పారు. ఈ దేశ సంపద కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అందరికీ చెందాలని, దాన్ని కేవలం సోషలిస్టు వ్యవస్థతోనే సాధించొచ్చని అన్నారు. భగత్ సింగ్ విప్లవకారుడిగా మారడానికి కారణం చదువని, ఆ విజ్ఞానాన్ని ఆచరణలో చూపాడు కాబట్టే ఆయన ఇంతమందికి నేటికీ స్ఫూర్తిగా, చైతన్యం అందిస్తూనే ఉన్నారన్నారు. విద్యార్థులు భగత్ సింగ్ గురించి చదవాలని, మాట్లాడాలని సూచిం చారు. నేడు భగత్‌సింగ్ బతికుంటే మత రాజకీయాల ను వ్యతిరేకించేవారన్నారు. గాంధీనగర్‌లో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఆయనకు ఘనస్వాగతం పలకగా.. జగద్గిరిగుట్ట, భగత్ సింగ్ మార్గ్‌లో సీపీఐ నాయకులు, విన్ పాలస్ ఫంక్షన్ హాల్లో నేతాజీ విద్యార్థులు వేదిక పైకి ఆహ్వానించారు.

సంఘమిత్ర, పటేల్, ఫ్రీడమ్, నాగార్జున, సాధన, బాపూజీ పాఠశాల విద్యార్థులు దేశభక్తి గేయాలపై నృత్యాలు చేశారు. వారికి బహుమతులు అందజేశారు. ప్రజానాట్య మం డలి అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, భాస్కర్ బృందం, వెంకటా చారి బృందం దేశభక్తి పాటలు పాడి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. కార్యక్రమ నిర్వాహకులు అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, వెంకటేష్ నాయకత్వం వహించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఈ.ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కిషన్, జనవిజ్ఞాన వేదిక నాయకులు రావుల వరప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు కె.ఏసురత్నం, మహిళా సమాఖ్య నాయకురాలు హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద

- దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్న వైనం
- పంటల ధ్వంసం.. బెంబేలెత్తుతున్న జనం



నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లాలో కోతుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడి చేస్తున్నాయి.. ఏ పంటా చేతికొచ్చే పరిస్థితి లేదు. పెద్దవూర మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కోతులు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తూ హడలెత్తి స్తున్నాయి. నాయినవానికుంట, పర్వేదుల, చలకుర్తి, బోనూతల, కుంకుడు చెట్టుతండా, నీమా నాయక్‌తండా, బెట్టేలతండా, కోమటి కుంటతండా, చలకుర్తి, ఉట్లపల్లి గ్రామాల్లో ప్రజలు కోతులు భయంతో వణికిపోతున్నారు. పిల్లలపై, వృద్ధులపై దాడి చేస్తూ గాయపరుస్తు న్నాయి. కోతుల దాడిలో గాయపడిన వారు టీకాలు తీసుకోవడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో కిరాణ సామాన్లు ఉప్పు, పప్పు కొనుక్కోవడానికి వెళ్లాలన్నా భయపడుతూ వెళు న్నారు. అంతేకాకుండా పంటలను ధ్వంసం చేస్తుండటం వల్ల వేరుశనగ, పెసలు, కందులు, మొక్కజొన్న, జొన్న, బొబ్బర్లు, కూరగాయల తోటలు వేయడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి పైరు పొట్టదశకు రాగానే కోతులు పొట్టలను కొరికేస్తున్నాయి. పంటలను రక్షించుకు నేందుకు ప్రయత్నం చేస్తున్న రైతులపైనా కోతులు దాడులు చేస్తున్నాయి. చివరికి ఇండ్లల్లో చొరబడి అన్నం, కూరలు తింటున్నాయని, వెళ్లగొట్టబోతే దాడి చేస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. కోతుల నుంచి పంటలను, తమను కాపాడాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేరపూరిత కుట్ర లేదు

న్యూఢిల్లీ: ఎన్డీటీవీ మాజీ డైరెక్టర్లు ప్రణయ్ రాయ్, రాధిక రాయ్‌లకు ఊరట లభించింది. వారిపై ఉన్న అవినీతి, ఫ్రాడ్ కేసును సీబీఐ మూసేసింది. ముందుగా ఊహించినట్టుగానే 2017 నాటి కేసులో అన్ని అభియోగాల నుంచి వారికి క్లీన్‌చిట్ ఇచ్చింది. ఐసీఐసీఐ బ్యాంకు అందించిన రూ.375 కోట్ల రుణం విషయంలో అవినీతి, కుట్ర, అవకతవకలున్నాయం టూ వారిపై ఉన్న ఆరోపణలను సీబీఐ క్లోజ్ చేసింది. సీబీఐ నివేదికను ఒక వార్త సంస్థ సంపాదించింది.

సీబీఐ నివేదిక సమాచారం ప్రకారం.. ఐసీఐసీఐ బ్యాంకుకు ఉద్దేశపూర్వకంగా రూ.48 కోట్లకుపైగా నష్టానికి కారకులయ్యారని 2017లో ప్రణయ్‌రాయ్, రాధికారాయ్‌లపై కేసు నమోదైంది. అయితే, ఈ కేసులో ఎలాంటి నేరపూరిత కుట్ర కానీ,ఏ ప్రభుత్వాధికారి లేదా ఐసీసీఐ బ్యాంకు ఆఫీసర్లు అధికారాన్ని దుర్వినియోగపర్చినట్టు కానీ లేదని సీబీఐ తన ముగింపు నివేదికలో పేర్కొన్నది. ఈనెల 12న రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి శైలేంద్ర మాలిక్ తన ఉత్తర్వులో దీనిని వివరించారు.

ప్రణయ్‌రాయ్, రాధికలు ఆర్ఆర్‌పీఆర్ హెూల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్‌తో కలిసి కొందరు ఐసీఐసీఐ బ్యాంకు అధికారులతో నేరపూరిత కుట్రలో ప్రవేశించారనీ, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949లోని సెక్షన్ 19(2)ను ఉల్లంఘించారని 2008-09లో సీబీఐ ఆరోపించింది. ఏ కంపెనీ లోనైనా బ్యాంకింగ్ కంపెనీ షేర్లను కలిగి ఉండకూ డదని ఈ సెక్షన్ వివరిస్తుంది. అయితే, అడ్వాన్స్ లోన్ కింద ఐసీఐసీఐ బ్యాంకు రూ.375 కోట్లను అందించిందనీ, ఎన్డీటీవీలో అప్పటి ప్రమోటర్ల మొత్తం షేర్‌హెూల్డింగ్‌ను తాకట్టుగా తీసుకున్నదని సీబీఐ ఆరోపించింది. రుణంపై వడ్డీ రేటును 19 శాతం నుంచి 9.5 శాతానికి తగ్గించిందనీ, దానితో బ్యాంకుకు రూ.48 కోట్ల నష్టమని పేర్కొన్నది.

అయితే, సీబీఐ తన ముగింపు నివేదికలో దీనిపై ఒక స్పష్టతకు వచ్చింది. ఇందులో ఎలాంటి అవకత వకలు, కుట్ర, అవినీతి, అధికార దుర్వినియోగం లేవనీ, అవన్నీ సాధారణ వ్యాపార లావాదేవీలేనని గుర్తించింది. వడ్డీ రేటు తగ్గింపు ఈ ఒక్క విషయంలో జరగలేదనీ, 2007 నుంచి 2010 మధ్య 83 లోన్లలోనూ జరిగిందని సీబీఐ పేర్కొన్నది. అలాగే, ఆర్ఆర్‌పీఆర్ ప్రయివేటు లిమిటెడ్‌కు రూ.375 కోట్ల రుణం మంజూరు అయిన విషయం పైనా సీబీఐ తన నివేదికలో స్పష్టతకు వచ్చింది.

బిబి రేటింగ్ కలిగి ఉన్న ఇతర కంపెనీలకు కూడా ఐసీఐసీఐ బ్యాంకు అలాంటి రుణాలను అందించిందని పేర్కొన్నది. 2008-09, 2009-10 ఆర్థిక సంవత్సరంలో బిబి, తక్కువ రేటింగ్ ఉన్న రుణ గ్రహీతలకు ఐసీఐసీఐ బ్యాంకు రూ.8400 కోట్ల లోన్లను అందించిందని సీబీఐ తన ముగింపు నివేదికలో పేర్కొన్నది. లోన్ విషయంలో బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలోని సెక్షన్ 19(2) ఉల్లంఘన జరగలేదని వివరించింది.

బీఆర్ఎస్ గురుకుల బాట

- 30 నుంచి 7వ తేదీ వరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ
- గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులపై అధ్యయనం: కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి 7వ తేదీ వరకు గురుకుల బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామనీ, ఈ కమిటీ సహ సభ్యులుగా డాక్టర్ ఆంజనేయులు గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారామ్ యాదవ్, వాసుదేవ రెడ్డి ఉంటారని చెప్పారు. ఆ కమిటీ గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో పరిస్థితులను అధ్యయనం చేసి నివేదికను పార్టీకి సమర్పిస్తుందని తెలిపారు. అక్కడి స్థితిగతులు, సౌకర్యాలను, పరిస్థితులను తెలుసుకోనుంది. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఎదుర్కొంటోన్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తుందని తెలిపారు.

విద్యార్థుల మరణాలను నివారించటం విఫలమవటం, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించలేకపోతున్న దానిపై ప్రభుత్వమే ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అదే విధంగా కమిటీ నివేదికలో ప్రస్తావించే అంశాలను తాము శాసనసభలో లేవనెత్తుతామని కేటీఆర్ తెలిపారు. 11 నెలల్లో 48 మంది విద్యార్థుల మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్నా సమీక్షించే తీరిక లేకుండా సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీకి తిరగడానికే సరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల బాట కార్యక్రమానికి ఎంఎల్ఏ, ఎమ్మెల్సీ, ఎంపీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, విద్యార్థి విభాగం నాయకులకు సహకారం అందించాలని కేటీఆర్ సూచించారు. బాలికల విద్యాసంస్థల్లో పార్టీ తరపున విద్యార్థి విభాగం మహిళా నాయకులు, పార్టీ మహిళా నాయకులు సందర్శిస్తారని కేటీఆర్ తెలిపారు. జడ్పీ చైర్మెన్లు ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మహిళా సీనియర్ నాయకులు బాలికల సమస్యలను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని చెప్పారు. ఏడాదిలో 48 మంది విద్యార్థులు మరణిస్తే, విద్యా సంస్థల్లో ఉన్న దుర్భరమైన పరిస్థితులను తట్టుకోలేక 23 మంది ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఎనిమిది మంది అనుమానస్పదంగా మరణించారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురు విషాహారం తిని, మరో 13 మంది అనారోగ్యంతో చనిపోయారన తెలిపారు. 38 సార్లు ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగితే 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలు కాగా నలుగురు మరణించారని చెప్పారు. విద్యార్థినీ శైలజ మరణం మరవక ముందే మహబూబ్‌నగర్ జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగడం ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో చెబుతున్నదని విమర్శించారు. పాలనానుభవం లేని సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద పెట్టుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. 28 సార్లు ఢిల్లీకి వెళ్లేందుకు సమయమున్న రేవంత్ రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చనిపోతున్నా సమీక్షించేందుకు ఒక్కసారి సమయం దొరకలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల కు నాణ్యమైన ఆహారం, వారి బాగోగులు చూసుకోవడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరితే బీఆర్ఎస్వీ నాయకుల ను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని చెప్పారు. రేవంత్ సర్కార్ గురుకుల, పాఠశాల విద్యను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రలో భాగంగా రేవంత్ రెడ్డి ఇంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మొదటి సంఘటన జరి గినప్పుడే ఈ సీఎం స్పందించి ఉంటే విద్యార్థుల మరణాలు జరిగి ఉండేవి కావని అభిప్రాయం వ్యక్తం చేశారు.

చల్లటి వాతావరణంలో వేడి వేడిగా ఏదైనా తాగాలనిపిస్తుంది. అందుకు సూప్‌లు బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. ఇవి శరీరంలో వెచ్చదనాన్ని పెంచుతాయి. చలి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అలాగే పోషకాలు ఉండే వాటితో సూప్ చేసుకుంటే ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. రెస్టారెంట్ స్టయిల్‌లో చేసుకునే కొన్ని రకాల సూప్‌లు నేటి మానవిలో...

చల్లటి వాతావరణంలో వేడివేడిగా..



క్యారెట్, అల్లం సూప్

కావలసిన పదార్థాలు : క్యారెట్ - 400 గ్రాములు (కడిగి సన్నగా తరగాలి), ఓ ఇంచు అల్లం (చిన్న ముక్కలుగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు - ఆరు, బిర్యానీ ఆకు - ఒకటి, మిరియాలు - ఒక స్పూను. ఉల్లిపాయ - ఒకటి, నూనె - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా. నీరు - ఒక లీటరు.

తయారీ విధానం : ముందుగా స్టవ్‌పై ఓ ప్యాన్ పెట్టుకొని నూనె పోయాలి. నూనె వేడెక్కాక బిర్యానీ ఆకు, వెల్లుల్లి, మిరియాలు, అల్లం ముక్కలు వేసి సుమారు రెండు నిమిషాల పాటు వేగనివ్వాలి. దాంట్లో తరిగిన క్యారెట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. కొద్దిగా వేగాక అర లీటర్ వరకు నీరు పోయాలి. క్యారెట్, ఉల్లిపాయ ముక్కలు మెత్తగా అయ్యే వరకు మీడియం మంటపై మూతపెట్టి ఉడికించుకోవాలి. మధ్యమధ్యలో కలుపుతుండాలి.

క్యారెట్ ముక్కలు పూర్తిగా ఉడికాక.. ఆ మిశ్రమాన్నంతా మిక్సీ జార్‌లో వేసుకోవాలి.



దీన్ని మెత్తగా ప్యూరీలా గ్రైండ్ చేసుకుని వడగట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని మళ్లీ ఓ ప్యాన్‌లో మరికొద్ది నీళ్ల పోసుకొని స్టవ్‌పై బాగా మరిగించాలి. రుచికి సరిపడా ఉప్పు వేసుకోవాలి. సూప్ బాగా మరిగాక స్టవ్ ఆఫ్ చేసుకోవటమే. అంతే క్యారెట్ అల్లం సూప్ రెడీ అవుతుంది. కాస్త తియ్యగా, ఘాటుగా ఈ సూప్ అదిరిపోతుంది. అయితే, ఘాటు తక్కువగా ఉండాలనుకునే వారు అల్లం, మిరియాలు కాస్త తక్కువ వేసుకోవచ్చు. వేడివేడిగా ఈ సూప్ తాగితే అద్భుతంగా ఉంటుంది.

శరీరంలో రోగ నిరోధక శక్తి మెరుగుపరుస్తుంది. క్యారెట్, అల్లంలో యాంటీఆక్సిడెంట్లతో పాటు ముఖ్యమైన విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. దీనివల్ల శరీరంలో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

టమాట సూప్

కావలసిన పదార్థాలు : వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, టమాటాలు-అర కేజీ, బటర్ - రెండు స్పూన్లు, ఉల్లిపాయ తరుగు - రెండు స్పూన్లు, బిర్యానీ ఆకు - ఒకటి, మిరియాలు-అర స్పూన్, క్యారెట్ ముక్కలు- పావు కప్పు, బీట్ రూట్ - ఒకటి (చిన్నది), ఉప్పు-రుచికి సరిపడా, షుగర్ -ఒక స్పూను, మిరియాల పొడి-పావు చెంచా, మిల్క్ బ్రెడ్ - రెండు. నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ విధానం : ముందుగా స్టవ్‌పై పాన్ పెట్టి బటర్ వేసుకోవాలి. బటర్ కరిగిన తర్వాత కచ్చాపచ్చాగా చేసిన వెల్లుల్లి రెబ్బలు, బిర్యానీ ఆకు, మిరియాలు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఫ్రై చేయాలి. ఉల్లిపాయలు వేగిన తర్వాత క్యారెట్ ముక్కలు వేసి మగ్గించాలి. రెండు నిమిషాల తర్వాత బీట్‌రూట్ ముక్కలు వేసి బాగా కలపాలి. (సూప్‌లో ఆర్టిఫిషియల్ కలర్స్ వాడకుండా మంచి రంగు రావడానికి కొన్ని బీట్ రూట్ ముక్కలు వేసుకోవాలి)

కొద్దిసేపటి తర్వాత టమాటా ముక్కలు వేసుకుని బాగా కలుపుకోవాలి. (టమాటాలు బాగా పండినవి అయితే, సూప్ రుచిగా ఉంటుంది) ఇప్పుడు ఇందులో ఉప్పు, కొద్దిగా చక్కెర వేసి కలుపుకోవాలి. తర్వాత 2 గ్లాసుల నీళ్ల పోసి మూతపెట్టి, టమాటాలు మెత్తగా ఉడికించుకోవాలి. టమాటాలు ఉడికిన తర్వాత స్టౌ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీ గిన్నెలో వేసి గ్రైండ్ చేసుకోవాలి.




(వేడి మీద వేస్తే మిక్సీ లోంచి చిందిపోతుంది) ఇప్పుడు టమాటా ప్యూరీ మిశ్రమాన్ని వడగట్టుకోవాలి. అందులో రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసి కలుపుకోవాలి. స్టౌ మీడియం ఫ్లేమ్‌లో పెట్టి వడగట్టిన మిశ్రమానికి మరికొద్దిగా నీళ్లపోసి ఒక పొంగు వచ్చేంత వరకు ఉడికించుకోవాలి. తర్వాత మిల్క్ బ్రెడ్ చిన్నగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసి బ్రెడ్ స్లైసెస్ వేసుకోవాలి. అవి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకూ ఫ్రై చేసుకుని సూప్‌లో వేసుకోవాలి. ఇలా చేసుకుంటే రెస్టారెంట్ స్టైయిల్‌లో టమాటా సూప్ రెడీ.

చికెన్ సూప్

కావలసిన పదార్థాలు : చికెన్ - 250 గ్రాములు (బోన్ లెస్), ఉల్లిపాయ - 1, వెల్లుల్లి రెబ్బలు - 3, నిమ్మకాయ - సగం, కొత్తిమీర - ఒక కట్ట, బిర్యానీ ఆకులు - 2, లవంగాలు - 4, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - చిటికెడు, మొక్కజొన్న - అర కప్పు, క్యారెట్ - ఒకటి, క్యాప్సికమ్ - ఒకటి, స్ప్రింగ్ ఆనియన్ - ఒకటి, కార్న్ పౌడర్ - ఒక స్పూను.

తయారీ విధానం : ముందుగా ఉల్లిపాయను సన్నగా తరుగుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో నీళ్ల వేసి..బోన్ లెస్ చికెన్, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. దానిలోనే వెల్లుల్లి



రెబ్బలు, నిమ్మబద్ద, బిర్యానీ ఆకులు, కొత్తిమీరు, ఉప్పు, మిరియాల పొడి వేసుకోవాలి. ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిని మరగనివ్వాలి. బాగా ఉడికిన తర్వాత స్టౌవ్ ఆపేయాలి. ఉడికిన చికెన్ ముక్కలను వేరుచేసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. మిగిలిన ముక్కలను కూడా ఒక గిన్నెలోకి తీసుకొని బాగా స్మాష్ చేసుకొని అదే నీటిలో కలుపుకోవాలి. ఇపుడు కట్ చేసుకున్న చికెన్ ముక్కలు, మొక్కజొన్న గింజలు వేసుకోవాలి. కొత్తిమీర తురుము, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకున్న క్యాప్సికప్‌ను వేసి మరోసారి ఉడికించుకోవాలి. ఇప్పుడు ఒక స్పూను కార్న్ పౌడర్‌ను నీళ్ల వేసి కలిపి.. దానిని సూప్‌లో వేసి బాగా కలపాలి. ఈ కార్న్ పొడి వేయడం వల్ల సూప్ చిక్కబడుతుంది.

దానిలో స్ప్రింగ్ ఆనియన్స్ ముక్కలు వేసుకోవాలి. అలాగే బటర్ కూడా వేసుకోవాలి. మూతపెట్టి మరో రెండు నిమిషాలు ఉడికించుకుంటే వేడి వేడి చికెన్ సూప్ రెడీ.

జొన్న, గుమ్మడి సూప్

కావలసిన పదార్థాలు : జొన్నపిండి - మూడు స్పూన్లు, గుమ్మడి ముక్కలు - 350 నుంచి 400 గ్రాములు, ఉల్లిపాయ - ఒకటి, పుదీనా ఆకులు - అరకప్పు, ఉప్పు- రుచికి సరిపడా, మిరియాల పొడి - అర స్పూను, నెయ్యి - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, జీలకర్ర - అర స్పూను, వాము - కొద్దిగా, వెల్లుల్లి రెబ్బలు



- నాలుగు, నిమ్మకాయ - ఒకటి. కొత్తిమీర తరుగు - కొద్దిగా,

తయారీ విధానం : ఇందుకోసం ముందుగా స్టౌపై కడాయి పెట్టుకొని జొన్నపిండిని లో ఫ్లేమ్ మీద మంచి సువాసన వచ్చేంత వరకు వేయించుకొని పక్కనుంచుకోవాలి. ఇప్పుడు స్టౌ మీద మరో పాన్ పెట్టుకొని 750 - 800ఎంఎల్ వాటర్ పోసుకొని మరిగించుకోవాలి. నీళ్ల వేడెక్కి మరుగుతున్నప్పుడు అందులో మీడియం సైజ్‌లో కట్ చేసుకున్న తీపి గుమ్మడి ముక్కలు, కాస్త పెద్దగా తురుముకున్న ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తగా ఉడికించుకోవాలి.

ఆ విధంగా ఉడికించుకున్నాక పుదీనా ఆకులు వేసి కలిపి మరో మూడు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టైయినర్ సహాయంతో ఆ వాటర్‌ని ఒక బౌల్‌లోకి వడకట్టుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్ తీసుకొని అందులో స్టైయినర్‌లో ఉన్న వడకట్టుకున్న గుమ్మడి, ఉల్లి, పుదీనా ఆకుల మిశ్రమాన్ని వేసుకోవాలి. ఆపై ముందుగా వేయించుకున్న జొన్నపిండిని కూడా యాడ్ చేసుకొని గుమ్మడి ముక్కల మిశ్రమాన్ని ఉడికించుకున్న వాటర్‌ని కొద్దిగా పోసుకొని కాస్త బరకగా గ్రైండ్ చేసుకోవాలి. అనంతరం స్టౌపై కడాయి పెట్టుకొని వడకట్టుకున్న గుమ్మడి ముక్కలు ఉడికించిన వాటర్‌ని పోసుకోవాలి. ఆపై అందులో మీరు గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని కలుపుతూ కొద్దికొద్దిగా యాడ్ చేసుకోవాలి. ఆ తర్వాత మీడియం ఫ్లేమ్ మీద మిశ్రమం చిక్కగా మారేంత వరకు ఉడికించుకోవాలి. అలా ఉడికించుకునేటప్పుడే అందులో రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసుకోవాలి. సూప్ రెండు, మూడు పొంగులు రాగానే మంటను లో ఫ్లేమ్‌లోకి మార్చుకుని కొద్దిసేపు మరిగాక స్టవ్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు ఇంకో బర్నర్ మీద ఒక చిన్న కడాయి పెట్టుకొని నెయ్యి వేసుకోవాలి. అది కరిగి కాస్త వేడయ్యాక జీలకర్ర వేసి చిట్లనివ్వాలి. ఆపై వాము వేసి 5 సెకన్లు వేయించుకోవాలి. ఆ తర్వాత సన్నగా కట్ చేసుకున్న వెల్లుల్లి తరుగు వేసుకొని లైట్ గోల్డెన్ కలర్ వచ్చేంత వరకు వేపుకొని స్టౌ ఆఫ్ చేసుకోవాలి. దాన్ని సూప్‌లో పోసుకుని మిక్స్ చేసుకోవాలి. ఇక చివరగా కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లుకొని, నిమ్మరసం పిండుకొని వేడివేడిగా సర్వ్ చేసుకుంటే చాలు. ఎంతో టేస్టీగా ఉండే "జొన్న గుమ్మడికాయ సూప్" రెడీ!

డస్ట్ అలర్జీ వేధిస్తోందా?

ప్రస్తుత వాతావరణ కాలుష్యం నేపథ్యంలో డస్ట్ అలర్జీ బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న దుమ్ముకే తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్లలో దురద, కళ్లు ఎర్రబడడం, గొంతులో నొప్పి వంటి సమస్యలకు దారి తీస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలు కూడా ఎక్కువతున్నాయి.



- ఒకసారి డస్ట్ ఎలర్జీ బారిన పడ్డామంటే.. తగ్గడం అంత సులువుకాదు. కొన్ని రకాల నేచురల్ టిప్స్ ద్వారా దీనికి చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గని డస్ట్ అలర్జీని కొన్ని రకాల వంటింటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చని అంటున్నారు. ఇంతకీ ఆ నేచురల్ టిప్స్ ఏంటో చూద్దాం...
- డస్ట్ అలర్జీని చెక్ పెట్టడంలో రాక్‌సాల్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో రాక్ సాల్ట్‌ను కరిగించి ఆ నీటిని ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల ముక్కు శుభ్రపడుతుంది. గొంతు నొప్పి, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దుమ్ము బ్యాక్టీరియా నాశనం అవుతుంది.
- డస్ట్ అలర్జీ ఉన్న వారిలో అల్లం, తేనె కూడా బాగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటిలో ఉండే నేచురల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫమేటరీ లక్షణాలు డస్ట్ అలర్జీని దూరం చేస్తుంది. ఒక చెంచా తేనెలో అల్లం రసం కలిపి ప్రతీరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే డస్ట్ అలర్జీ దూరమవుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- శీతాకాలంలో డస్ట్ అలర్జీ మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలాంటి సమయంలో పసుపు, తులసి ఆకులు క్రియాశీలకంగా ఉపయోగపడతాయి. తులసి ఆకులను ఉడకబెట్టి, అందులో పసుపు వేయాలి. అనంతరం నీరు సగం అయ్యే వరకు వేడి చెయ్యాలి. గోరు వెచ్చ చేసుకొని ఈ నీటిని తాగాలి. ఇది శరీరంలోని విషాన్ని తొలగిస్తుంది.
- రాత్రి పడుకునే ముందు కొబ్బరి నూనె మసాజ్ చేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. ముక్కు, గొంతు దగ్గర కొబ్బరి నూనెను మసాజ్ చేయాలి. ఇది శ్వాస తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందుల నుంచి ఉపశనం కలిగిస్తుంది.

గ్రూపులొద్దు.. కలిసి పని చేయండి

(మొదటిపేజి తరువాయి)

తన ఛాంబర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ... తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గొడెం నగేశ్, ధర్మపురి అర్వింద్, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, రాజ్యసభ సభ్యులు డా లక్ష్మణ్, ఎమ్మెల్యేలు రాజా సింగ్, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్‌బాబు, రాం రావు పవార్, సూర్య నారాయణ, బీజేపీ ఎమ్మెల్సీ, మొత్తం 16 మంది హాజరయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో తొలుత కిషన్ రెడ్డి, డీకే అరుణ ప్రధానికి రాష్ట్ర నేతలను పరిచయం చేశారు. ఒక్కొక్కరుగా ప్రధానికి శాలువా కప్పారు.

అనంతరం వారి వారి నియోజక వర్గాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాల్సిన అభివద్ధి పనులు, కేంద్ర సాయానికి సంబంధించిన వివరాలను ప్రధానికి డీకే అరుణ అందజేశారు. ఆ ఫైల్‌ను తీసుకున్న తర్వాత... తాజా ఎన్నికల్లో తెలంగాణ లో పార్టీ అధికారంలోకి రాకపోవడానికి గల కారణాలను ఒకొక్కటిగా ప్రధాని ప్రస్తావించారు. ఈ దిశలో రాష్ట్ర నేతలు గ్రూపులుగా ఏర్పడ్డ తీరు, ఆ గ్రూపుల ద్వారా ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలను వెల్లడించారు. ఇందులో భాగంగా ఎన్నికల ముందు పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో మార్పులు చేయాల్సి వచ్చిందని చెప్పినట్లు తెలిసింది. అయినప్పటికీ... ఇంకా గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయని, ఇలాంటి తీరు సరికాదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నేతలంతా ఏం చేస్తారో తనకు తెలియదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని చెప్పారు.

మహారాష్ట్రను స్ఫూర్తిగా తీసుకోండి

సాధారణంగా తక్కువ మాట్లాడి, ఎక్కువ వినేందుకు ఇష్టపడే మోడీ... రాష్ట్ర నేతల మీటింగ్‌లో మాత్రం క్లాస్ పీకేందుకే టైం కేటాయించినట్టు తెలిసింది. దాదాపు అరగంటలో 20 నిమిషాల పాటు ముఖ్యనేతల్లో క్షీణించిన సఖ్యతను ఏకరువు పెట్టారు. తద్వారా పార్టీకి జరిగిన నష్టం, కింది స్థాయి కార్యకర్తల్లో నెలకొన్న గందరగోళం పై క్లారిటీ ఇచ్చారు. ఈ దిశలో నేత ఏ స్థాయిలో ఉన్న ఉపేక్షించే పరిస్థితి ఉండదన్నారు. బీజేపీ హైకమాండ్ కేవలం వ్యూహాలు, కావాల్సిన సపోర్ట్ మాత్రమే ఇస్తుందని... క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్టం చేసేది రాష్ట్ర నాయకులే అని తేల్చి చెప్పారు. ఆ విషయంలో తెలంగాణలో నేతల మధ్య నెలకొన్న వ్యక్తిగత విబేధాలు, దూరం పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతున్నాయని అభిప్రాయపడ్డారు. బీజేపీ హైకమాండ్ కేవలం అనుసరించాల్సిన వ్యూహాలు, కావాల్సిన సపోర్ట్ మాత్రమే ఇస్తుందని... క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్టం చేసేది రాష్ట్ర నాయకులే అని తేల్చి చెప్పారు. ఆ విషయంలో తెలంగాణలో నేతల మధ్య నెలకొన్న వ్యక్తిగత విబేధాలు, దూరం పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గ్రాండ్ విక్టరీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ విజయం వెనక కీలక నేతలతో పాటు కింది స్థాయి కార్యకర్త వరకు కలిసికట్టుగా పని చేసిన తీరును వివరించారు. అలాగే గుజరాత్ ఎన్నికల్లో, మున్సిపల్ స్థాయి ఎలక్షన్స్‌లో బీజేపీ ప్రణాళికలు, విజయాలను నేతలకు హితబోధ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

నియోజకవర్గాల వారీగా అభివద్ధి చేయాలనే విజ్ఞప్తులే కాదని... ప్రజా సమస్యలపై పోరాడాలని ప్రధాని మోడీ దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో మరింత బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. గడప గడపకు బీజేపీ పార్టీ స్టాండ్‌ను తీసుకెళ్లాలన్నారు. తెలంగాణలో బీజేపీకి ఇంకా మంచి ఆదరణ ఉందని తన సర్వే రిపోర్ట్‌లో తెలిసినట్లు వివరించారు. కుటుంబ పాలన, అహంకారం, అవినీతి అంశాలు బీఆర్ఎస్ పార్టీని ముంచేశాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ప్రజల్లో రోజు రోజుకు విశ్వాసం, నమ్మకం సన్నగిల్లుతున్నట్టు తేలిందన్నారు.

వక్ఫ్‌బిల్లుపై జేపీసీని పొడిగించండి

బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే తీర్మానం

ఇప్పటికే ప్రతిపక్షాలు డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్‌బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమయాన్ని పొడిగించాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జేపీసీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఇప్పటికే ప్రతిపక్షాలు వక్ఫ్‌బిల్లుపై జేపీసీ సమయాన్ని పెంచాలని కోరాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశాయి. ప్యానెల్ 25 సార్లు మాత్రమే సమావేశమైనందున, వాటాదారులు తమ అభిప్రాయాలను సమర్పించడానికి మరింత సమయం అవసరమని వారు వాదించారు. నవంబర్ 29 గడువులోగా ప్రక్రియను ముగించడానికి ప్రభుత్వం యోచిస్తోందని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన పార్లమెంటరీ ప్యానెల్ సమావేశంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే బడ్జెట్ సమావేశాల వరకు పొడిగించే అవకాశం ఉంది.

కాల్పుల విరమణ

జెరూసలేం : గత 14 నెలలుగా లెబనాన్‌లో సాగుతున్న మారణహోమానికి ఇజ్రాయిల్, హిజ్బుల్లా స్వస్తి చెప్పాయి. ఇరు పక్షాలు బుధవారం కాల్పుల విరమణను ప్రారంభించాయి. ఒప్పందాన్ని హిజ్బుల్లా ఉల్లంఘిస్తే తిరిగి దాడి జరుపుతానని ఇజ్రాయిల్ ప్రకటించింది. దక్షిణ లెబనాన్ ప్రజలెవ్వరూ త్వరపడి స్వస్థలాలకు చేరుకోవద్దని, సైన్యం ఇప్పటికీ అక్కడ మోహరించి ఉన్నదని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. ఒప్పందం ప్రకారం తొలుత రెండు నెలల పాటు ఇరు పక్షాలు కాల్పుల విరమణ పాటిస్తాయి. దక్షిణ లెబనాన్ నుండి హిజ్బులా మిలిటెంట్లు వైదొలుగుతారు. అలాగే ఇజ్రాయిల్ దళాలు కూడా తమ సరిహద్దుకు చేరుకుంటాయి. వేలాది అదనపు లెబనాన్ దళాలు, ఐరాస శాంతి పరిరక్షక దళాలు దక్షిణ ప్రాంతంలో మోహరిస్తాయి. అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఒప్పందం అమలును పర్యవేక్షిస్తుంది. కాల్పుల విరమణ బుధవారం ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమైంది. ఇజ్రాయిల్ దళాలు మంగళవారం బీరూట్‌లో పెద్ద ఎత్తున వైమానిక దాడులు జరిపాయి. ఘర్షణ ప్రారంభమైన తర్వాత భారీ స్థాయిలో దాడులు జరగడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య యుద్ధం తీవ్రమవుతుందన్న సంకేతాలు వెలువడ్డాయి. వైమానిక దాడుల్లో 42 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. కాగా గాజాలో జరుగుతున్న భీకర పోరు ప్రస్తావన మాత్రం కాల్పుల విరమణ ఒప్పందంలో లేదు. ఇప్పటికీ హమాస్ చేతిలో కొన్ని డజన్ల మంది బందీలుగా ఉన్నారు. ఘర్షణ రోజురోజుకూ తీవ్ర రూపు దాలుస్తోంది. ఒప్పందాన్ని హిజ్బులా ఉల్లంఘిస్తే దానిపై దాడి చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఉంటుందా అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఒప్పందంలో ఈ అంశాన్ని కూడా చేర్చాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ పట్టుబట్టారు. అయితే లెబనాన్, హిజ్బుల్లా అందుకు అంగీకరించలేదు. అమెరికా, ఫ్రాన్స్ నేతృత్వంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయిల్ భద్రతా క్యాబినెట్ అంతకుముందు ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిస్తూ 'ఇది మంచి వార్త' అని వ్యాఖ్యానించారు. గాజాలో కూడా కాల్పుల విరమణకు తన ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.

కాల్పుల విరమణ ఒప్పందంపై నెతన్యాహూ టీవీలో ప్రసంగిస్తూ 'ఈ ఒప్పందం గాజాలో హమాస్‌ను ఏకాకిని చేస్తుంది. ప్రధాన శత్రువు అయిన ఇరాన్‌పై దృష్టి సారించేందుకు ఇజ్రాయిల్‌కు అవకాశం ఇస్తుంది. ఒకవేళ హిజ్బుల్లా ఒప్పందాన్ని ఉల్లంఘించి కయ్యానికి కాలు దువ్వితే మేమూ దాడి చేస్తాం. ప్రతి ఉల్లంఘనకూ మా దాడి సమాధానమిస్తుంది' అని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై లెబనాన్ ఆపద్ధర్మ ప్రధాని నజీబ్ మికాతీ హర్షం వ్యక్తం చేశారు. స్థిరత్వాన్ని సాధించడంలో ఇది కీలక అడుగు అవుతుందని, నిరాశ్రయులైన ప్రజలు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటారని ఆయన అన్నారు.

శాంతి, సుస్థిరతకు అవకాశం : భారత్

ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందంపై భారత్ హర్షం వ్యక్తం చేసింది. ఉద్రిక్తతలు సడలాలని, ఇరు పక్షాలు సంయమనం పాటించాలని, చర్చలు, దౌత్యాన్ని ప్రారంభించాలని తాము మొదటి నుండీ కోరుతూనే ఉన్నామని గుర్తు చేసింది. తాజా పరిణామాలు శాంతికి, సుస్థిరతకు దారితీస్తాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీకి డౌన్ ట్రెండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఒకవైపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతుంటే, బీజేపీకి మాత్రం డౌన్ ట్రెండ్ మొదలైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను కసరత్తు చేస్తున్నదని చెప్పారు. కచ్చితంగా రైతు భరోసా ఇస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. గత కొద్ది రోజులుగా ప్రభుత్వం గురించి కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో, ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో జరుగుతున్న ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. కాంగ్రెస్ మంత్రులంతా పనిమంతులేననీ, చాలా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, ప్రగతిశీల భావాలే లక్ష్యంగా ముందుకు పోతున్నదని చెప్పారు. ఇటీవల కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచారని వివరించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ మంత్రిని కాంగ్రెస్ అభ్యర్థి ఓడించారని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని పట్టుకుని కేటీఆర్ ఇష్టమెచ్చి మాట్లాడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఏం తప్పు చేసిందని విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో భావ స్వేచ్ఛ, అందరికీ స్వతంత్రాన్ని ఇచ్చి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించారని గుర్తు చేశారు. ఎంతమందికి భూ పంపిణీ చేశారని ప్రశ్నించారు. ఎన్నో వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేదని విమర్శించారు.

పదేండ్లపాటు మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కు కనీస సంస్కారం కూడా లేదని విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను సన్యాసి అంటే ఎలా? అని ప్రశ్నించారు. అందుకే ఆయన మైండ్ సెట్ సరిగా లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటి తర్వాత ఒకటి నెరవేర్చుకుంటూ ముందుకు పోతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించి వారి పక్షాన ప్రభుత్వం ప్రతినెలా రూ. 400 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తుందని గుర్తు చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తూ వారి పక్షాన ప్రభుత్వం నెలకు రూ. 150 కోట్లు చెల్లిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు త్వరలోనే భూమి పూజ చేస్తామని తెలిపారు. గత పదేండ్లపాటు రేషన్ కార్డులు లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. వాటిని ప్రక్షాళన చేసి తాము కార్డులు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని నాలుగు సార్లు చేయడం వల్ల అది వడ్డీకే సరిపోయిందన్నారు. ఇక రెండో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అరకొరగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థను సృష్టించారని ఆరోపించారు. దీంతోపాటు రాష్ట్రంపై అప్పుల భారాన్ని మోపారని చెప్పారు. స్వేచ్ఛగా బతికిన తెలంగాణను బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులాలను విడగొడుతున్నారంటూ తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. తాము కులాలను సృష్టించడం లేదనీ, అవి శతాబ్దాలుగా ఈ సమాజంలో ఉన్నాయని గుర్తు చేశారు. 'రాష్ట్రంలో వివిధ కులాల వారు ఎంతమంది? రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం అందరూ సమానంగా ఎదిగారా? లేదా? అనేది తాము సర్వేలో తెలుసుకుంటాం. ఇంతకాలం రాష్ట్రాన్ని దోపిడీ చేసిన బ్యాచ్ మళ్లీ దోపిడీ చేయాలని చూస్తుంది. అందరి లెక్కలు చెప్పి వాస్తవాలు బయటకు తీస్తే వాళ్లకు ఇబ్బంది' అని హెచ్చరించారు. ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. పరిశుభ్ర వాతావరణం, నాణ్యతతో కూడిన భోజనం అందుతుందా? లేదా? పర్యవేక్షించాలని సీఎం ఆదేశించినట్టు వివరించారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించేందుకు 40 శాతం మెస్ చార్జీలు పెంచినట్టు తెలిపారు. జార్ఖండ్ ఫలితాలు ప్రజల విజయమని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సోరేన్ సమిష్టి కషి ఫలితమేనన్నారు. హైదరాబాద్ అభివద్ధికి పదివేల కోట్లు కేటాయించామని త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలుంటాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పంచిన 26 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ధరణి వచ్చిన తర్వాత వాటి పరిస్థితి ఏంటో లెక్కలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వాటిని తిరిగి అర్హులైన పేదలకు పంచుతామని చెప్పారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పాత్ర నిర్మాణాత్మకంగా ఉండాలని సూచించారు. విచ్ఛిన్నకర ధోరణులను వీడాలని కోరారు.

వామ్మో..దొంగ నోట్లు

(మొదటిపేజి తరువాయి)

తీయడంలో పూర్తిగా విఫలమైన బీజేపీ సర్కార్.. కనీసం దేశంలో నకిలీ నోట్లను అరికట్టలేకపోయింది. మూడేండ్లలో దొంగనోట్లు మూడు రెట్లు పెరిగిపోయాయి. 2018-19 నుంచి 2022-23 వరకు నకిలీ రూ.500 నోట్లు 317 శాతం పెరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2018-19లో రూ.500 విలువ కలిగిన మొత్తం 2186.5 కోట్ల నకిలీ నోట్లను గుర్తించినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. దీంతో పోల్చితే 2022-23లో ఏకంగా 9,111 కోట్ల దొంగ నోట్లు బయటపడ్డాయన్నారు. వీటిలో 316.6 శాతం పెరుగుదల చోటు చేసుకున్నట్లయ్యిందన్నారు. 2023-24లో రూ.500 నకిలీ నోట్ల సంఖ్య 85,711గా నమోదయ్యిందన్నారు. ఎంపీ టిఎం సెల్వగణపతి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పంకజ్ చౌదరీ వివరణ ఇచ్చారు. 2018-19లో 2,184 కోట్ల రూ.2వేల నకిలి నోట్లు గుర్తించబడ్డాయి. ఇవి 2022-23లో 980 కోట్లుగా చోటు చేసుకున్నాయి. 2023-24లో 2,603.5 కోట్లకు పెరగడం ఆందోళనకరం. ఆర్‌బీఐ గణంకాల ప్రకారం.. 2024 మార్చి ముగింపు నాటికి మొత్తం కరెన్సీలో రూ.500 నోట్ల వాటా 86.5 శాతంగా ఉంది. గతేడాది ఇదే సమయం కల్లా 77.1 శాతంగా ఉంది. గతేడాది మేలో రూ.2వేల నోట్లను ఉపసంహరించుకోవడం ద్వారా రూ.500 నోట్లు ఎక్కువగా చెలామణిలోకి వచ్చాయి. 2024 అక్టోబర్ 31 నాటికి 98.04 శాతం విలువ కలిగిన రూ.2వేల నోట్లు ఆర్‌బీఐకి తిరిగి వచ్చాయి.

రూపాయి డీలా

(మొదటిపేజి తరువాయి)

వరుసగా ఈక్విటీలను తరలించుకుపోవడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు చమురు ధరలు పెరగడమూ, యూఎస్ ఫెడ్ మీటింగ్ అంశాలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. భారత స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 84.38 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84.48 కనిష్ఠ స్థాయిని తాకింది. వరుసగా రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచనుంది.

నేటి నుంచి రైతుల పండుగ

(మొదటిపేజి తరువాయి)

రూ.7,625 కోట్లు, రైతు బీమాకు రూ.1,455 కోట్లు, పంటల బీమాకు రూ. 1,300 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.10,444 కోట్లు, 2023-24 ధాన్యం కొనుగోళ్ళ కోసం రూ.10,547 కోట్లు, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ. 5,040 కోట్లు వ్యయం చేశారు. ఈ మొత్తం రూ. 54,280 కోట్లుగా ఉన్నట్టు ప్రకటించారు.

మధ్యతరగతికి ఆర్థిక సవాళ్లు

(మొదటిపేజి తరువాయి)

అత్యంత క్షీణత. ఆర్థిక వ్యవస్థలలో ఇటువంటి తిరోగమనాలు సాధారణమే అయిప్పటికీ.. మధ్యతరగతిపై వాటి ప్రభావం తీవ్రంగా ఉంది. వినియోగాన్ని భారీగా తగ్గిస్తుంది.ఆర్‌బీఐ గణంకాల ప్రకారం.. గడిచిన 50 ఏండ్లలో ఎప్పుడూ లేని విధంగా జీడీపీలో కుటుంబాల పొదుపు భారీగా పడిపోయింది. పెరుగుతున్న గృహ రుణాల భారం పరిస్థితిని మరింత దిగజార్చింది. స్థూల పొదుపులు స్థిరంగా ఉన్నప్పటికీ, అన్‌సెక్యూర్డ్ రుణాలు పెరగడం నికర పొదుపులను దెబ్బతీస్తున్నాయి. తక్కువ ఆదాయాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. మధ్యతరగతి ప్రజల వ్యయాలు తగ్గడంతో పట్టణ వినిమయం తగ్గిందని ఇటీవల నెస్లే ఇండియా ఎండీ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. మధ్యతరగతిలోని ప్రతికూల పరిస్థితుల వల్లే అమ్మకాలు పడిపోతున్నాయన్నారు. ఆహార పానీయాల రంగంలో రెండంకెల వృద్ధి రేటు ఇప్పుడు 1.5 శాతం నుంచి 2 శాతానికి పడిపోయిందని నారాయణన్ తెలిపారు. ఇదే తరహాలో హిందుస్థాన్ యూనిలీవర్ సీఈఓ రోహిత్ జావా పేర్కొన్నారు. పట్టణ మార్కెట్లలో ముఖ్యంగా పెద్ద నగరాల్లో వినిమయం తగ్గిందన్నారు. మొత్తం ఎఫ్ఎంసీజీ కొనుగోళ్లలో మూడింటిలో రెండో వంతూ మధ్యతరగతి ప్రజలదే కావడం విశేషం. వచ్చే త్రైమాసికాల్లో ఈ తిరోగమనం కొంత తగ్గొచ్చని మార్సెల్లస్ రిపోర్ట్ పేర్కొంది. అయితే సాంకేతిక అంతరాయాలు, కుటుంబాల పొదుపులో మాత్రం ఒత్తిడి ఉండొచ్చని విశ్లేషించింది.

రైతు పండుగను గొప్పగా నిర్వహించాలి

30న మహబూబ్‌నగర్‌కు తరలిరావాలి

పార్టీ నేతల జూమ్ మీటింగ్‌లో మహేష్ కుమార్ గౌడ్ పిలుపు



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరగబోయే రైతు పండుగను గొప్పగా నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పన్నేండు నెలల్లో గొప్ప కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వరంగల్, వేములవాడలో విజయోత్సవాలను నిర్వహించామని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి పార్టీ నేతలతో ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఎవరూ చేయని విధంగా రైతు ఉత్సవం పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. రైతులు, వ్యవసాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు ప్రతి గ్రామంలో రైతులను మహబూబ్‌నగర్ తరలించాలని కోరారు. అక్కడ జరిగే రైతు ఉత్సవాల్లో పెద్దలు చెప్పే కార్యక్రమాలను ప్రజలకు చేరేలా చూడాలని కోరారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీకి టీఆర్ఎస్ ప్రభుత్వం జూలై 7, 2023 అనుమతి ఇచ్చిందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్ కుమారుడు తలసాని సాయి కిరణ్ యాదవ్ డైరెక్టర్‌గా ఉన్న ఆ కంపెనీకి కేసీఆర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. ఏదో కాంగ్రెస్ ఇచ్చినట్టుగా ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ ఊరెళ్లి చర్చిద్దాం రండి అని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అక్కడ ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఇథనాల్ కంపెనీ విషయంలో పూర్వాపరాలు పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాదిపాటు అనేక వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. మహబూబ్‌నగర్‌లో భారీ ఎత్తున వ్యవసాయ ప్రదర్శన ఉందని చెప్పారు. అలాగే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహబూబ్‌నగర్ రైతు సదస్సు పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన పథకం వంట ధరల పెంపు

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం (పీఎం పోషణ్) వంట ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ఆర్యదర్శి జేబీ నాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలవాటికా, ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి వంట ధర రూ.6.19 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి వంట ధర రూ.9.29కు పెంచామని తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి చొప్పున నిధులను భరిస్తాయని వివరించారు. అంటే ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఇచ్చే వంట ధర రూ.6.19లో కేంద్రం రూ.3.71, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.48 భరించాలని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఇచ్చే వంట ధర రూ.9.29లో కేంద్రం రూ.5.57, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.72 నిధులను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ పెరుగుదల వచ్చేనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి ఉత్తర్వులను జారీ చేస్తుంది. రాష్ట్రంలో చివరి సారిగా 2020, జనవరి 28న మధ్యాహ్న భోజన పథకం వంట ధరలను ప్రభుత్వం పెంచింది. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి వంట ధర రూ.4.48, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.6.71 ఖర్చు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల వరకే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మొత్తం నిధులను భరించి మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నది.



హర్యానా స్టీలర్ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-11లో భాగంగా బుధవారం జరిగిన పోటీల్లో హర్యానా స్టీలర్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. షాహిద్ విజయ్ సింగ్ పాఠక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పుణేరి పల్టన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్యానా జట్టు 38-28 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. హర్యానా జట్టులో శివమ్(13) రైడ్స్‌లో రాణించగా.. మహ్మదేజ్(5), వినయ్(4) ట్యాకిల్స్‌లో రాణించారు. హర్యానా జట్టు రైడ్స్‌లో నిరాశపరిచినా.. ట్యాకిల్స్‌లో అద్భుతంగా రాణించింది. ఆ జట్టు రెండుసార్లు పుణేరి జట్టును ఆలౌట్ కూడా చేసింది. పుణేరి జట్టులో పంకజ్ మోహిత్(10), ఆకాశ్ షిండే(9) రైడ్స్‌లో రాణించగా.. మోహిత్, సావంత్ ట్యాకిల్స్‌లో మెరిసాడు.

ఆంధ్ర గెలుపు


సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ



హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గోవాతో బుధవారం జరిగిన గ్రూప్-ఇ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 154పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 15.4ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఆంధ్ర బౌలర్లు శశికాంత్(2/38), స్టెఫెన్(2/42) రాణించగా.. గోవా బ్యాటర్ సుయాశ్ ప్రభుదేశాయ్(71నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. ఛేదనలో భాగంగా ఆంధ్ర కెప్టెన్ రికీ బుయ్(72), శ్రీకర్ భరత్(52) అజేయ అర్ధసెంచరీలతో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రికీ బుయ్‌కు లభించగా.. వరుసగా రెండో గెలుపుతో ఆంధ్ర జట్టు 8పాయింట్లతో అగ్రస్థానంలోకి ఎగబాకింది.

హైదరాబాద్‌కు మళ్లీ నిరాశ.. :

గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు వరుసగా మరో ఓటమిని చవిచూసింది. రాజస్థాన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 24పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 187పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 167పరుగులే చేసింది. రాజస్తాన్ బ్యాటర్లు కార్తీక్ శర్మ(58) అర్ధసెంచరీకి తోడు దీపక్ హుడా(46) బ్యాటింగ్‌లో రాణించారు. హైదరాబాద్ బౌలర్లు రవితేజ, అంకిత్‌రెడ్డికి రెండేసి వికెట్లు, తిలక్ వర్మకు ఒక వికెట్ దక్కింది. ఇక హైదరాబాద్ బ్యాటర్లు తన్మయ్ అగర్వాల్(33), త్యాగరాజన్(32నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించగా.. తిలక్ వర్మ నిరాశపరిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కార్తీక్ శర్మకు దక్కింది. దీంతో గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు మూడు మ్యాచ్‌లు ముగిసేసరికి 4పాయింట్లతో 5వ స్థానంలో కొనసాగుతోంది.



రవిచంద్రన్ అశ్విన్

మళ్లీ ఆ ఫ్రాంచైజీల చెంతకే..

ఐపిఎల్-2025 వేలంలో ఆ ఐదుగురు ఆటగాళ్లు..

జెడ్డా: సౌదీ అరేబియా వేదికగా 24, 25 తేదీల్లో జరిగిన వేలంలో ఐదుగురు ఆటగాళ్లు మళ్లీ పాత ఫ్రాంచైజీల చెంతకు చేరారు. వీరిలో రవిచంద్రన్ అశ్విన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ట్రెంట్ బౌల్ట్, జోఫ్రా ఆర్చర్, దేవదత్ పడిక్కల్ తదితరులు ఉన్నారు. అరంగేట్రం సీజన్‌లలో వీరు ఆ ఫ్రాంచైజీల తరఫున ఆడినా.. ఆ తర్వాత వివిధ ఫ్రాంచైజీల చెంతకు చేరారు. 2025 ఐపిఎల్ సీజన్ కోసం జరిగిన వేలంలో వీరిని మళ్లీ పాత ఫ్రాంచైజీలు తమ చెంతకే చేర్చుకున్నాయి.

రవిచంద్రన్ అశ్విన్ (చెన్నై సూపర్‌కింగ్స్) :

2025 వేలంలో రవిచంద్రన్ అశ్విన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.9.75కోట్లకు కొనుగోలు చేసింది. అశ్విన్ 2009లో ధోనీ సారథ్యంలో చెన్నై తరఫున ఐపిఎల్‌లో అరంగేట్రం చేశాడు. అరంగేట్రం సీజన్‌లో అశ్విన్ కేవలం 2మ్యాచుల్లో మాత్రమే ఆడాడు. ఆ తర్వాత 2015వరకు చెన్నై ఫ్రాంచైజీలోనే కొనసాగాడు. ఆ ఫ్రాంచైజీ 2010, 2011లో టైటిళ్లను చేజిక్కించుకున్న జట్టులో అశ్విన్ ఓ ఆటగాడు. 2015 తర్వాత పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్ తరఫున ఆడిన అశ్విన్.. మళ్లీ 2025వేలంలో చెన్నై సూపర్‌కింగ్స్ కొనుగోలు చేసింది.

గ్లెన్ మ్యాక్స్‌వెల్(పంజాబ్ కింగ్స్) :



ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తిరిగి పంజాబ్ కింగ్స్ చెంతకు చేరాడు. 2020 తర్వాత పంజాబ్ కింగ్స్‌కు దూరమైన మ్యాక్స్‌వెల్.. నాలుగేళ్ల తర్వాత మళ్లీ జట్టుతో కలిసాడు. 2014 నుంచి 2017వరకు పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన మ్యాక్స్‌వెల్.. 2014 సీజన్‌లో 187.75 స్ట్రయిక్‌రేట్‌తో ఏకంగా 552పరుగులు చేశాడు. గత నాలుగేళ్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన మ్యాక్స్‌వెల్.. 2025 సీజన్‌కోసం జరిగిన వేలంలో రూ.4.20కోట్లకు మళ్లీ పంజాబ్ కింగ్స్ వేలంలో కొనుగోలు చేసింది.



ట్రెంట్ బౌల్ట్ (ముంబయి ఇండియన్స్) :

న్యూజిలాండ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ మళ్లీ ముంబయి ఇండియన్స్ దక్కించుకుంది. 2020వరకు ముంబయి ఇండియన్స్‌కు ఆడిన బౌల్ట్.. 2021 సీజన్ నుంచి 2024 వరకు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడాడు. 2020 సీజన్‌లో 15మ్యాచుల్లో 25వికెట్లు తీసిన బౌల్ట్.. ముంబయి జట్టు టైటిల్ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. 2025 సీజన్‌కోసం జరిగిన వేలంలో బౌల్ట్‌ను ముంబయి ఇండియన్స్ రూ.12.50కోట్లకు దక్కించుకుంది. జస్ప్రీత్ బుమ్రాతో కలిసి రాబోయే సీజన్‌లో అతడు పేస్ భారాన్ని మోయనున్నాడు.

జోఫ్రా ఆర్చర్ (రాజస్తాన్ రాయల్స్) : ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి రాజస్థాన్ రాయల్స్ వేలంలో దక్కించుకుంది. 2018 నుంచి 2020వరకు రాజస్తాన్ తరఫున ఆడిన ఆర్చర్.. మూడు సీజన్లలో కలిపి మొత్తం 46వికెట్లు పడగొట్టాడు. 2020 సీజన్ ఒక్కదానిలోనే ఆర్చర్ 14 మ్యాచుల్లో 20వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 2021, 22 సీజన్‌లలో గాయం కారణంగా ఐపిఎల్‌కు దూరం కాగా.. 2023 సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఆడాడు. ఐదు మ్యాచుల్లో ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు. ఆ తర్వాత ఐపిఎల్‌కు దూరంగా ఉన్నాడు. తాజా వేలంలో రాజస్తాన్ రాయల్స్ రూ.12.50కోట్లకు తిరిగి కొనుగోలు చేసింది.

దేవదత్ పడిక్కల్ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) :



ఎడమచేతి వాటం స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఈసారి వేలంలో రూ.2కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. 2020 సీజన్‌లో బెంగళూరు తరఫున ఆడిన పడిక్కల్ 473పరుగులు చేసి రాణించాడు. 2021లో ఒక సెంచరీతో కదం తొక్కాడు. ఆ తర్వాత 2022, 2023 సీజన్‌లలో రాజస్తాన్ రాయల్స్‌కు, 2024లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఆడిన పడిక్కల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గత సీజన్‌లో ఏడు మ్యాచుల్లో కేవలం 38పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. దీంతో బెంగళూరు ఫ్రాంచైజీ మరోసారి అతడి ప్రదర్శనను ఆధారంగా తీసుకొని తిరిగి వేలంలో కొనుగోలు చేసింది.

డింగ్‌కు గుకేశ్ ఝలక్

మూడోరౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ ఓటమి



సింగపూర్: ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మూడోరౌండ్‌లో గుకేశ్ విజయం సాధించాడు. బుధవారం జరిగిన మూడోరౌండ్ గేమ్‌లో గుకేశ్ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించాడు. తెల్లపావులతో మూడోరౌండ్‌లో ఆడిన గుకేశ్ 37ఎత్తుల తర్వాత విజయం సాధించాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్‌లో తెల్లపావులతో ఆడిన గుకేశ్ ఓటమిపాలవ్వగా.. మూడోరౌండ్‌లో తెల్లపావులతో ఆడి గుకేశ్‌ను చిత్తుచేయడం విశేషం. తొలిరౌండ్‌లో ఫ్రెంచ్ గేమ్‌ను ఎంచుకున్న గుకేశ్.. ఆ గేమ్‌లో పరాజయాన్ని చవిచూశాడు. గుకేశ్ డి-4తో గేమ్‌ను ప్రారంభించగా.. డింగ్ ఎస్ఎఫ్-6తో గేమ్‌ను మొదలుపెట్టాడు. ప్రపంచ టైటిల్‌కోసం ఇరువురు 14రౌండ్‌లపాటు తలపడనున్నారు. 7.5పాయింట్లు సాధించిన ఆటగాడికి విజయం దక్కనుంది. ఇక మూడోరౌండ్ ముగిసిన అనంతరం ఇరువురు 1.5-1.5పాయింట్లతో సమంగా ఉన్నారు. 2022లో చైనాకు చెందిన డింగ్ లెరెన్ రష్యాకు చెందిన నెపోంనిచ్చిని ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకొన్నాడు.

నవచిత్రం

మెప్పించే డిఫరెంట్ లవ్‌స్టోరీ



సిద్ధార్థ్, ఆషిక రంగనాథ్

హీరో సిద్దార్థ్ నటించిన లేటెస్ట్ మూవీ 'మిస్ యు'. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 29న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. 7 మైల్స్ పర్ సెకండ్ సంస్థ నిర్మాణంలో ఈ చిత్రం రూపొందింది. ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. చాలా రోజుల తరువాత ఒక క్యూట్ లవ్‌స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. గిబ్రాన్ ఈ సినిమా కోసం ఎనిమిది సూపర్బ్ ట్యూన్స్ ఇచ్చారు. మ్యూజికల్ లవ్ స్టోరీగా ఈ సినిమా ఈనెల 29న థియేటర్స్‌లో రాబోతోంది. ఈ సినిమా మీద నాకు నమ్మకం ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమాను బాగా రిసీవ్ చేసుకుంటారని అనిపిస్తుంది. శామ్యూల్ మాత్యూస్ మంచి ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ జనరేషన్‌లో ఉన్న యంగ్‌స్టర్స్ ఈ మూవీకి బాగా కనెక్ట్ అవుతారు. తెలుగులో రిలీజ్ చేస్తున్న ఏషియన్ సురేష్ సంస్థకు కృతజ్ఞతలు' అని తెలిపారు.



నితిన్, శ్రీలీల

'రాబిన్‌హుడ్' పక్కా హిట్ సినిమా

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో నితిన్ మాట్లాడుతూ,'నేను, వెంకీ కలిసి చేస్తున్న సెకండ్ ఫిల్మ్ ఇది. 'భీష్మ' మ్యాజిక్ ఈ సినిమాతో మళ్లీ రిపీట్ అవుతుందని స్ట్రాంగ్‌గా బిలీవ్ చేస్తున్నాను. శ్రీలీలతో కూడా ఇది నా సెకండ్ ఫిల్మ్. ఈ సినిమాతో హిట్ పెయిర్ అనిపించుకుంటాం. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్, సాంగ్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇంత మంచి సాంగ్స్ ఇచ్చిన జీవి ప్రకాష్‌కి థ్యాంక్స్. నిర్మాతలు నవీన్, రవి లేకపోతే ఈ సినిమా ఇంత రిచ్‌గా, ఇంత గ్రాండ్‌గా వచ్చేది కాదు. నా కెరీర్‌లోనే ఇది హయ్యస్ట్ బడ్జెట్ సినిమా. నిర్మాతలు పెట్టిన డబ్బుని రెంట్టింపుతో సహా మీనుంచి దోచుకొని డిసెంబర్ 25న 'రాబిన్‌హుడ్' వారికి ఇస్తాడు. నమ్మకంగా చెబుతున్నా ఈ క్రిస్మస్ మాదే' అని అన్నారు.

'ఇది నాకు చాలా స్పెషల్ ఫిలిం. నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర చేశాను. ఇప్పటివరకు కమర్షియల్ హీరోయిన్‌గా, డాన్సింగ్ స్పెషల్‌గా ప్రేక్షకులు చూశారు. ఈ సినిమాలో నా క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ గురించి స్పెషల్‌గా మాట్లాడుకుంటారని భావిస్తున్నాను' అని శ్రీలీల చెప్పారు.

డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ, 'ఇది చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుంది. అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.

'సినిమా చాలా బాగా వచ్చింది. డెఫినెట్ చాలా పెద్ద సినిమా అవుతుంది' అని నిర్మాతలు అన్నారు.

నాన్‌స్టాప్‌గా నవ్విస్తాం..



వెంకటేష్, ఐశ్వర్య రాజేష్

వెంకటేష్ ఎక్స్-కాప్‌గా కనిపించనున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదలకు సిద్ధమవుతోంది. ఆద్యంతం నవ్వించే సినిమాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'గోదారి గట్టుకు..' సంబంధించిన అప్‌డేట్‌ని మేకర్స్ ఇచ్చారు. ఈ పాటను డిసెంబర్ 3వ తేదీన రిలీజ్ చేయబోతున్నారు. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన ఈ పాటను సంగీత దర్శకుడు రమణ గోగుల పాడటం విశేషం. ఈ బ్రీజీ రొమాంటిక్ మెలోడీకి భాస్కరభట్ల లిరిక్స్ రాశారు. ఈ సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ జంట అందర్నీ అలరిస్తోంది.

హీరో వెంకటేష్, మరో హీరోయిన్ మీనాక్షి చౌదరితో కలసి ప్రస్తుతం డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లోకేషన్లలో ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



దీపికా పిల్లి, ప్రదీప్ మాచిరాజు


ఎవడో ఈడి కొచ్చినాడు..

హీరో ప్రదీప్ మాచిరాజు తాజాగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ యూనిక్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను దర్శక ద్వయం నితిన్, భరత్ రూపొందిస్తున్నారు. దీపికా పిల్లి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ నిర్మిస్తోంది.

ఈ చిత్రంలోని 'లే లే లే లే లే..ఎవడో ఈడి కొచ్చినాడు చూడు..' అంటూ సాగే పాటను విడుదల చేసి మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్లను ప్రారంభించారు. రధన్ స్కోర్ చేసిన ఈ ఈ పాటను హీరో మహేష్ బాబు లాంచ్ చేశారు. ప్రదీప్ ఫస్ట్ సినిమా '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' లోని 'నీలి నీలి ఆకాశం..' సాంగ్ ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలిసిందే. అదేవిధంగా ఈ పాట కూడా అదే స్థాయిలో పాపులర్ అవ్వడానికి అన్ని ఎలిమెంట్స్‌ని కలిగి ఉంది. ఉదిత్ నారాయణ్ తన మెస్మరైజ్ చేసే వాయిస్ పాటకు అదనపు ఆకర్షణను తీసుకువచ్చింది. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీని అందంగా ప్రజెంట్ చేసే రీతిలో శ్రీధర్ ఆవునూరి లిరిక్స్ అందించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ మరింత అందాన్ని తీసుకొచ్చింది. బ్లైండ్‌ఫోల్డ్ గేమ్ ద్వారా చిత్రీకరించబడిన ప్రేమకథ ఒక యూనిక్, క్రియేటివ్ కాన్సెప్ట్. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి, అద్భుతమైన గ్రామీణ నేపథ్యంలో అందంగా ఈ పాటను షూట్ చేశారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా 'వీకెండ్'

వివి ఐ పి శ్రీ హీరోగా, ప్రియా దేశపాగ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'వీకెండ్'. ఖడ్గధార మూవీస్ బ్యానర్ పై ఐ డీ భారతీ నిర్మిస్తున్నారు. బి. రాము రచయిత, దర్శకులు. పక్కా కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా చీరాలలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రారంభమైంది. ఎన్ఆర్ఐ లేళ జయ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నటుడు అజయ్ ఘోష్ క్లాప్ కొట్టారు. తొలిషెడ్యూల్ అంతా చీరాలలోనే నిర్వహిస్తామని దర్శక,నిర్మాతలు తెలిపారు. అజయ్, ఎస్తర్, డెబోర, సునిత, జబర్దస్త్ అశోక్, యోగి ఖత్రే నటిస్తున్న ఈచిత్రానికి సమర్పణ : ఈశ్వర్ - నిఖిత, డిఓపి : యూఎస్ విజయ్, సంగీతం : ఎస్ అర్జున్, ఎడిటింగ్ : ఈ ఎస్ స్టూడియో.



వివిఐపి శ్రీ, అజయ్ ఘోష్

ఆ కోటలోని రహస్యాలు ఏంటి?

'శ్రీ గాంధారి' అంటూ హన్సిక భయపెట్టిస్తూనే నవ్వించేందుకు వస్తున్నారు. మసాలా పిక్స్ బ్యానర్‌పై ఆర్ కన్నన్ దర్శకత్వం వహిస్తూ నిర్మించారు. తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని సరస్వతి డెవలపర్స్‌తో కలిసి లచ్చురామ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాజు నాయక్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీని వీకేఆర్ (విక్రమ్ కుమార్ రెజింతల) సమర్పిస్తున్నారు. హిందూ ట్రస్ట్ కమిటీకి హెడ్ ఆఫీసర్‌గా పనిచేసే యువతిగా హన్సిక ఈ చిత్రంలో నటించారు. ఆమె గంధర్వ కోట పురాతన స్మారకానికి సంబంధించిన పరిశోధన ప్రాజెక్ట్‌ను చేపట్టడంతో అసలు కథ మొదలవుతుంది. ఈ కోటలో ఉన్న ఎన్నో రహస్యాల్ని ఆమె ఎలా బయటకు తీసుకువచ్చారు? అనేదే ఈ సినిమా. ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రాజు నాయక్ సన్నాహాలు చేస్తున్నారు.



హన్సిక

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.